epaper.prajakalam.in
www.prajakalam.in

ప్రజా కలం

PRGI No: APTEL/26/A6182

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
5 Lines Rs.250 only
&
Public Notice Advertising
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

శనివారం | 01-08- 2026 | సంపుటి: 01, సంచిక: 07, గుంటూరు. | పేజీలు: 12, వెల: 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆

భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవానికి

సర్వం సిద్ధం

ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా ఘనంగా ప్రారంభం కానున్న భోగాపురం విమానాశ్రయం

10.45 గంటలకు ప్రత్యేక విమానంలో మోదీ రాక

ఎయిర్‌పోర్టులో గవర్నర్, ముఖ్యమంత్రి ఆహ్వానం

ప్రారంభోత్సవ కార్యక్రమానికి 2 లక్షల మంది

4 రోజులుగా ఏర్పాట్ల పర్యవేక్షణలో లోకేశ్ బృందం

హైదరాబాద్, బెంగళూరు, బెజవాడలకు ఎయిర్ ఇండియా సర్వీసులు

విజయనగరం, జూలై 31 (ప్రజాకలం):

ఉత్తరాంధ్రకు కొత్త రెక్కలు తెచ్చిన అద్భుతం... భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ ఘట్టానికి సర్వం సిద్ధమైంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ శనివారం ఎయిర్‌పోర్టును ఘనంగా ప్రారంభించి, జాతికి అంకితం చేస్తారు. అనంతరం ప్యాసింజర్ టెర్మినల్ భవనాన్ని ఆయన పరిశీలిస్తారు. భోగాపురం వేదికగా రూ.17,900 కోట్ల విలువైన బహుళ అభివృద్ధికార్యక్రమాలకు వర్చువల్‌గా శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేస్తారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ప్రధాని రెండున్నర గంటల పాటు భోగాపురంలో ఉంటారు. అనంతరం కర్ణాటకకు బయలుదేరి వెళతారు. ఈ మేరకు ప్రధాని పర్యటన వివరాలను ప్రధానమంత్రి కార్యాలయం విడుదల చేసింది. ఆయన ఉదయం 10.45 గంటలకు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో భోగాపురం ఎయిర్‌పోర్టులో దిగుతారు. గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబుతో పాటు కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు స్వాగతం పలుకుతారు. 10.50 గంటలకు ఓపెన్ టాప్ జీపులో మోదీ టెర్మినల్‌కు చేరుకుంటారు. అక్కడ 13వేల మంది బాలికలు థింసా నృత్యం, 200 మంది విద్యార్థిను లు కూచిపూడి నృత్యంతో స్వాగతం పలుకుతారు. అక్కడి నుంచి ఓపెన్ టాప్ జీపులో సభా వేదిక వద్దకు చేరుకుం టారు. 12.55 గంటల వరకూ అక్కడ ప్రారంభోత్సవ కార్యక్రమాలు, ప్రసంగాలు కొనసాగుతాయి.

సాంకేతిక సొబగులు

భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)తో రూ.5,640 కోట్ల వ్యయంతో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయంగా అభివృద్ధి చేశారు. ఏటా 60 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేలా దీనిని నిర్మించారు. ఆధునికమైన, నిరాటంకమైన, సమర్థమైన ప్రయాణ అనుభవాన్ని అందించడం లక్ష్యంగా ప్రయాణికుల టెర్మినల్ భవనం రూపుదిద్దుకుంది. కార్యకలాపాల సామర్థ్యాన్ని పెంచేలా, భవిష్యత్తు విమానయాన అవసరాలను తీర్చేలా మౌలిక వసతులు, సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణహిత సౌకర్యాలను విమానాశ్రయంలో ఏర్పాటు చేశారు. కృత్రిమ మేధ (ఏఐ), బిల్డింగ్ ఇన్ఫర్మేషన్ మోడలింగ్ (బీఐఎం), ఎయిర్‌సైడ్ 4.0 సాంకేతిక పరిజ్ఞానం, ఎయిర్‌పోర్ట్ ప్రిడిక్టివ్ ఆపరేషన్స్ సెంటర్(ఏపీవోసీ), బయోమెట్రిక్ ప్యాసింజర్ ప్రాసెసింగ్, ఆటోమేటెడ్ బ్యాగేజీ హ్యాండ్లింగ్ వ్యవస్థలు, ఇంటెలిజెంట్ ఆపరేషనల్ మానిటరింగ్ సొల్యూషన్స్ లాంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలను ఏర్పాటు చేశారు.

రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఈ విమానాశ్రయాన్ని తీర్చిదిద్దారు. టెర్మినల్ పైకప్పు...సంప్రదాయ కాటేజీలను, అరకు లోయ ప్రకృతి దృశ్యాలను ప్రతిబింబిస్తుంది. అలాగే ఎగిరే చేప కదలికలను గుర్తు చ్ఞపలా, ప్రాంతీయ నిర్మాణ శైలి, ఆధునిక విమానాశ్రయ డిజైన్ మేళవింపుగా దీనిని తీర్చిదిద్దారు. రాష్ట్రంలో పర్యాటకం, వాణిజ్యం, పెట్టుబడులు, ఉపాధి కల్పనకు ఈ విమానాశ్రయం గణనీయమైన రీతిలో ప్రోత్సహం ఇస్తుందని, ఈ ప్రాంతంతో విమానయాన అనుసంధానాన్ని బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు. భోగాపురం విమానాశ్రయంలో అనేక పర్యావరణహిత సౌకర్యాలను ఏర్పాటు చేశారు. వీటిలో తక్కువ విద్యుత్తును ఉపయోగించే హీటింగ్, వెంటిలేషన్, ఎయిర్ కండిషనింగ్ (హెచ్‌వీఏసీ) వ్యవస్థలు, విద్యుత్తును ఆదా చేసేలా లైటింగ్, 5 మెగా వాట్ల సోలార్ విద్యుత్ కేంద్రం, వర్షపు నీటి నిల్వ వ్యవస్థ, స్మార్ట్ బిల్డింగ్ నిర్వహణ వ్యవస్థలు, వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాలు, విద్యుత్ వాహన చార్జింగ్ వసతులు, పర్యావరణ పర్యవేక్షణకు చర్యలు ఉన్నాయి. హరిత భవన ప్రమాణాలకు అనుగుణంగా టెర్మినల్‌ను నిర్మించారు. దీన్ని యూఎస్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ లో నమోదు చేశారు.

4500 బస్సులు సిద్ధం... ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమానికి సుమారు 2.10 లక్షల మంది రానున్నట్లు అధికారులు అంచనా వేశారు ఇందుకు తగ్గట్టు 4500 బస్సులను ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి శనివారం వేకువజామున బస్సులు ప్రారంభమవుతాయి. బస్సుల్లోనే ప్రజలకు టిఫిన్ అందేలా ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం సభ ముగిసిన తరువాత భోజన పొట్లాలు అందిస్తారు.

తరువాయి 2వ పేజీలో...

రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవడమే

జగన్ లక్ష్యం

నిత్యం ఏదో ఒక అలజడి

టీడీపీలో అందరికీ పార్టీయే సుప్రీం

పార్టీ లైన్ దాటితే ఉపేక్షించేది లేదు

పార్టీ శ్రేణులతో సీఎం చంద్రబాబు

అమరావతి, జూలై 31 (ప్రజాకలం):

ప్రజలు ఛీకొట్టినా జగన్ తీరు మాత్రం మారడం లేదని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందడం జగన్ లాంటి నేర మనస్తత్వం ఉన్న రాజకీయ నాయకులకు ఏమాత్రం ఇష్టం ఉండదన్నారు. అందుకే నిత్యం రాష్ట్రంలో ఏదో ఒక అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. అనంతరం పార్టీ యూనిట్ ఇన్‌చార్జ్‌ల శిక్షణ తరగతులకు

తరువాయి 2వ పేజీలో...

మహిళా ఎస్ఐపై దాడి,

అసభ్య ప్రవర్తన

వైసీపీ నేతలపై కేసు

- చింతాడ రవికుమార్, మరో 20 మందిపై..
- ఆమదాలవలసలో మహిళా ఎస్ఐ ఫిర్యాదు
- బాధ్యులపై కఠినచర్యలకు సీఎం ఆదేశం

శ్రీకాకుళం, జూలై 31 (ప్రజాకలం):

జిల్లా జైలులో ఉన్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుకు పరామర్శ పేరిట వచ్చిన వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డి పర్యటన సాక్షిగా ఆ పార్టీ శ్రేణులు బరితెగించాయి. గురువారం శ్రీకాకుళం కొత్తరోడ్డు జంక్షన్ వద్ద బందోబస్తు విధులు నిర్వహిస్తున్న బూర్జ స్టేషన్ మహిళా ఎస్ఐ ప్రవల్లికపై ఆమదాలవలస వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్, వైసీపీ నాయకులు అనుచితంగా ప్రవర్తించిన తీరుపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. దీనిపై సీఎం చంద్రబాబు ఆరా తీసి.. మహిళా ఎస్ఐపై దురుసుగా ప్రవర్తించిన వారిపై చట్టపరంగా కఠినచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాగా.. ఈ ఘటనపై తీవ్ర మనస్తాపానికి గురైన మహిళా ఎస్ఐ ప్రవల్లిక శుక్రవారం ఆమదాలవలస పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తరువాయి 2వ పేజీలో...

మహిళల్ని అవమానించడం వైసీపీ

డీఎన్ఏలోనే ఉంది

– మంత్రి లోకేశ్

అమరావతి, జూలై 31(ప్రజాకలం):

మహిళల్ని అవమానించి, రాక్షస ఆనందం పొందడం వైసీపీ డీఎన్ఏలోనే ఉందని మంత్రి లోకేశ్ విమర్శించారు. ఈమేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. 'సొంత తల్లిని, చెల్లిని గెంటేసిన చరిత్ర జగన్ రెడ్డి గారిదైతే కనిపించిన ప్రతి మహిళను అవమానించడం వైసీపీ నాయకుల సంస్కృతి. శ్రీకాకుళంలో విధుల్లో ఉన్న మహిళా ఎస్ఐపై వైసీపీ నాయకులు ప్రవర్తించిన తీరు తీవ్ర ఆక్షేపణీయం. మహిళల భద్రత, గౌరవంతో చెలగాటమాడితే సహించేది లేదు. మహిళా అధికారిపై దాష్టీకానికి ఒడిగట్టిన వైసీపీ గూండాలపై కఠిన చర్యలు తప్పవు' అని స్పష్టం చేశారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు

పకడ్బందీ ఏర్పాట్లు

– టీటీడీ జేఈవో శరత్

తిరుపతి(టీటీడీ), జూలై 31 (ప్రజాకలం): 'తిరుమల శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాలు, పెరటాసి శనివారాల సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంది. వారికి ఎక్కడా అసౌకర్యం కల్గకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి' అని అధికారులను టీటీడీ జేఈవో శరత్ ఆదేశించారు. శుక్రవారం తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలోని తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. 'భక్తుల వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని తిరుపతి నగరం, పరిసర ప్రాంతాల్లో తగిన పార్కింగ్ స్థలాలు సిద్ధం చేయాలి. వివిధ ప్రాంతాల్లో హోల్డింగ్ పాయింట్లు పెట్టి.. ట్రాఫిక్‌ను సమర్థవంతంగా నియంత్రించాలి. ఈ ప్రాంతాల్లో మొబైల్ మరుగుదొడ్లు, స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యాలు కల్పించి.. పరిశుభ్రతను నిరంతరం పర్యవేక్షించాలి. తిరుపతితోపాటు పరిసర ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్లు, రహదారులు, భక్తులు అధిక సంఖ్యలో సంచరించే ప్రాంతాల్లో స్వాగత తోరణాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి. ముఖ్య ప్రాంతాల్లో క్యూఆర్ కోడ్‌లతో సూచిక బోర్డులు ఉండాలి. స్థానిక ఆలయాలు, ప్రధాన భవనాలు, ప్రధాన రహదారులను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించి ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పించాలి' అని ఇంజనీరింగ్ అధికారులను జేఈవో ఆదేశించారు. టీటీడీ ప్రజా సంబంధాల విభాగం ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండు, అలిపిరి బస్టాండు, అలిపిరి నడకమార్గం, విష్ణునివాసం, శ్రీనివాసం తదితర ప్రాంతాల్లో అదనపు సహాయక కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మహతి కళాక్షేత్రం, రామచంద్ర పుష్కరిణి, అన్నమాచార్య ప్రాజెక్టులో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. భక్తులకు అవసరమైన ప్రాంతాల్లో శ్రీవారి సేవకులను నియమించాలని టీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారి రవికి ఆదేశాలిచ్చారు. ఎస్ఈ-1 మనోహరం, ఎస్ఈ(ఎలక్ట్రికల్) వెంకటేశ్వర్లు, డీఈలు రవిశంకర్‌రెడ్డి, సరస్వతి, విజిలెన్స్ అధికారి గిరిధర్, అదనపు ఆరోగ్య అధికారి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

అంబటి రాంబాబుపై

సీఐడీ కేసు

గుంటూరు, జూలై 31(ప్రజాకలం): : వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబుపై సీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు సంకెళ్లు వేసినట్లు ఆయన అభ్యంతరకర వీడియోను రూపొందించి సోషల్ మీడియాలో పోస్టు చేశారని టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. పెమ్మసానిని కించపరిచేలా, ఆయన ప్రతిష్ఠను దిగజార్చేలా వ్యవహరించిన అంబటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గుంటూరు ఎస్పీ వకుల్ జిందాల్, మంగళగిరిలోని సీఐడీ అదనపు డీజీ కార్యాలయంలో ఎస్పీ రెడ్డి గంగాధర్‌కు శుక్రవారం వారు ఫిర్యాదు చేశారు.

పరామర్శ యాత్ర కాదు..

బలప్రదర్శన యాత్ర

చనిపోయిన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించడం చూశాం గానీ, హత్య చేసిన వ్యక్తిని పరామర్శించడం జగన్‌కే చెల్లింది

ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

కాకినాడ, జులై 31 (ప్రజాకలం):

ప్రపంచంలో ఎక్కడైనా చనిపోయిన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించడం చూశాం గానీ, హత్య చేసిన వ్యక్తిని పరామర్శించడం వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కే చెల్లిందని ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఎద్దేవా చేశారు. శుక్రవారం కాకినాడ జిల్లాలోని అన్నవరంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇది పరామర్శ యాత్రగా కాకుండా, బలప్రదర్శన యాత్రగా మాజీ సీఎం జగన్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ ప్రారంభోత్సవ వండగ వాతావరణంలో ఉంటే.. వైఎన్ జగన్ ఓర్వలేనితనంతో అలజడులు సృష్టించాలని చూస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం నీరు పారించాలని చూస్తుంటే, గొడ్డలి పార్టీ రక్తాన్ని పారించాలని చూస్తోందని మంత్రి నిమ్మల మండిపడ్డారు. దారిన పోయే దానయ్య చనిపోతే నష్టమేంటని వైఎస్ జగన్ మాట్లాడుతున్నారని చెప్పారు. దానయ్యకు 45 ఏళ్ళు వచ్చాయి.. వయసైపోయిన వ్యక్తి చనిపోతే నష్టమేంటని ఆయన ప్రశ్నిస్తున్నారని అన్నారు. మరి 54 ఏళ్ళు వచ్చిన గొడ్డలి పార్టీ అధినేతకు కూడా వయసై పోయినట్లే కదా? అని వ్యంగ్యంగా ప్రశ్నించారు. ఖాకీ డ్రెస్ అన్నా.. మహిళలన్నా గొడ్డలి పార్టీ నాయకుడికి గౌరవం లేదని విమర్శించారు.

తరువాయి 2వ పేజీలో...

అయోధ్య రాముని విరాళాలపై కఠిన నిఘా

ఢిల్లీ, జులై 31 : అయోధ్య రాముని విరాళాలపై కఠిన నిఘా ఉంచాలని శ్రీరామ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్టు నిర్ణయం తీసుకుంది. విరాళాల సేకరణ, లెక్కింపు ప్రక్రియ మొత్తాన్ని 360 డిగ్రీల కెమెరాలతో వీడియో రికార్డింగ్ చేయాలని ఈ ట్రస్ట్ ఆదేశించింది. రామమందిరంలో విరాళాల సేకరణ, లెక్కింపుపై కట్టుదిట్టమైన భద్రత నిఘా ఏర్పాటు చేయాలని హుకుం జారీ చేసింది. హుండీల నిర్వహణలో జులై 25వ తేదీ నుంచే అమల్లోకి కొత్త భద్రతా నిబంధనలు వచ్చాయని స్పష్టం చేసింది. లెక్కింపు గది నుంచి ఖాళీ పెట్టెలు తీసుకెళ్లడం, విరాళాలు సేకరించడం, సీల్ వేసి రవాణా చేయడం వరకు అంతా కెమెరాల నిఘాలోనే ఉంచాలని శ్రీరామ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్టు ఆదేశించింది. నిరంతర వీడియో రికార్డింగ్ కోసం ఇద్దరు ప్రొఫెషనల్ వీడియో గ్రాఫర్లను నియమిస్తున్నట్లు తెలిపింది. బ్యాంక్ ఉద్యోగులు, ట్రస్ట్ ప్రతినిధులు, ప్రైవేట్ సెక్యూ

రిటీతో ఎనిమిది మంది సభ్యుల మానిటరింగ్ టీమ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. ఈ క్రమంలోనే అయోధ్య ఆలయంలోని 40 విరాళాల పెట్టెలను ఒకేసారి కాకుండా రోజువారీగా అధికారులు ఖాళీ చేస్తున్నారని శ్రీరామ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్టు వెల్లడించింది. హుండీ పెట్టెలను లెక్కింపు గదికి చేర్చిన తర్వాత స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు సీల్ వేస్తున్నారని తెలిపింది. ఈ ఆలయంలో విరాళాల దొంగతనం ఆరోపణలు,సిట్ అధికారుల విచారణ నేపథ్యంలో చర్యలు చేపట్టినట్లు శ్రీరామ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్టు స్పష్టం చేసింది.

భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం

మొదటి పేజీ తరువాయి...

భోజన సరఫరా పనులను ఏజెన్సీలకు అప్పగించారు. మరోవైపు మండలాలు, నియోజకవర్గాలు, డివిజన్లు, జిల్లాలవారీగా క్లస్టర్లను విభజించి అధికారులు, సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు. విమానాశ్రయం సమీపంలో 10 చోట్ల పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా నేతృత్వంలో.. ఉత్తరాంధ్రకు చెందిన ఎస్పీలు, డీఐజీ స్థాయి అధికారులు బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు.

శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలు....భోగాపురం పర్యటనలో భాగంగా.. విశాఖపట్నంలో రూ. 460 కోట్లకు పైగా పెట్టుబడితో అభివృద్ధి చేస్తున్న ఏఎస్ఐపీ సెమీ కండక్టర్ ప్రాజెక్టుకు ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారు. దీనిని కొరియా రిపబ్లిక్‌కు చెందిన ఏపీఏసీటీ భాగస్వామ్యంతో ఏఎస్ఐపీ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ అభివృద్ధి చేస్తోంది. ఇది ఆంధ్రప్రదేశ్‌లో తొలి సెమీ కండక్టర్ తయారీ కేంద్రం. దీనికి ఇండియా సెమీ కండక్టర్ మిషన్ పరిధిలో ఆమోదం లభించింది. ఈ ప్లాంట్ ఏటా సుమారు 96 మిలియన్ల సెమీకండక్టర్ చిప్‌లను తయారు చేయడంతో పాటు అధిక నైపుణ్యం కలిగిన ఉద్యోగావకాశాలను కల్పిస్తుంది. అదే సమయంలో సెమీకండక్టర్ తయారీకి తోడ్పాటు అందించేలా పటిష్ఠమైన అనుబంధ వ్యవస్థను ప్రోత్సహిస్తుంది. కర్నూల్- రెన్యువబుల్ ఎనర్జీ జోన్ (ఆర్ఈజడ్)-ఫేజ్- శ్రీ(4.5 గిగావాట్లు) ఏకీకరణ కోసం ఏర్పాటు చ్ఛస సరఫరా వ్యవస్థకు ప్రధాని శంకుస్థాపన చేస్తారు. దీనిని స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పీవీ) ద్వారా రూ. 5,550 కోట్ల పెట్టుబడితో పవర్ గ్రిడ్ అమలు చేస్తోంది. రూ. 3,550 కోట్ల వ్యయంతో నిర్మించే కర్నూలు పవన విద్యుత్ జోన్/సౌర విద్యుత్ జోన్ పార్ట్ ఏ, పార్ట్ బీ ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను ప్రధాని మోదీ ప్రారంభిస్తారు. అలాగే రూ. 820 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన అనంతపురం (2,500 మెగావాట్లు), కర్నూలు (1,000 మెగావాట్లు) సౌర విద్యుత్ జోన్ల ట్రాన్స్‌మిషన్ పథకాన్ని కూడా ప్రారంభిస్తారు. దీనిని పవర్ గ్రిడ్ ద్వారా అమలు చేస్తున్నారు. ఈ సరఫరా ప్రాజెక్టులు... కర్నూలు, అనంతపురంలో ఉన్న పునరుత్పాదక ఇంధన జోన్ల నుంచి ఉత్పత్తి అయిన విద్యుత్ తరలింపును సులభతరం చేస్తాయి. తద్వారా జాతీయ గ్రిడ్ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న లబ్ధిదారులకు విద్యుత్ సరఫరా చేస్తాయి. అలాగే భారీ పరిమాణంలో పునరుత్పాదక విద్యుత్తును అనుసంధానించడాన్ని కూడా సులభతరం చేస్తాయి. డిమాండ్ ఉన్న ప్రాంతాలకు స్వచ్ఛ విద్యుత్ సరఫరాను మెరుగుపరుస్తాయి. మోదీ తన పర్యటనలో భాగంగా.. రూ. 1,880 కోట్ల విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తారు. ఎన్‌హెచ్-365 బీజీలో రేచర్ల నుంచి గుర్వాయిగూడెం వరకు, గుర్వాయిగూడెం నుంచి దేవరపల్లి వరకు ఉన్న సెక్షన్‌లో నాలుగు లేన్ల ప్రవేశ నియంత్రిత గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారులను, ఎన్‌హెచ్-67పై నాలుగు లేన్ల తాడిపత్రి బైప్ష?సనూ జాతికి అంకితమిస్తారు. ఎన్‌హెచ్-565లోని పెంచలకోన-యేర్పేడు విభాగంలో లింగసముద్రం వద్ద హైలెవెల్ వంతెనకు శంకుస్థాపన చేస్తారు. ఈ ప్రాజెక్టులన్నీ విజయవాడ, ఇతర నగరాల్లో ట్రాఫిక్ రద్దీని తగ్గిస్తాయి. రోడ్డు భద్రతను పెంపొందిస్తాయి. విశాఖపట్నం నుంచి హైదరాబాద్ మధ్య ప్రయాణ దూరాన్ని, ప్రయాణ సమయాన్ని తగ్గిస్తాయి. ప్రాంతీయ అనుసంధానాన్ని పెంపొందిస్తాయి.

భోగాపురం వెళుతున్నా! 'ఎక్స్'లో ప్రధాని పోస్టు

విజయనగరం జిల్లా భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని శనివారం ప్రారంభించనున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎక్స్‌లో పోస్టు చేశారు. మౌలిక వసతుల కల్పనకు ఈ విమానాశ్రయం ఊతమి స్తుందని పేర్కొన్నారు. ప్రధాని పోస్టును సీఎం చంద్రబాబు రీపోస్టు చేశారు. భోగాపురం విమానాశ్రయం ప్రారంభంతో అభివృద్ధిలో ఉత్తరాంధ్ర టేకాఫ్ తీసుకోనుందని సీఎం పేర్కొన్నారు.

కర్ణాటకలో.. కర్ణాటకలోని మైసూరులోని శ్రీ రామకృష్ణ ఆశ్రమంలో స్వామి వివేకానంద కల్చరల్ యూత్ సెంటర్ వివేక స్మారకాన్ని ప్రధాని మోదీ ప్రారంభిస్తారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవడమే జగన్ లక్ష్యం

మొదటి పేజీ తరువాయి...

హాజరై, కాఫీ కబుర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉందని తెలిపారు. భోగాపురం విమానాశ్రయంతో ఉత్తరాంధ్ర అభివృద్ధి కొత్తపుంతలు తొక్కనుందన్నారు. విమానాశ్రయంతో పాటు ఆర్సెలార్ మిట్టల్, గూగుల్ డేటా సెంటర్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు ఉత్తరాంధ్రకు వచ్చాయన్నారు. రాయలసీమ ప్రాంతం పునరుత్పాదక ఇంధన హబ్‌గా రూపొందుతోందని, పారిశ్రామికంగానూ ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కోస్తా ప్రాంతంలో రాజధానితో పాటు పలు సంస్థలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఇంత చేస్తున్నా విపక్ష నేతగా జగన్ రాష్ట్రాభివృద్ధికి మరింత నిర్మాణాత్మక సూచనలు చేయాల్సింది పోయి అడుగడుగునా అభివృద్ధిని అడ్డుకునేలా అలజడులు సృష్టిస్తున్నారని తెలిపారు. రాష్ట్రానికి తలమానికమైన భోగాపురం విమానాశ్రయాన్ని ప్రారంభించుకుంటున్న వేళ జగన్ వందల మందిని పోగేసి విధ్వంస యాత్రలు చేయడం ఏమిటన్నారు.

పార్టీకి నష్టం కలిగించే పనులు చేయొద్దు... అధినేత మొదలు సాధారణ కార్యకర్త వరకు ప్రతి ఒక్కరికీ పార్టీయే సుప్రీం అని చంద్రబాబు స్పష్టం చేశారు. ఎవరైనా తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండాల్సిందేనని అన్నారు. ఈ నియమాన్ని ఉల్లంఘించే వారు ఎంతటి వారైనా సహించేది లేదని హెచ్చరించారు. పార్టీ లైన్ దాటిన వారు మంత్రులైనా, ఎమ్మెల్యేలైనా.. ఎవరినైనా పిలిపించి మాట్లాడుతామని స్పష్టం చేశారు. ఒకటికి రెండుసార్లు చెప్పి చూస్తామని, ఆ తర్వాత కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీకి నష్టం కలిగించే వారిని పక్కన పెట్టేందుకు వెనుకాడబోనన్నారు. ఏ రూపంలోనూ పార్టీకి నష్టం కలిగించే పనులు చేయవద్దని పార్టీ శ్రేణులను ఆదేశించారు.

పరామర్శ యాత్ర కాదు.. బలప్రదర్శన యాత్ర

మొదటి పేజీ తరువాయి...

ఆడవాళ్ళ జోలికొస్తే అదే ఆఖరి రోజు అని సీఎం చంద్రబాబ వ్యాఖ్యలు.. గొడ్డలి పార్టీకి కూడా వర్తింపచేయాలని ఆయన డిమాండ్ చేశారు. చనిపోయిన వ్యక్తిని కాదని, చంపిన వ్యక్తిని పరామర్శించడం సరికాదని.. మాజీ మంత్రి బొత్స లాంటి వారు కూడా జగన్‌కు ఎందుకు చెప్పలేకపోయారంటూ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని పాటిస్తామని ప్రమాణం చేసిన వ్యక్తి.. హత్య చేసిన వ్యక్తిని ఓదార్చడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. ఎర్ర బస్సు రాని ఊరికి, ఎయిర్ బస్ ఎందుకని నాడు జగన్ ప్రశ్నించారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కోర్టులకు వెళ్లి మరీ భోగాపురం ఎయిర్ పోర్టు రాకుండా అడ్డుకుంటానని జగన్ చెప్పిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. జగన్‌కున్న క్రెడిట్ చోరీ జబ్బును అందరికీ అంటించాలని చూస్తున్నాడని ఆరోపించారు. పోలవరం నుంచి 3 వేల టీఎంసీల నీరు వృధాగా సముద్రంలో కలసిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ధవళేశ్వరంకు ఎగువన నీటి నిల్వ కోసం, ఒక్క ప్రాజెక్టు కూడా లేకపోవడం చూసి సర్ ఆర్థర్ కాటన్ మనవరాలు ఆవేదన చెందారని చెప్పారు. నాడు చంద్రబాబు ప్రతి సోమవారాన్ని పోలవరంగా మార్చుకుని 72 శాతం ప్రాజెక్టు పనులు పూర్తి చేశారని వివరించారు. 2019లో ప్రభుత్వం మారకుండా ఉండి ఉంటే, 2024 నాటికి పోలవరం పూర్తయి అటు ఉత్తరాంధ్రకు, ఇటు రాయలసీమకు గోదావరి జలాలు వెళ్లి ఉండేవని అన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ గొడ్డలి పార్టీ అధికారంలోకి వచ్చి పోలవరాన్ని ధ్వంసం చేసి, డయాఫ్రం వాల్‌ను విధ్వంసం చేశారని మండిపడ్డారు. నాడు ఇరిగేషన్ మంత్రులు, సీఎం, పోలవరం ఎప్పుడు పూర్తవుతుందో చెప్పలేమంటూ అసెంబ్లీలోనే చెప్పి, ఆ ప్రాజెక్టును ప్రశ్నార్థకం చేశారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు మొదటి పర్యటన పోలవరంకు వచ్చి 2027 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తయ్యేలా లక్ష్యంగా పెట్టారని వివరించారు. గత ప్రభుత్వంలో విధ్వంసం అయిన డయా ఫ్రం వాల్‌ను పూర్తి చేసి.. ఈసీఆర్ఎఫ్ డ్యాం పనులను వేగవంతం చేశామని అన్నారు. పోలవరం పూర్తయ్యేలోగా ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తీసుకెళ్లేలా నాడు చంద్రబాబు పురుషోత్తమపట్నం లిఫ్ట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారని పేర్కొన్నారు. పురుషోత్తపట్నం లిఫ్ట్ ద్వారా ఉత్తరాంధ్ర ప్రాంత సాగు, తాగునీటి అవసరాలతో పాటు పారిశ్రామిక అవసరాలకు నీరందిస్తున్నామని వివరించారు. 5 ఏళ్ళ గొడ్డలి పార్టీ పాలనలో పోలవరం ఎడమ కాలువ పనుల్లో తట్ట మట్టిగానీ, రూపాయి పని గానీ చేయలేదని వైసీపీని విమర్శించారు. తమ పాలనలో పోలవరం ఎడమ కాలువ పనుల వైపు కన్నెత్తి చూడని గొడ్డలి పార్టీకి ఉత్తరాంధ్ర గురించి మాట్లాడే నైతిక హక్కులేదన్నారు.

జగన్ ఇరిగేషన్ శాఖలో రూ. 18 వేల కోట్ల బకాయిలు వారసత్వంగా ఇచ్చి వెళ్లారంటూ వైఎస్ జగన్‌పై నిప్పులు చెరిగారు. ఉత్తరాంధ్రకు న్యాయం చేయాలని రూ. 1,800 కోట్లు ఖర్చు పెట్టి పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తి చేస్తున్నామని ఆయన వివరించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు పోలవరం ఎడమ కాలువలో ఉన్న క్లిష్టతరమైన పనులను రెండేళ్ళలోనే పూర్తి చేశామని ప్రకటించారు. ఆగస్టులోనే పోలవరం ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తీసుకెళ్లాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని వివరించారు. పోలవరం ఎడమ కాలువ పనుల జాప్యం నేపథ్యంలో ఏజెన్సీలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా అయితే చర్యలు తప్పవని అధికారులను మంత్రి నిమ్మల రామానాయుడు హెచ్చరించారు.

మహిళా ఎస్ఐపై దాడి, అసభ్య ప్రవర్తన

మొదటి పేజీ తరువాయి...

ఈ మేరకు ఆమదాలవలస ఎస్ఐ సనపల బాలరాజు విచారణ చేపట్టి చింతాడ రవికుమార్‌తోపాటు మరో 20 మందిపై కేసులు నమోదు చేశారు. ఏ1 చింతాడ రవికుమార్‌పై బీఎన్ఎస్ సెక్షన్లు 109, 189(2), 191(2), 221, 121, 74, 79, 351(2), రెడ్ విత్ 190 కింద హత్యాయత్నం, విధి నిర్వహణలో ఉన్న మహిళా అధికారిపై దాడి, అసభ్యప్రవర్తన తదితర నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. మరో 20 మంది అనుచరులపైనా ఇదే తరహాలో కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో చింతాడ రవికుమార్ ఓ వీడియో రిలీజ్ చేసి, అనుచరులతోపాటు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. వీరికోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

ఎఫ్ఐఆర్ ఎలా లీకైంది?

వైసీపీ నాయకులపై, అనుచరులపై కేసు నమోదు చేసిన విషయం అధికారికంగా బయటకు రాకముందే.. తనపై ఏఏ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారో వివరిస్తూ నిందితుడు చింతాడ రవికుమార్ వీడియో విడుదల చేయడం కలకలం రేపింది. తనపై ఆమదాలవలస పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులను, సెక్షన్లను వివరిస్తూ సోషల్ మీడియాలో వీడియోను పోస్ట్ చేశారు. "తన తప్పేమీ లేదని, ఎస్ఐ ప్రవల్లిక ఇప్పటికే అనారోగ్యంతో ఉన్నారని, ఆమెకు జాగ్రత్త చెప్పానని. అదే సమయంలో జనాలు 'జై జగన్' అని అరిచారని" తెలిపారు. కాగా.. ఎఫ్ఐఆర్ నమోదు కాగానే.. సెక్షన్లతోపాటు ఎలా లీకైందంటూ జిల్లా పోలీస్ కార్యాలయంలో చర్చనీయాంశంగా మారింది. ఈ ఉదంతంపై తెలుగుదేశం పార్టీ శ్రేణులు తీవ్రంగా విమర్శిస్తున్నాయి. చింతాడ రవికుమార్‌పై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు.. నిందితుడికి పోలీసుల వివరాలు ముందుగానే లీక్ చేసిన పోలీసులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పీయూసీ చైర్మన్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ డిమాండ్ చేశారు.

అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సూపర్ సిక్స్‌పథకాలు

బద్వేలు టిడిపి ఇన్చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి

బద్వేలు : 2 ఏళ్ల నమ్మకం –అభివృద్ధి, సంక్షేమం" ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి .బద్వేల్ నియోజకవర్గంలో నిర్వహిస్తున్న "2 ఏళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం" ఇంటింటి ప్రచార కార్యక్రమంలో భాగంగా రెండో రోజు బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన తల్లికి వందనం, మహిళా శక్తి, అన్నదాత సుఖీభవ, దీపం-2, ఎన్టీఆర్ భరోసా, సూపర్ సిక్స్ తదితర సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలు, సూచనలు తెలుసుకుని మై టిడిపి యాప్ ద్వారా నమోదు చేశారు.ఈ సందర్భంగా 15వ వార్డుకు చెందిన స్థానిక ప్రజలు మంచూరు సూర్యనారాయణ రెడ్డి కార్యాలయానికి వచ్చి తమ రహదారి సమస్యను వివరించారు. దీనిపై వెంటనే స్పందించిన మంచూరు సూర్యనారాయణ రెడ్డి మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి రహదారి పనులకు ఆమోదం పొందించారు. అనంతరం ఇంటింటి ప్రచార కార్యక్రమంలో భాగంగా స్థానిక నాయకులు, మహిళలతో కలిసి రహదారి పనులకు శంకుస్థాపన నిర్వహించారు×అదేవిధంగా 15వ వార్డులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మమేకమయ్యారు. వారి విద్యా పరిస్థితులు, మౌలిక వసతులు మరియు ఇతర సమస్యలను అడిగి తెలుసుకుని, అవసరమైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంచూరు సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం మరియు సమగ్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

ఏపీ బీజేపికి ఏమైంది?

విశాఖపట్టణం : ఏపీలో భారతీయ జనతా పార్టీ పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదు. ఆ పార్టీ అనుకున్న స్థాయిలో ముందుకెళ్లడం లేదు. పొత్తులో భాగంగా సీట్లు, ఓట్లు పెరిగాయే తప్ప.. గత రెండు సంవత్సరాలుగా ఆ పార్టీ పుంజుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఆ పార్టీలో పెద్దగా చేరికలు లేవు. చేరిన వారు సైలెంట్ గా ఉన్నారు. పాత నేతలు వ్యూహాత్మక సైలెన్స్ పాటిస్తున్నారు. పొత్తులో భాగంగా పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ పని తాను చేసుకుంటున్నారు. ఎందుకో పార్టీని అభివృద్ధి చేసే ఆలోచన ఆ పార్టీ నేతల్లో కనిపించడం లేదు. ఏపీ విషయంలో హై కమాండ్ సైతం పెద్దగా పట్టించుకోవడం లేదు.రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీకి 8 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ముగ్గురు ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఒక రాష్ట్ర మంత్రి ఉన్నారు. ఒక కేంద్రమంత్రి కొనసాగుతున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి తన ముద్ర చూపలేకపోతోంది ఏపీలో. కనీస స్థాయిలో చురుకైన పార్టీ కార్యక్రమాలు కూడా లేవు. అదే తెలంగాణలో అయితే నిత్యం బిజెపి పెద్దల పర్యటనలు, ప్రభుత్వ వైఫల్యాలపై కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే ఏపీలో అది సాధ్యం కాదు. ఎందుకంటే బిజెపి ఇక్కడ మిత్రపక్షం. అయితే పార్టీ పరంగా కూడా యాక్టివ్గా కార్యక్రమాలు లేవు. ఇతర పార్టీల నుంచి చేరికలు లేవు. ఫలితంగా ఆ పార్టీ అనుకున్న స్థాయిలో పుంజుకోలేకపోతోంది.పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పివిఎన్ మాధవ్ వ్యవహరిస్తున్నారు. ఆయన బాధ్యతలు తీసుకున్నాక పార్టీ మరింత పుంజుకుంటుందని అంచనా వేశారు. కానీ ఎందుకో అనుకున్న స్థాయిలో ముందుకు వెళ్లలేకపోతోంది. పార్టీ బాధ్యతలు తీసుకున్న కొత్తలో రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలకు సిద్ధపడ్డారు మాధవ్.

తరువాత చురుకుదనం తగ్గింది. కేవలం కూటమితో ముందుకు వెళ్లడమే తప్పించి.. స్వతంత్రంగా ఏపీలో పార్టీ ముందుకెళ్లే పరిస్థితి లేదు. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలు ముంచుకొస్తున్నాయి. కనీసం బిజెపి ఉనికి చాటుకుంటుందా? లేదా అన్నది అనుమానమే. తమ పార్టీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న చోట కూడా స్థానిక నాయకత్వం ఇబ్బందికర పరిస్థితుల్లో ఉంది. అయితే భారీగా చేరికలు ఉంటాయని అప్పట్లో అంచనాలు ఉండేవి. కానీ ఎందుకో ఇప్పటికే చేరిన వారు యాక్టివ్ గా లేరు. అందుకే కొత్తగా ఎవరూ ముందుకు రావడం లేదు. మరి ఏపీ విషయంలో బిజెపి ఆలోచన ఏంటో ఇంతవరకు తెలియడం లేదు. ఇలా అయితే ఆ పార్టీకి కష్టమే..

బుట్టాయగూడెం- పట్టిసీమ- కొవ్వూరు

రూ.705 కోట్లతో రెండు లైన్లుగా విస్తరణ

ఏలూర : ఏపీలో ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న జాతీయ రహదారి విస్తకరణకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని నేషనల్ హైవే 365బీబీలో 44.70 కిలోమీటర్లు రెండు లైన్లుగా విస్తరించేందుకు మోర్త్ నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. రూ. 705 కోట్లతో నిర్మించే ఈ హైవేలో రెండుచోట్లు బైపాస్‌లు కూడా ప్లాన్ చేస్తున్నారు. గతవారం మోర్త్ నుంచి హైవే విస్తరణకు లైన్ క్లియర్ అయ్యింది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రం సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల విస్తరణపై ఫోకస్ పెట్టింది. జిల్లాల వారీగా అవసరమైన చోట్ల రోడ్ల విస్తరణకు సంబంధించి కేంద్రానికి ప్రతిపాదనలు పంపించగా.. ఒక్కో ప్రాజెక్టుకు లైన్ క్లియ్ అవుతోంది. తాజాగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని బుట్టాయగూడెం- పట్టిసీమ- కొవ్వూరు హైవే విస్తరణకు సంబంధించి కేంద్రం నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది.. మొత్తం 44.70 కిలోమీటర్ల రోడ్డును విస్తరించనున్నారు. ఈ హైవేను రూ. 705 కోట్లతో పది మీటర్ల వెడల్పు, రెండు వరుసలుగా విస్తరణను మోర్త్ (కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ) స్టాండింగ్ ఫైనాన్షియల్ కమిటీ ఆమోదించింది.నేషనల్ హైవే 365బీబీ తెలుగు రాష్ట్రాల మధ్య ఉంది.. ఈ రోడ్డు సూర్యాపేట నుంచి మొదలై ఖమ్మం, వైరా మీదుగా.. ఏపీలోని జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, పట్టిసీమ మీదుగా కొవ్వూరు వరకు ఉంది. బుట్టాయగూడెం-పట్టిసీమ-కొవ్వూరు రోడ్డు 44.70 కిలోమీటర్లు విస్తరించలేదు. ఈ రోడ్డు ప్రాధాన్యతను గుర్తించిన ఎన్‌హెచ్ అధికారులు విస్తరించేందుకు మోర్త్‌కు ప్రతిపాదనలు పంపించారు.. కానీ కొన్ని కారణాలతో అనుమతులు ఆలస్యం అయ్యాయి. రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి ఈ రోడ్డు విస్తరణ అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లగా.. మోర్త్ స్టాండింగ్ ఫైనాన్షియల్ కమిటీ సమావేశంలో ఆమోదం వచ్చింది.ప్రస్తుతం విస్తరించబోతున్న హైవేలో ఉన్న పట్టిసీమకు పోలవరం ప్రాజెక్ట్ 3 కిలోమీటర్ల దూరంలో ఉంది. పోలవరం పూర్తిచేస్తే పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది.. అప్పుడు పట్టి సీమ మీదుగా వాహనాల సంఖ్య పెరుగుతుంది. ఈ విషయాన్ని గుర్తించి పట్టిసీమ దగ్గర బైపాస్ నాలుగు వరుసలతో (3.20 కిమీ) కూడా రాబోతుండగా.. ఈ బైపాస్ కోసం డీపీఆర్ త్వరలో సిద్ధం చేయనున్నారు. కన్నాపురం దగ్గర మరో బైపాస్ ప్లాన్ చేయగా.. దీనిపై క్లారిటీ రావాల్సి ఉంది. ఇటు పశ్చిమగోదావరి జిల్లాలో మరో హైవేను నాలుగు వరుసలుగా విస్తరించున్నారు. రూ. 2,700 కోట్లతో ఆకివీడు నుంచి దిగమర్రు వరకు 40 కిలోమీటర్ల మేర రోడ్డును విస్తరించనున్నారు. డీపీఆర్‌లో ఆకివీడు, ఉండి, భీమవరం దగ్గర బైపాస్‌లు ప్లాన్ చేశారు.

ఆ ఇద్దరు ఎవరు?

విజయవాడ : ఏపీలో ఇద్దరు గవర్నర్ కోటా ఎమ్మెల్సీల పదవీకాలం పూర్తౌంది. ఎమ్మెల్సీలు జకియా ఖానం, రవీంద్రబాబు పదవీకాలం పూర్తయ్యింది. శాసనమండలి అధికారులు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు ఎమ్మెల్సీ పదవి కోసం టీడీపీలో ఆశావహుల సంఖ్య పెరుగుతోంది. పలువురు సీనియర్ నేతల పేర్లు రేసులో వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికపై అధినేత చంద్రబాబు నాయుడు ఇప్పటికే కసరత్తు ప్రారంభించినట్లు సమాచారం.ఆంధ్రప్రదేశ్‌లో ఇద్దరు గవర్నర్ కోటా ఎమ్మెల్సీల పదవీకాలం పూర్తయ్యింది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఎన్నికైన జకియా ఖానం, పండుల రవీంద్రబాబు పదవీకాలం పూర్తయ్యింది. ఈ మేరకు శాసనమండలి అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జకియా ఖానం ప్రస్తుతం ఏపీ శాసనమండలి డిప్యూటీ ఛైర్ పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. దీంతో కొత్త ఎమ్మెల్సీల ఎంపికతోపాటుగా.. డిప్యూటీ ఛైర్ పర్సన్ ఎన్నిక కూడా చేపట్టాల్సి ఉంది. మరోవైపు శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ పదవికి వైసీపీ నుంచి ఆ పార్టీ ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు పేరు గట్టిగా వినిపిస్తోంది. ఈ పదవి కోసం వరుదు కళ్యాణి, ఇసాకా భాషాల పేర్లు వినిపించినప్పటికీ.. మాధవరావువైపు వైసీపీ మొగ్గుచూపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ పదవికి ఎన్నిక జరిగేలోగా పేరును అధికారికంగా ప్రకటించవచ్చని సమాచారం.మరోవైపు ఖాళీ అయిన రెండు ఎమ్మెల్సీ స్థానాల కోసం టీడీపీలో ఆశావహుల జాబితా పెరుగుతోంది. పలువురు సీనియర్ నేతలు ఎమ్మెల్సీ స్థానం కోసం రేసులో ఉన్నారు. రెండు స్థానాల కోసం ఏకంగా 20 మంది వరకూ పోటీ పడుతున్నట్లు తెలిసింది. రాజ్యసభ అవకాశం చేజార్చుకున్న సీనియర్ నేతలు, గతంలో సీటు ఆశించి భంగపడ్డ నాయకులు ఈ జాబితాలో ఉన్నారు. ముఖ్యంగా మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, వర్ల రామయ్య, టీడీ జనార్దన్, వంగవీటి రాధా, బుద్దా వెంకన్న, గొట్టిపాటి రామకృష్ణ, తిప్పేస్వామి, శ్రీనివాసులరెడ్డి వంటి నేతల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. మరోవైపు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై సీఎం చంద్రబాబు నాయుడు ఇప్పటికే కసరత్తు జరుపుతున్నట్లు తెలిసింది. రెండు స్థానాలను కూడా టీడీపీనే తీసుకుంటుందనే వార్తలు వస్తున్నాయి.ఇటీవల భర్తీ చేసిన రాజ్యసభ స్థానాలలో ఒకటి జనసేనకు కేటాయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఖాళీ అవుతున్న రెండు ఎమ్మెల్సీ స్థానాలను తామే తీసుకునే ఆలోచనలో టీడీపీ ఉన్నట్లు సమాచారం. దీనిపై కూటమిలోని భాగస్వామ్య పార్టీలు అయిన బీజేపీ, జనసేనతో చంద్రబాబు చర్చించనున్నట్లు తెలిసింది. ఇక ఏపీ శాసనమండలిలో మొత్తం 58 ఎమ్మెల్సీ స్థానాలు ఉన్నాయి. శాసనసభ్యులు, స్థానిక సంస్థల కోటా నుంచి 20 మంది చొప్పున, పట్టభద్రులు, ఉపాధ్యాయుల కోటా నుంచి ఐదుగురి చొప్పున.. గవర్నర్ కోటా నుంచి 8 మంది సభ్యులను ఎంపిక చేస్తారు.

ఉండవల్లికి కీలక బాధ్యతలు..

రాజమండ్రి : ఆంధ్రప్రదేశ్ రాజకీయాలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఎప్పుడూ ఒక ఆసక్తికర చర్చగా మారుతూ వస్తుంది. ఒకప్పుడు రాష్ట్రాన్ని ఏలిన ఈ పార్టీ విభజన తర్వాత వరుసగా జరిగిన మూడు సార్వత్రిక ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. చాలా ప్రాంతాల్లో డిపాజిట్లు కోల్పోయి కేవలం రెండు శాతం ఓటు బ్యాంకుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నది. ఇలాంటి క్లిష్టమైన సమయంలో పార్టీ బాధ్యతలు స్వీకరించడానికి చాలా మంది సీనియర్ నేతలు వెనకడుగు వేస్తూ వచ్చారు. విభజన అనంతరం రఘువీరా రెడ్డి, సాకే శైలజానాథ్, ఆ తర్వాత గోదావరి జిల్లాకు చెందిన నేతతో పాటు ప్రస్తుతం వైఎస్ షర్మిల పీసీసీ చీఫ్ బాధ్యతలు నిర్వర్తించారు. అయితే రానున్న రోజుల్లో ఏపీ కాంగ్రెస్‌లో భారీ ప్రక్షాళన జరగనుందనే ప్రచారం జోరుగా సాగుతోంది.పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిసిన వెంటనే హైకమాండ్ ఏపీ రాజకీయాలపై ప్రత్యేక దృష్టి సారించనుంది. పార్టీకి కొత్త జవసత్వాలు అందించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఈసారి సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ తూకాలను ఖచ్చితంగా పరిగణలోకి తీసుకుంటారని తెలుస్తోంది. ఏపీలో అత్యంత బలమైన సామాజిక వర్గానికి చెందిన కీలక నేతకు పీసీసీ పీఠం దక్కే అవకాశం ఉందని సమాచారం. 2029 ఎన్నికల లక్ష్యంగా ఇప్పటి నుంచే పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని జాతీయ నాయకత్వం భావిస్తోంది. ఇందులో భాగంగానే నాయకత్వ మార్పుతో పాటు కమిటీల ప్రక్షాళన చేపట్టాలని నిర్ణయించారు.గతంలో పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాలని హైకమాండ్ కోరిన ఒక సీనియర్ పెద్దాయన సున్నితంగా తిరస్కరించినట్లు వార్తలు వచ్చాయి.

కేంద్రంలో కీలక మంత్రి పదవులు నిర్వహించిన ఆ గోదావరి జిల్లా నేతకు బాధ్యతలు ఇస్తే పార్టీ పుంజుకుంటుందని భావించారు. అయితే జాతీయ స్థాయిలో మారుతున్న రాజకీయ పరిణామాలు, దక్షిణాదిన కాంగ్రెస్‌కు పెరుగుతున్న ఆదరణ నేపథ్యంలో ఆ పెద్దాయన ఆలోచనలో మార్పు వచ్చినట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. రాహుల్ గాంధీ ఇమేజ్, కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకత తమకు కలిసి వస్తాయని ఆ నేతలు లెక్కలు వేస్తున్నారు. ఏపీ రాజకీయాల్లో నెలకొన్న శూన్యతను భర్తీ చేయడానికి ఇదే సరైన సమయమని భావిస్తున్నారు.

ప్రజా కలం

పిడిఎస్ ద్వారా స్టీమ్ రైస్ పంపిణీ

విజయవాడ : రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) ద్వారా అందిస్తున్న బియ్యాన్ని ప్రజలు పూర్తిగా వినియోగించకపోవడానికి గల కారణాలపై పౌర సరఫరాల శాఖ సమగ్ర అధ్యయనం నిర్వహించింది. ప్రతి కిలోపై రూ.56 వరకు రాయితీ ఇస్తున్నప్పటికీ వినియోగం తక్కువగా ఉండటానికి ప్రధాన కారణం ప్రస్తుతం పంపిణీ చేస్తున్న బియ్యం నాణ్యతేనని గుర్తించినట్లు రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ప్రజలు ఎక్కువగా ఇష్టపడే స్టీమ్ రైస్ అందిస్తే వినియోగం పెరగడంతో పాటు బియ్యం పక్కదారి పట్టకుండా ఉంటుందని చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలోని 42 వేల పాఠశాలలు, 4 వేల వసతి గృహాల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద స్టీమ్ రైస్‌ను విజయవంతంగా అందిస్తున్నామని తెలిపారు. ఈ విధానాన్ని ప్రజా పంపిణీ వ్యవస్థలోనూ అమలు చేయాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ప్రతిపాదించగా సానుకూల స్పందన లభించిందన్నారు. దేశంలోనే తొలిసారిగా కాకినాడ జిల్లాలో పిడిఎస్ ద్వారా స్టీమ్ రైస్ పంపిణీకి పైలట్ ప్రాజెక్టు ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. జిల్లాలో రేషన్ కార్డుదారులు, పాఠశాలలు, హాస్టళ్ల అవసరాల కోసం నెలకు సుమారు 9 వేల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమవుతుందని అంచనా వేశారు. పైలట్ విజయవంతమైతే రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలిపారు. అలాగే కేంద్రం అదనంగా 20 వేల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ ధాన్యం సేకరణకు అంగీకరించిందని, రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామన్న హామీని ప్రభుత్వం నిలబెట్టుకుంటోందని చెప్పారు. ఈ త్రైమాసికంలో రాష్ట్రవ్యాప్తంగా 1,000 'మీ మార్ట్'లను ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. ఎన్‌సీసీఎఫ్‌తో ఒప్పందం కుదిరిందని, ఈ మార్టుల్లో సుమారు 70 రకాల నిత్యావసర వస్తువులు తక్కువ ధరలకు లభిస్తాయని చెప్పారు. ఆగస్టు 1 నుంచి 130 రైతు బజార్లు, 500 ప్రత్యేక అవుట్‌లెట్లలో బీపీటీ స్టీమ్ రైస్‌ను కిలో రూ.52కు, గ్రేడ్-1 రా రైస్‌ను రూ.50కు విక్రయించనున్నట్లు ప్రకటించారు. భవిష్యత్తులో స్వర్ణ రకం బియ్యాన్ని కూడా రైతు బజార్ల ద్వారా రూ.40కే అందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. అలాగే ప్రతి రేషన్ కార్డుదారుడికి 500 గ్రాముల కందిపప్పు అందించే ప్రతిపాదనకు కేంద్రం సానుకూలంగా స్పందించిందన్నారు. బియ్యం ప్యాకింగ్ నుంచి వినియోగదారుడి వరకు పూర్తి ట్రాకింగ్ కోసం క్యూఆర్ కోడ్‌కు బదులుగా ఆర్‌ఎఫ్ఐడీ విధానాన్ని కాకినాడ జిల్లాలో పైలట్‌గా అమలు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. అలాగే సీబీడీసీ ఆధారిత డిజిటల్ వాలెట్ విధానాన్ని ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి విశాఖపట్నంజిల్లాల్లో ప్రయోగాత్మకంగాఅమలు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. ఈ విధానం వల్ల ప్రజలకు రాయితీ నేరుగా అందడంతో పాటు రేషన్ డీలర్ల కమిషన్‌కు కూడా ఎలాంటి ఇబ్బంది ఉండదని మంత్రి స్పష్టం చేశారు.

వరుదు కల్యాణికి మొండి చేయేనా?

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ స్థానం ఖాళీ కావడం, దాని చుట్టూ ఇప్పుడు వైసీపీ అంతర్గత రాజకీయాల్లో నడుస్తున్న డ్రామాలు చూస్తుంటే సామాన్య కార్యకర్తలకు ఇదేం మాస్టర్ ప్లాన్ సామీ అని తలపట్టుకోవడం తప్ప మరో మార్గం కనిపించడం లేదు. మండలి వైస్ చైర్‌పర్సన్ జకియా ఖానమ్ పదవీకాలం ముగిసిపోయింది. ప్రస్తుతం మండలిలో వైసీపీకి ఇంకా సంఖ్యాబలం ఉంది కాబట్టి, ఆ ఉపసభాపతి పీఠం ఆ పార్టీకే దక్కనుంది. సరిగ్గా ఇక్కడే జగన్ మోహన్ రెడ్డి మార్క్ అన్ ప్రిడిక్టబుల్ వ్యూహం మళ్లీ రచ్చకెక్కింది. సాధారణ పొలిటికల్ లాజిక్ ప్రకారం ఆలోచిస్తే.. ప్రస్తుతం పార్టీ ఘోర పరాజయం తర్వాత కోలుకోవడానికి కూటమికి బదులిచ్చే సామాజిక సమీకరణాలు వాడాలి. పోయిన స్థానం ముస్లిం మైనారిటీది కాబట్టి మళ్లీ అదే వర్గానికి ఇస్తే ఆ సామాజిక వర్గానికి మంచి సంకేతం వెళ్తుంది. లేదా, కూటమిని డిఫెండ్ చేయడానికి కాపులకో, లేదంటే గట్టిగా వాయిస్ వినిపించే బిసి వర్గానికి చెందిన వరుదు కల్యాణి లాంటి నాయకురాలికో ఆ అవకాశం ఇవ్వాలి. పొద్దున లేస్తే మైకుల ముందు నిలబడి, కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడుతూ పార్టీ జెండా మోస్తున్న వరుదు కల్యాణి లాంటి వారికి ఇస్తే క్యాడర్‌లో కూడా ఒక రకమైన జోష్ వస్తుంది. లేదంటే తమ పక్కా ఓటు బ్యాంక్ అయిన దళితులకో, రెడ్డి సామాజిక వర్గానికో ఇచ్చి సంతృప్తి పరచవచ్చు. కానీ, వైఎస్ జగన్ ఆలోచనలు వేరే స్థాయిలో ఉంటాయి కదా! రాజకీయంలో లాజిక్కులు వెతికేవారికి ఆయన ఎప్పుడూ షాక్‌లే ఇస్తారు. ఏ రాజకీయ లెక్కలకూ అందకుండా, ఈ కీలక పదవిని కమ్మ సామాజిక వర్గానికి చెందిన మాధవరావుకు అప్పగించాలని డిసైడ్ అయ్యారట. టీవీ డిబేట్లలోనో, బయటో పార్టీ కోసం గట్టిగా మాట్లాడలేని, రేపు పొద్దున పార్టీలో ఉంటారో లేదో కూడా గ్యారంటీ లేని నేతకు ఈ చాన్స్ ఇవ్వడం చూసి వైసీపీ సొంత నేతలే జుట్టు పీక్కుంటున్నారు. మాట్లాడే వారికి పదవులు ఉండవు.. పదవులు వచ్చేవారు మాట్లాడరు అనే కొత్త సూత్రాన్ని జగన్ ఇక్కడ అమలు చేస్తున్నారని పార్టీ వర్గాల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. మైకుల ముందు నిలబడి గొంతు చించుకునే వరుదు కల్యాణి లాంటి నేతలకు కేవలం ప్రెస్ మీట్లకే పరిమితం చేసి, ఏమాత్రం సౌండ్ చేయని నేతలకు పీఠాలు అప్పగించే ఈ జగన్ మార్క్ సర్‌ప్రైజ్ రాజకీయం చూసి ప్రత్యర్థులు నవ్వుకుంటుంటే, సొంత కార్యకర్తలు మాత్రం ఏందో ఈ ఆపరేషన్.. మనకెందుకీ సిట్యుయేషన్ అని నిట్టూరుస్తున్నారు. ప్రజాక్షేత్రంలో ఎలాగూ షాక్‌లు తింటున్నాం, కనీసం పదవుల పంపిణీలోనైనా కాస్త బుర్ర ఉపయోగిస్తే బాగుండు అని వైసీపీ శ్రేణులు ఆవేదన చెందుతున్నా.. జగన్ రూటే వేరు అని మరోసారి నిరూపితమైంది. ఈ మొత్తం వ్యవహారంలో వరుదు కల్యాణికి ఎందుకు ఇవ్వడం లేదంటే.. ఆమె ఇప్పటికే బాగా మాట్లాడుతూ పేరు తెచ్చుకున్నారు. ఈ పదవి ఇస్తే ఇంకా ఫోకస్ అవుతారు. జగన్మోహన్ రెడ్డికి అది ఇష్టం ఉండదు. ఈ విషయం వైసీపీలో ఉన్న అందరికీ తెలుసు.

ఎర్రమిర్చికి ఊహించని ధర

గుంటూరు : మిర్చి పంటను సాగు చేయడం కత్తి మీద సామే. ఏ మాత్రం తేడా వచ్చినా పంటంతా తెగుళ్లే. ఒకవేళ తెగుళ్ల నుంచి కాపాడుకున్నా నాణ్యమైన దిగుబడి రాదు. సరే ఆ వచ్చిన పంటకు గిట్టుబాటు ధర కూడా ఉండదు. దళారులు ఎంత చెప్తే అంతకి ఇచ్చి వెళ్తుంటారు. కానీ ఇక్కడో రైతు బయ్యర్లకే దిమ్మతిరిగే షాక్ ఇచ్చాడు. నెంబర్ వన్ నాటు రకాన్ని సాగు చేసి ఎర్రబంగారంలా మెరిసే మిర్చిని సాగు చేశాడు. రూ. 32 వేలు పలికినా ఇవ్వకుండా రూ. 40 వేల గిట్టుబాటు ధర లభిస్తుందని ఆశిస్తున్నాడు. రైతు వేసిన పంట ఊహించిన దాని కంటే ఎక్కువ ధర పలికిందంటే ఆ రైతు పంట పండినట్టే. ఇక్కడ కూడా ఓ రైతు ఎర్రబంగారం సాగు చేశాడు. గుంటూరు మిర్చి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.. మిర్చే కాదు ధర కూడా ఘాటెక్కింది. టాప్ క్వాలిటీ రావడంతో దళారులు ఆ పంట కోసం ఎగబడుతున్నారు. క్వింటాకు రూ. 32 వేలు ఇస్తామని ముందుకొస్తున్నా.. ఇంకాస్త ఎక్కువ ధర పలుకుతుందన్న ధీమాతో ఆ రైతు విక్రయించడం లేదు. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలేనికి చెందిన రైతు చిట్టినేని అమర్‌నాథ్ నాటు రకం సూపర్ 10 డీలక్స్ మిర్చిని నాలుగు ఎకరాల్లో సాగు చేశాడు. ఎకరాకు 20 క్వింటాళ్ల చొప్పున 80 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈ ఏడాది జనవరిలో తొలి కాపు రాగా.. ధర పెద్దగా లేకపోవడంతో కోల్డ్‌స్టోరేజ్‌లో పంటను నిల్వ చేశాడు. ఇటీవల కొద్ది కాలంగా గుంటూరు మిర్చి యార్డ్‌లో ధరలు రైతులకు అనుకూలంగా ఉండటంతో తన పంటను విక్రయించేందుకు అమర్‌నాథ్ మూడు లాట్ల శాంపిల్స్‌ను తీసుకొచ్చాడు. యార్డులోని శ్రీ కృష్ణవేణి చిల్లీస్ దిగుమతి షాపు వద్దకు తీసుకురావడంతో ఎర్రగా నిగనిగలాడుతున్న ఆ టాప్ క్వాలిటీ మిరపకాయలను చూసి ఎగుమతిదారులు ఆశ్చర్యపోయారు. దాంతో ఆ మిర్చిన కొనేందుకు చాలా మంది ఆసక్తిచూపారు. మిర్చి క్వింటా ధర రూ. 25 వేల వరకే ఉండేది.. అలాంటిది క్వాలిటీ మిర్చికి తోడు పోటీ కూడా పెరగడంతో రికార్డు స్థాయిలో రూ. 32 వేల వరకు వేలం వెళ్లింది. అయితే, రూ. 40 వేలకు అమ్మాలన్న ఉద్దేశంలో రైతు అమర్‌నాథ్ ఉన్నాడు. దాంతో వంద టిక్కీల మిర్చి యార్డులోనే ఉంది. తాను అనుకున్న ధర వచ్చిన తర్వాతే విక్రయించాలని రైతు ఉన్నాడు. పంటకు తెగులు సోకినా తగిన సంరక్షణ చర్యలు తీసుకుని క్వాలిటీ ఏ మాత్రం దెబ్బతినకుండా సాగు చేశాడని.. అందుకే ఈ స్థాయిలో మిర్చి రికార్డు ధర పలికింది అంటూ గుంటూరు ఏఎంసీ వర్గాలు అంటున్నాయి.

తెలుగు రాష్ట్రాల మధ్య బోట్ల పంచాయితీ

కర్నూలు : నంద్యాల జిల్లా నిందికొట్కూరు పరిధిలోని కొత్తపల్లి మండలంలో కృష్ణా నది మధ్యలో ఉన్న సంగమేశ్వర ఆలయాన్ని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివస్తున్నారు. అయితే, ఈ సమయంలో ఏపీ, తెలంగాణ ప్రాంతాల మధ్య బోట్ల పంచాయితీతో ఇరు రాష్ట్రాల బోటు యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన బోట్లకు సరైన పత్రాలు లేవంటూ ఏపీ పోలీసులు వాళ్లకు అనుమతి నిరాకరిస్తే.. కృష్ణాలో నీళ్లు పెరిగాయని తెలంగాణ పోలీసులు ఏపీ వారిని అడ్డుకుంటున్నారు. వర్షాలు లేని సమయంలో నంద్యాల జిల్లాలోని సంగమేశ్వర ఆలయాన్ని దర్శించే అవకాశం దక్కుతుంది. కృష్ణా నది మధ్యలో ఉండే ఈ ఆలయాన్ని దర్శించుకునేందుకు ఎంతోమంది పర్యాటకులు ఇక్కడికి బోట్లలో వస్తుంటారు. అయితే ఈ ప్రాంతం ఇటు ఆంధ్రప్రదేశ్, అటు తెలంగాణ ప్రాంతానికి దగ్గరగా ఉండటంతో ఇరు రాష్ట్రాల బోటు యజమానులు అక్కడ పర్యాటకులను చేరవేస్తుంటారు. ఇప్పుడు ఇరు రాష్ట్రాల పోలీసులు ఒకరిపై మరొకరు ఆంక్షలు విధించడం చర్చనీయాంశంగా మారింది. నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని కొత్తపల్లి మండలం సంగమేశ్వరం క్షేత్రం వద్ద కృష్ణానదిలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన సంగమేశ్వరం, సోమశిల మధ్య నిత్యం బోట్లు తిరుగుతుంటాయి. యాత్రికులను ఆ ప్రాంతాలకు చేరవేసినందుకు బోటు యజమానులు కొంత డబ్బు తీసుకుంటారు. అయితే, తెలంగాణ బోట్లకు సరైన పత్రాలు లేవంటూ ఏపీ పోలీసులు అనుమతించకపోవడంతో ఇప్పుడు పెద్ద సమస్య ఏర్పడింది. ఏపీ సరిహద్దు జలాల్లోకి తెలంగాణ బోట్లను అనుమతించకపోవడంతో తెలంగాణకు చెందిన బోట్ల యజమానులు కూడా ఏపీ బోట్లను తమ సరిహద్దుల్లోకి రాకుండా అడ్డుకుంటున్నారు. దాంతో మూడు రోజులుగా ఇరు రాష్ట్ర మధ్య బోట్ల పంచాయితీ నడుస్తోంది. పైన కురుస్తున్న వర్షాలకు కృష్ణా నదిలో నీరు పెరుగుతుందని అసలు బోట్లు తిప్పేందుకు అనుమతి లేదంటూ తెలంగాణ పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. యాత్రికులు, పర్యాటకులు ఎక్కువగా వచ్చే ఈ సమయంలోనే బోట్ల యజమానులు నాలుగు రూపాయలు వస్తాయి. అలాంటిది ఈ సమయంలో ఇలాంటి బోట్లను నిలిపివేస్తే తామేం చేయాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటు ఏపీ, ఇటు తెలంగాణ ఇరు రాష్ట్రాల బోటు యజమానులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తపల్లి మండలపరిధిలోని సంగమేశ్వరుని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి వందలాది మంది ప్రజలు వస్తున్నారు. నీళ్లలో నుంచి ఆలయం బయట పడటం.. ప్రత్యేక పూజలు జరుగుతుండటంతో భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఇలాంటి సమయంలో బోట్లను ఆపేయడం సరికాదని ప్రభుత్వం జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఉద్యోగులలో ఎఫర్ట్ రిసెషన్

ముఖ్యంగా యువ ఉద్యోగులు పనిపై తమ దృక్పథాన్ని మార్చుకుంటుండగా, కృత్రిమ మేధస్సు ఉద్యోగ ప్రపంచాన్ని వేగంగా ప్రభావితం చేస్తోంది. గ్రేట్ ప్లేస్ టు వర్క్ ఇండియా 2026 తాజా అధ్యయనం ప్రకారం భారతీయ సంస్థల్లో 'ఎఫర్ట్ రిసెషన్ అనే కొత్త ధోరణి కనిపిస్తోంది. అంటే ఉద్యోగులు తమ విధుల్లో భాగం కాని అదనపు బాధ్యతలు స్వచ్ఛందంగా తీసుకోవడానికి ఆసక్తి చూపడం తగ్గుతోందని నివేదిక వెల్లడించింది. దేశవ్యాప్తంగా సర్వే చేసిన 380 సంస్థల్లో 240 సంస్థలు (63%), గత ఏడాదితో పోలిస్తే ఉద్యోగుల అదనపు కృషి తగ్గిందని తెలిపాయి. సగటున ఈ తగ్గుదల 5 శాతంగా నమోదైంది. నివేదిక ప్రకారం, ఉద్యోగులు ఎవరూ చెప్పకుండానే ఆలస్యంగా పనిచేయడం, తమ బాధ్యతలకు అతీతంగా సమస్యలను పరిష్కరించడం, స్వచ్ఛందంగా అదనపు బాధ్యతలు స్వీకరించడం వంటి అంశాలనే 'డిస్క్రెషనరీ ఎఫర్ట్'గా నిర్వచించారు. ప్రస్తుతం భారత ఉద్యోగుల్లో జెన్ జీవాటా 26 శాతానికి చేరుకుంది. ఇది 2023తో పోలిస్తే దాదాపు రెండింతలు. ఈ తరం ఉద్యోగులు ఎక్కువ గంటలు పనిచేయడం కంటే పని-వ్యక్తిగత జీవితం సమతుల్యత, అనువైన పని విధానం, నిరంతర నైపుణ్యాభివృద్ధి, కెరీర్ పురోగతి, అర్థవంతమైన పని, మానసిక ఆరోగ్యం వంటి అంశాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని అధ్యయనం పేర్కొంది. అదే సమయంలో ఏఐ ప్రభావంతో ఉత్పాదకతను కొలిచే విధానంలో కూడా మార్పులు వస్తున్నాయి. అయితే తాజా నివేదిక ప్రకారం ఉద్యోగుల అదనపు కృషి తగ్గుదల అన్ని రంగాల్లో ఒకేలా ఉండటం లేదు. రిటైల్ రంగంలో 88%, ఐటీ మరియు ప్రొఫెషనల్ సర్వీసెస్‌లో 77%, నిర్మాణం, రియల్ ఎస్టేట్‌లో 71%తయారీ (మాన్యుఫ్యాక్చరింగ్)లో కేవలం 44% తగ్గుదల నమోదైందని తెలిపాయి. ఉద్యోగులు తమ నాయకులు తమ సంక్షేమాన్ని నిజంగా పట్టించుకుంటున్నారని భావిస్తే 99 శాతం మంది అదనపు కృషి చేయడానికి సిద్ధంగా ఉంటారని అధ్యయనం తెలిపింది. అదే నాయకత్వంపై నమ్మకం లేకపోతే ఈ సంఖ్య 29 శాతానికి పడిపోతోంది. అలాగే నాయకులు స్ఫూర్తినిచ్చే విధంగా ఉంటే 98 శాతం మంది ఉద్యోగులు అదనపు బాధ్యతలు తీసుకుంటారని, అలాంటి నాయకత్వం లేకపోతే ఈ సంఖ్య 32 శాతానికి మాత్రమే పరిమితమవుతుందని నివేదిక వెల్లడించింది. ఉద్యోగులు తమ నాయకులు తమ సంక్షేమాన్ని నిజంగా పట్టించుకుంటున్నారని భావిస్తే 99 శాతం మంది అదనపు కృషి చేయడానికి సిద్ధంగా ఉంటారని అధ్యయనం తెలిపింది. అదే నాయకత్వంపై నమ్మకం లేకపోతే ఈ సంఖ్య 29 శాతానికి పడిపోతోంది. అలాగే నాయకులు స్ఫూర్తినిచ్చే విధంగా ఉంటే 98 శాతం మంది ఉద్యోగులు అదనపు బాధ్యతలు తీసుకుంటారని, అలాంటి నాయకత్వం లేకపోతే ఈ సంఖ్య 32 శాతానికి మాత్రమే పరిమితమవుతుందని నివేదిక వెల్లడించింది. దట్ కల్చర్ థింగ్ సంస్థకు చెందిన ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్ గుర్లీన్ బరువా అభిప్రాయం ప్రకారం ఇది పని పట్ల నిబద్ధత తగ్గిపోవడం కాదని, పనిని చూసే విధానం మారుతున్న సంకేతమని పేర్కొన్నారు. పని పట్ల నిబద్ధత అంటే కేవలం ఎక్కువ గంటలు పనిచేయడం లేదా ఎప్పుడూ బిజీగా కనిపించడం మాత్రమే కాదు. సమస్యలను సమర్థంగా పరిష్కరించడం, నాణ్యమైన ఫలితాలు ఇవ్వడం, బృందంతో సమన్వయంగా పనిచేయడం కూడా నిజమైన వర్క్ ఎథిక్‌లో భాగమే అని ఆమె చెప్పారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఏఐ కారణంగా ఉద్యోగాల స్వరూపం మారుతోంది. ముఖ్యంగా ప్రారంభ స్థాయి ఉద్యోగాల్లో

కీ రోల్‌లో తమ్మినేని వాణి

శ్రీకాకుళం : మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత తమ్మినేని సీతారాం కుటుంబం చుట్టూ ప్రస్తుతం చట్టపరమైన ఉచ్చు బిగుస్తోంది. శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బతికున్న వ్యక్తిని చనిపోయినట్లు చూపి, నకిలీ డెత్ సర్టిఫికెట్లు, ఫోర్జరీ వారసత్వ పత్రాలు సృష్టించి రూ.4 కోట్ల విలువైన భూమిని కొట్టేసేందుకు కుట్ర పన్నిన కేసులో తమ్మినేని కుటుంబం ఇరుక్కుపోయింది. ఈ కేసులో హైకోర్టు నుంచి తమ్మినేని సీతారాం, ఆయన భార్య తమ్మినేని వాణిలకు తాత్కాలిక ముందస్తు బెయిల్ లభించినప్పటికీ, కుమారుడు చిరంజీవి నాగ్‌కు మాత్రం బెయిల్ నిరాకరించడంతో సీతారాం తీవ్ర ఇరకాటంలో పడ్డారు. దీనికి తోడు, ఆమదాలవలస పరిధిలోని ఖాళీ కాలేజీ వెనుక ఉన్న దళిత కుటుంబం భూమిని ఆక్రమించారంటూ వాణిపై తాజాగా మరొక ఫిర్యాదు పోలీసులకు అందిందిఆముదాలవలస నియోజకవర్గ పరిధిలో తమ్మినేని సీతారాం కేవలం పేరుకే ప్రజాప్రతినిధిగా, స్పీకర్‌గా ఉండేవారని, అసలు డాన్ పాత్ర పోషించింది మాత్రం ఆయన భార్య తమ్మినేని వాణినే అనే టాక్ బలంగా ఉంది. సీతారాం సంపాదించిన రాజకీయ పదవులు, అధికారాన్ని అడ్డుపెట్టుకుని వెనుకుండి సెటిల్మెంట్లు, భూ లావాదేవీలు, రాకెట్లు నడిపించడంలో ఆమె ప్రధాన సూత్రధారిగా వ్యవహరించారని ఆరోపణలు వస్తున్నాయి. కొడుకు చిరంజీవి నాగ్ కూడా పూర్తిగా తల్లి ఆదేశాల మేరకే పనిచేస్తూ ఈ అక్రమ రిజిస్ట్రేషన్లు, ఆక్రమణల్లో పాత్రదారులుగా మారారనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి. వైఎస్ఆర్‌సీపీ అధికారంలో ఉన్న సమయంలోఆముదాలవలసలో జరిగినపలు అక్రమాలు, దందాలు, భూ ఆక్రమణల వెనుక వాణి ముద్రలు ఉన్నాయనే అంశం ఇప్పుడు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఏకంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను తన గుప్పిట్లో ఉంచుకుని నకిలీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్లు చేయించుకునే స్థాయికి ఈ దందాలు సాగాయని స్థానిక బాధితులు ఆరోపిస్తున్నారు. ఒక ప్రైవేట్ డిగ్రీ కాలేజీ లెక్చరర్లను సాక్షులుగా పెట్టి, నకిలీ వారసులను సృష్టించి కోట్లాది రూపాయల ఆస్తులను తమ ఖాతాలో వేసుకున్నారనే నిజాలు దర్యాప్తులో వెలుగుచూడటం స్థానికంగా సంచలనం సృష్టిస్తోంది. సీతారాం స్పీకర్ హోదాలో ఉండటంతో బాధితులు ఎవరూ బయటకు వచ్చి మాట్లాడటానికి ధైర్యం చేయలేకపోయేవారు. కానీ ఇప్పుడు ప్రభుత్వం మారడం, పోలీసు దర్యాప్తు పారదర్శకంగా సాగుతుండటంతో వాణి సృష్టించిన అక్రమాల చిట్టా అంతా బయటపడుతోంది. ప్రజాప్రతినిధిగా ఉన్న భర్త పవర్‌ను దుర్వినియోగం చేస్తూ ఆముదాలవలసను ఏలిన ఈ షాడో లీడర్ నిజస్వరూపం బయటపడటంతో, తమ్మినేని కుటుంబానికి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోంది.

తిరుమల తరహాలో కర్నూలు దర్శనాలు

కర్నూలు : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీశైలంలో భక్తుల దర్శనాల ప్రక్రియను మరింత పారదర్శకంగా, వేగవంతంగా మార్చేందుకు దేవస్థానం ధర్మకర్తల మండలి కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై శ్రీశైల దేవస్థానంలో ప్రొటోకాల్ దర్శనాల్లో సంస్కరణలు తీసుకురావాలని నిర్ణయించింది. ధర్మకర్తల మండలి సమావేశంలో సభ్యులందరితో విస్తృతంగా చర్చించిన అనంతరం ఈ మార్పులను ఖరారు చేశారు. ఈ కీలక సమావేశంలో 45 అంశాలపై సమగ్రంగా చర్చించి అందులో 39 కీలక అంశాలకు ఆమోదముద్ర వేశారు. సాధారణ భక్తులు గంటల తరబడి వేచి ఉండే ఇబ్బందులు తొలగించి, మరింత సులభంగా దర్శనం కల్పించడమే తమ ప్రధాన ధ్యేయమని ధర్మకర్తల మండలి ఛైర్మన్ రమేష్ నాయుడు స్పష్టం చేశారు. నూతన రూల్స్ ప్రకారం ప్రజాప్రతినిధులు, ప్రముఖుల సిఫార్సు లేఖలపై ఇచ్చే ప్రొటోకాల్ టికెట్లను వచ్చే నెల ఆగస్టు 15వ తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారానే జారీ చేస్తారు. ఈ ప్రోటోకాల్ దర్శనం కోరుకునే వారు దర్శన సమయానికి కనీసం 48 గంటల ముందే తమ సిఫార్సు లేఖలను ఆన్‌లైన్ వ్యవస్థ ద్వారా సమర్పించాల్సి ఉంటుంది.

ఈ మార్పు ద్వారా భక్తుల రద్దీని సులభంగా నియంత్రించడంతో పాటు, దర్శన వేళల్లో మరింత పారదర్శకత వస్తుందని పాలకమండలి భావిస్తోంది.

ప్రముఖుల సిఫార్సు లేఖల పేరిట జరిగే అక్రమాలను అరికట్టడంతో పాటు, సాధారణ భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండే అవసరం లేకుండా వేగంగా దర్శనం పొందేందుకు ఈ చర్యలు ఎంతగానో తోడ్పడతాయని ఆలయ ఛైర్మన్ పేర్కొన్నారు. ఇక శ్రీశైలం క్షేత్రాభివృద్ధిలో భాగంగా భక్తుల వసతులకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారు. నూతన క్యూ కాంప్లెక్స్, ఏ-గ్రేడ్ శౌచాలయాలు, స్నానపు గదుల నిర్మాణం, తిరుమల తరహాలో పీఏసీ (పిలిగ్రిమ్ ఎమినిటీస్ కాంప్లెక్స్) ఏర్పాటును ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలని నిర్ణయించారు. భక్తుల రాకపోకల సౌకర్యార్థం హిందూమాల సత్రం నుంచి కుమార సదనం వరకు?. యోగివేమారెడ్డి సత్రం వెనుక భాగంలో రూ. 24 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా సిమెంట్ కాంక్రీట్ రోడ్డును నిర్మించనున్నారు. రాబోయే శ్రావణ మాసంలో భక్తుల భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాన గోపురాలకు రంగురంగుల విద్యుద్దీపాలంకరణ చేయనున్నారు. భక్తుల విశ్రాంతి కోసం నందీశ్వర మరియు నీలకంఠేశ్వర డార్మెటరీలలో డక్టబుల్ ఎయిర్ కూలర్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని తీర్మానించారు. అలాగే క్యూ కాంప్లెక్సులో అదనపు వాటరు కూలర్లను అమర్చనున్నారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తొలగి?. సమృద్ధిగా వర్షాలు కురవాలని, పంటలు బాగా పండి దేశం సస్యశ్యామలంగా ఉండాలని కాంక్షిస్తూ ఆగమశాస్త్రానుసారంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆగస్టు 7 నుంచి 11వ తేదీ వరకు వరుణయాగ సహిత సహస్రఘటాభిషేకాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఛైర్మన్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక అర్చనలు, హోమాలు, జపాలు మరియు పారాయణలు శాస్త్రోక్తంగా జరుగుతాయి.

అభిజిత్ పెళ్లి చేసుకుంటమంటూ

మహిళలు క్యూ

న్యూఢిల్లీ : నీట్ యూజీ ప్రశ్నాపత్రం లీక్‌కు వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమంతోకాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పేరు దేశం మొత్తం మార్మోగిపోతోంది. దీంతో అతడితో పెళ్లి కోసం చాలా మంది అమ్మాయిలు క్యూకడుతున్నారు. స్వయంగా ఈ విషయాన్ని ఆయన తల్లి వెల్లడించారు. ఆందోళనల తర్వాత తమ కుమారుడికి వస్తున్న మ్యారేజ్ ప్రపోజల్స్ మరింత పెరిగాయని అభిజీత్ తల్లి అనితా దీప్కే తెలిపారు. తన కుమారుడు ఇంటికి వచ్చాక వివాహ విషయమై మాట్లాడి, తుది నిర్ణయం అతడికే వదిలిపెడతామని ఆమె చెప్పారు. గత రెండేళ్ల నుంచి తన కుమారుడికి పెళ్లి ప్రతిపాదనలు వస్తున్నాయి కానీ, అతడి చదువు పూర్తయి ఆర్థికంగా స్థిరపడే వరకూ చేసుకోనని చెప్పాడని అన్నారు. 'మా అబ్బాయికి కొంతకాలంగా పెళ్లి సంబంధాలు వస్తూనే ఉన్నాయి. గత రెండేళ్లుగా చాలా మంది వచ్చి అడుగుతున్నారు.. కానీ, చదువు పూర్తి చేసి, ఆర్థికంగా స్థిరపడిన తర్వాతే పెళ్లి చేసుకుంటానని చెప్పాడు" అని అనిత దీప్కే పేర్కొన్నారు. నీట్ వ్యతిరేక ఆందోళనల సమయంలో టైఫాయిడ్ బారినపడినా.. అభిజీత్ దీప్కే మాత్రం ఫ్లూయిడ్స్ ఎక్కించుకుని ఉద్యమాన్ని నడిపించారు. ప్రస్తుతం టైఫాయిడ్ నుంచి అతడు కోలుకుంటున్నారు. ఇదిలా ఉండగా, ప్రభుత్వం హామీలు ఇచ్చినప్పటికీ విద్యార్థులు ఇప్పటికీ పోలీసుల వేధింపులను ఎదుర్కొంటున్నారని దీప్కే ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఆరోపించారు. ఈ వేధింపులు కొనసాగితే తిరిగి మేము వీధుల్లోకి వస్తామని ఆయన హెచ్చరించారు. "విద్యార్థులపై పోలీసుల వేధింపులు కొనసాగితే, కాక్రోచ్ జనతా పార్టీ త్వరలో భారీ శాంతియుత నిరసనతో స్పందిస్తుంది.. ప్రభుత్వం విద్యార్థులను లక్ష్యంగా చేసుకోవడం, వారిపై వేధింపులు ఆపాలి" అని దీప్కే స్పష్టం చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, నిరసనకారులపై ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణ, ప్రతీకార చర్యలకు పాల్పడబోమని, పరీక్షా సంస్కరణలను పరిశీలిస్తామనే హామీ సహా తమ కీలక డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం అంగీకరించడంతో శనివారంజంతర్ మంతర్ వద్ద తన 36 రోజుల ఆందోళనను సీజేపీ విరమించింది. అయితే, అరెస్ట్ చేసిన నిరసనకారులను తక్షణమే విడుదల చేయాలని, వారిపై కేసులు ఉపసంహరించి, కొత్తగా ఎటువంటి ఎఫ్ఐఆర్‌లు నమోదుచేయబోమని లిఖితపూర్వకంగా హామీ ఇవ్వాలని సీజేపీ తాజాగా డిమాండ్ చేసింది. ఒకవేళ, తమకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలుచేయకుంటే ఉద్యమం మళ్లీ ప్రారంభిస్తామని హెచ్చరించింది. ఆందోళనకు సంబంధించిన పలు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సాకుగా చూపి, ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకుంటామని ఇచ్చిన హామీ నుంచి తప్పించుకోవడానికి కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించి సీజేపీ.. మరో దేశవ్యాప్త నిరసన తప్పదని హెచ్చరికలు చేసింది.

మారని ఆ 15 మంది.. మూసధోరణిలోనే తమ్ముళ్లు

విజయవాడ : తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి రాజకీయ వ్యూహాలు ఎల్లప్పుడూ అత్యంత పదునుగా ఉంటాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలోనే ఎమ్మెల్యేల పనితీరు, అవినీతి ఆరోపణలు, నియోజకవర్గాల్లో అసమ్మతి గ్రూపులు వంటి వ్యవహారాల్లో పడి ప్రజలకు దూరమవుతున్న దాదాపు 40 మంది ఎమ్మెల్యేలకు ఆయన గట్టి హెచ్చరికలే జారీ చేశారు. బాబు హెచ్చరికలతో ఆ 40 మందిలో దాదాపు 25 మందికి పైగా వెంటనే అలర్ట్ అయి, తమ తీరు మార్చుకుని దారికి వచ్చారు. అయితే, మిగిలిన ఆ 15 మంది మాత్రం ఇంకా పాత ధోరణినే కొనసాగిస్తూ నాయకత్వానికి మింగుడుపడని సవాలుగా మారారు. కానీ, ఈ 'బ్లాక్ లిస్ట్'లో ఉన్న మిగిలిన 15 మంది ఎమ్మెల్యేల విషయంలో చంద్రబాబు అనుసరిస్తున్న నూతన వ్యూహం ఇప్పుడు ఏపీ రాజకీయంలో ఆసక్తికరంగా మారింది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తున్నారని నేరుగా సస్పెండ్ చేస్తే.. సామాజిక వర్గాల కార్డులు లేదా సానుభూతి రాజకీయాలు తెరపైకి వస్తాయి. పైగా నియోజకవర్గాల్లో అనవసరంగా రచ్చ జరుగుతుంది. సరిగ్గా ఈ సమయంలో కాగల కార్యాన్ని గాంధర్వులే తీర్చినట్లు .. టీడీపీ వదిలించుకోవాలని భావిస్తున్న ఆ అసంతృప్త నేతలను ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్‌సీపీ మెల్లగా తమవైపు ఆకర్షించేలా పరిణామాలు జరిగిపోతున్నాయి. ఇక్కడే ఒక పెద్ద పొలిటికల్ సస్పెన్స్ దాగి ఉంది. అసలు ఆ ఎమ్మెల్యేలను వైసీపీనే ఆకర్షిస్తోందా? లేక అధిష్ఠానమే తెలివిగా, వ్యూహాత్మకంగా వారిని ఆ వైపునకు తోలేస్తోందా? అనేది సాధారణ రాజకీయ పరిశీలకులకు కూడా అర్థం కానంత నిశ్శబ్దంగా జరుగుతోంది. నియోజకవర్గాల్లో వారికి ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని ప్రోత్సహించడం, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రాధాన్యత తగ్గించడం, వినతులు పట్టించుకోకపోవడం ద్వారా.. మీకు ఇక్కడ భవిష్యత్తు లేదు అనే స్పష్టమైన సంకేతాన్ని పార్టీ పంపుతోంది. దీంతో దిక్కుతోచని ఆ నేతలు సహజంగానే తమ రాజకీయ ఉనికి కోసం వైసీపీ లేదా ఇతర మార్గాల వైపు చూసే పరిస్థితి ఏర్పడుతోంది. ఒకవేళ ఈ ఎమ్మెల్యేలు స్వయంగా టీడీపీని వీడి వైసీపీ కండువా కప్పుకుంటే, అది చంద్రబాబుకు రెండు రకాలుగా లాభిస్తుంది. మొదటిది.. నియోజకవర్గాల్లో పనిచేయని,

ఆరోపణలు ఎదుర్కొంటున్న నేతల భారం పార్టీపై నుంచి దానంతటదే తొలగిపోతుంది. రెండోది.. రాబోయే ఎన్నికల్లో కొత్త రక్తానికి, కష్టపడే క్యాడర్‌కు టికెట్లు కేటాయించడానికి అధిష్ఠానానికి సంపూర్ణ క్లియరెన్స్ దక్కుతుంది. అనవసర వివాదాలకు తావివ్వకుండా, నేరుగా పోటు పొడవకుండా..

ప్రజా కలం
శనివారం,ఆగస్టు 01, 2026

సమర్థనీయమేనా?

రాజ్యాంగబద్ధ ప్రజాస్వామిక సమాజంలో వీధి నిరసన న్యాయసమ్మతమేనా? ఎన్నికలలో పోటీచేయడానికే ప్రాధాన్యమివ్వడం కాకుండా శాంతియుత, ప్రజాస్వామిక ప్రతిఘటనే ప్రతిపక్షాల పురోగతికి సరైన మార్గమని నేను ఇదే కాలమ్‌లో చేసిన వాదనకు ప్రతిస్పందనగా పలువురు నాకు ఆ ప్రశ్న వేశారు. భారతీయ జనతా పార్టీ ఐటీ సెల్ చీఫ్, దర్బారీ మీడియా యాంకర్-ఇన్-చీఫ్, అధికార పార్టీని సమర్థించే విద్యావేత్తలు నా వాదనపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ఆ వాదన ప్రజాస్వామ్య వ్యతిరేకమని, రాజ్యాంగ విరుద్ధమని, జాతి-వ్యతిరేకమని తప్పుపట్టారు. అసాధారణంగా జరిగిన యువజనుల నిరసన పాలక పార్టీ వర్గాలకు కలిగించిన నిరుత్సాహం నుంచే ఆ విమర్శలు వచ్చాయనేది స్పష్టం. ప్రజల్లో ప్రగాఢంగా ఉన్న భయసంకోచాలకు తెరదించిన అపూర్వ ప్రజా నిరసన అది. నా వాదనపై వచ్చిన విమర్శల్లో నిజాయితీ లోపించింది. విమర్శకులు చాలా తెలివిగా, తమకు అనుకూలంగా నా వాదనలోని 'శాంతియుత, ప్రజాస్వామిక' అనే పదబంధాన్ని విస్మరించారు. ప్రజల్లో విభేదాలు సృష్టించి, మత సామరస్యాన్ని దెబ్బతీసిన రథయాత్రతో అధికారానికి వచ్చినవారు, న్యాయ, రాజ్యాంగ నియమాలను ఉల్లంఘించినవారు వ్యవస్థలను గౌరవించడం గురించి ఉపన్యాసాలు ఇవ్వడం ప్రారంభించారు. రిజర్వేషన్లను వ్యతిరేకించినవారు, సామాజిక న్యాయ భావననే అంగీకరించనివారు స్వతంత్ర భారతదేశంలో పౌర శాసనోల్లంఘనకు వ్యతిరేకంగా అంబేద్కర్ చేసిన వాదనలను ఉటంకిస్తున్నారు. వాళ్ల విమర్శలు ఇలా ఉన్నాయి: ఒక ప్రజాస్వామిక వ్యవస్థలో ఒక సమస్యను, ఎన్నికైన ప్రజాప్రతినిధులను విస్మరించి, రాజ్యాంగ సంస్థలను ఉపేక్షించి, వీధి నిరసన ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లేందుకు ప్రజలను సమీకరించడం సమర్థనీయమేనా? సమన్యలు, వివాదాలను పరిష్కరించుకునేందుకు రాజ్యాంగ సంస్థలను గౌరవించవలసిన అవసరం లేదా? వీధి నిరసనలు అంటే మూకస్వామ్యాన్ని స్వాగతించడం కాదా? మూకస్వామ్యం ప్రబలమయితే నిర్ణయాలు సహేతుకంగా తీసుకోవడం ఎలా సాధ్యమవుతుంది? మూకస్వామ్యం అరాచకానికి దారితీసి రాజ్యాంగబద్ధ పాలనను అసాధ్యం చేయదా? ఇది సమాజంలోని అణగారిన వర్గాల శ్రేయస్సుకు ఎలా దోహదం చేస్తుంది? ఈ ప్రశ్నలు నిరపాయకరమైనవిగా కనిపిస్తున్నాయి. అయితే వాటిలో లోపాలు ఉన్నాయి. రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యంలో సంస్థలు సక్రమంగా పనిచేస్తాయనే సునిశ్చిత విశ్వాసంతోనే ఆ ప్రశ్నలు వేయడం జరిగింది. రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యంలో సంస్థలు, వ్యవస్థలు సక్రమంగా ఉంటాయనేది ఒక మిథ్య. సమీకృతమైన ప్రజలు ఉన్మాద హంతక మూకలు కారు. ఒక ఉమ్మడి లక్ష్యంతో అనియతంగా సమావేశమైన జన బాహుళ్యమది. అలిఖిత నైతిక నియమావళి వారి ప్రవర్తనను నిర్దేశిస్తుంది. దీనిని మరింత వివరంగా చూద్దాం. ఆధునిక ప్రజాస్వామ్యాలు ప్రారంభంకాక ముందు లేదా వాటి తొలిదశలో ప్రజా సమూహాలు అందరికీ ఆమోదయోగ్యమైన, అప్పటికే సంప్రదాయపరంగా ఉన్న హక్కులను, పద్ధతులను అనుసరించేవని చరిత్రకారులు వివరించారు. 18వ శతాబ్దిలో ఇంగ్లాండ్‌లోని పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా అప్పటి ప్రజలు లాభాపేక్షలేని నైతిక ఆర్థిక వ్యవస్థ'ను (మోరల్ ఎకానమీ) కోరుకున్నారని ఈపీ థాంప్సన్ వివరించారు. సమష్టి శ్రేయస్సుకు భంగం కలగని రీతిలో ప్రజలు తమ ఆర్థిక, సామాజిక జీవితంలో వ్యవహరించేవారని ఆయన పేర్కొన్నారు. కాబట్టి, పాలనలో ప్రజల భాగస్వామ్యం అన్న భావనను ఉదారవాద ప్రజాస్వామ్యం కొత్తగా ఆవిష్కరించలేదు. సుదీర్ఘకాలంగా ఆచరణలో ఉన్న అసెంబ్లీలు, పిటిషన్లు, ప్రజాసమూహాల ఉమ్మడి నిరసన మొదలైన పద్ధతులను ఆధునిక ప్రజాస్వామ్యాలే వ్యవస్థీకృతం చేశాయి. అందువల్ల, ప్రజాప్రతిఘటన లేదా 'కలహశీల రాజకీయాల'ను ఆధునిక ప్రజాస్వామ్యాలు రూపుమాపలేవు. ప్రజాస్వామ్యం పనిచేసే తీరుతెన్నులలో అవి అంతర్భాగాలు. జవాబుదారీతనంతో కూడిన క్రమబద్ధమైన ప్రజాస్వామిక ఆచరణతో పాటు క్రమపద్ధతిలో లేని సామాన్య ప్రజల ఉమ్మడి కార్యాచరణ కూడా పనిచేసే ప్రజాస్వామ్య సజీవ లక్షణం. నిరసన ప్రదర్శనలు, సమ్మెలు, ధర్నాలు, బాయ్‌కాట్‌లు, శాసనోల్లంఘన మొదలైన అనియత పద్ధతుల రూపేణా తమ డిమాండ్లను ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లేందుకు సామాన్య పౌరులు ప్రయత్నిస్తుంటారు. ప్రజా ఉద్యమాలు ప్రజాస్వామిక వైఫల్యానికి చిహ్నాలు కావని పశ్చిమ యూరోప్‌లో గత అయిదు శతాబ్దాల కాలంలో సామాన్య ప్రజల ఉమ్మడి కార్యాచరణను నిశితంగా అధ్యయనం చేసిన చార్లెస్ టిల్లీ అనే చరిత్రకారుడు అభిప్రాయపడ్డారు. ప్రజాఉద్యమాలు వాస్తవానికి ప్రజాస్వామిక పాలన పరిణామ క్రమంలో ఉద్భవించినవేనని ఆయన అన్నారు. అవి వ్యవస్థ పట్ల శత్రుపూర్వకమైనవి కావు. ప్రజా నిరసనలు తరచూ వ్యవస్థాగత సంస్కరణలకు దారితీస్తాయి. వ్యవస్థల సానుకూల ప్రతిస్పందన ప్రజలు మరింతగా సంఘటితమయ్యేందుకు ఉద్దీపన అవుతుందని చార్లెస్ టిల్లీ నిర్ధారించారు. గ్లోబల్ సౌత్ (ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా) ప్రజాస్వామిక వ్యవస్థల్లో ప్రజాసమీకరణల ప్రత్యేక పాత్రను గుర్తించడం చాలా ముఖ్యం. 20వ శతాబ్దంలో వలసపాలన నుంచి విముక్తమైన చాలా దేశాలు ఉదారవాద ప్రజాస్వామ్యాన్ని అనుసరించాయి. అయితే చాలా దేశాలలో ఆ పాలనా పద్ధతులు ప్రభావశీలంగా అమలయేందుకు అవసరమైన సంస్థాగత ప్రాతిపదికలు బలహీనమైనవి. భారత్ లాంటి ప్రజాస్వామిక సమాజంలో ప్రజా ఉద్యమాలు, నిరసనలు సంస్థాగత లోపాలు, లొసుగులను అధిగమించేందుకు దోహదం చేస్తున్నాయి. భారత్‌లో పెద్ద ఎత్తున ప్రజ్వరిల్లే ప్రజా నిరసనలు సంస్థాగత వైఫల్యాలకు అత్యవసర ప్రతిస్పందనలు కావని, భారత ప్రజాస్వామ్య తార్కికతలో అవి అంతర్భాగాలని దీపేశ్ చక్రవర్తి అన్నారు. సమస్యల పరిష్కారానికి రాజ్య వ్యవస్థపై ఒత్తిడి తెచ్చేందుకు మూకుమ్మడి నిరసనలు అనేవి ప్రభావశీలంగా పనిచేస్తున్నాయి, సందేహం లేదు. అసమానతల సమాజంలో ప్రజా నిరసనలు ప్రజాస్వామ్య పరిపుష్టికి తోడ్పడతాయని, అవి ప్రజాస్వామ్యానికి ప్రతికూలతలు కావని భారత్, బ్రెజిల్, దక్షిణాఫ్రికాలలో ప్రజా ఉద్యమాలను తులనాత్మకంగా అధ్యయనం చేసిన పాట్రిక్ హెల్లర్ అభిప్రాయపడ్డారు.

న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పోటెత్తిన యువజనుల నిరసన అసాధారణ నేపథ్యాన్ని మనం అంగీకరించాలి. వర్తమాన భారతదేశం సాధారణంగా పనిచేస్తున్న ప్రజాస్వామ్యం కాదు. ప్రజాస్వామిక జవాబుదారీతనం, ప్రతిస్పందనాత్మక స్వభావం కనిపించని కాలమిది. అవధులు లేని సంపూర్ణ అధికారాలకు పాలకులు ఆరాటపడుతున్నారు. తమ విధానాలపై ప్రజల అభిప్రాయాలను అలక్ష్యం చేస్తున్నారు. ప్రధాన స్రవంతి మీడియా ప్రభుత్వానికి పూర్తి విధేయత చూపుతోంది. పాలనపై విమర్శలకు ప్రాధాన్యమివ్వడం లేదు. అలాగే రాజ్యాంగబద్ధ సంస్థలూ అధికారపక్షం రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తున్నాయి. అవి అంతకంతకూ స్వతంత్ర ప్రతిపత్తిని కోల్పోతున్నాయి. భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణకు స్వేచ్ఛ కొరవడుతోంది. ప్రతిపక్షాలను రూపు మాపేందుకు రాజ్యాధికారాలు దుర్వినియోగమవుతున్నాయి. ఎన్నికలు జరుగుతున్నాయి కానీ, అవి ఇంకెంత మాత్రం ప్రజల సంకల్పానికి తార్కాణాలుగా లేవు. ఎన్నికల బరిలోకి దిగిన అన్ని పక్షాలకు సమానావకాశాలు లభించడం లేదు. న్యాయవ్యవస్థ రాజ్యాంగ నిబంధనలను అమలు పరచలేకపోతోంది. అధికారపక్షం ప్రయోజనాలకు అనుకూలంగా వ్యవహరిస్తూ రాజ్యాంగ ప్రమాణాలను పాటించడం లేదు. ఇటువంటి పరిస్థితులలో వీధులలో ప్రజలను సమీకరించి, నిరసన తెలపడమే ప్రజా ఆకాంక్షలను వ్యక్తం చేసేందుకు లభ్యమవుతున్న ఏకైక మార్గం. వీధి నిరసనలు న్యాయబద్ధమైనవి, ప్రజాస్వామ్యయుతమైనవి, సమర్థనీయమైనవి. జంతర్ మంతర్ వద్ద యువజనుల ధర్నా అందుకొక పరిపూర్ణ దృష్టాంతం. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు శాంతియుత నిరసన మార్గాన్ని ఎంచుకున్నందుకు ఆ యువజనులకు మనం కృతజ్ఞతలు చెప్పాలి. వారి నిరసన వ్యవస్థపై తిరుగుబాటు కాదు. ప్రజాస్వామిక రాజకీయాలలో విశ్వాసాన్ని అది పునరుజ్జీవింపజేసింది. ఆ యువ ఉద్యమకారులు ప్రజాస్వామ్యానికి హాని చేయలేదు. ప్రజాస్వామ్యాన్ని వారు పునరుద్ధరించారు.

ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి,జూలై 31:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

జిల్లాలో పట్టణ ప్రాంతాల్లో వర్షపు నీటి సంరక్షణ,భూగర్భ జలాల పెంపు,పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ అరుణ శ్రీ తో కలిసి మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన పట్టణ పరిపాలన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జల శక్తి జన భాగిదారి కార్యక్రమంలో భాగంగా వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచేందుకు ప్రతి ఇంటిలో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.అన్ని ప్రాంతాల్లో ఇకపై కొత్తగా నిర్మించే ప్రతి ఇంటికి ఇంకుడు గుంత తప్పనిసరిగా ఉండాలని,ఇంకుడు గుంత లేని ఇళ్లకు ఇంటి నంబర్,తాగునీటి నల్లా కనెక్షన్ మంజూరు చేయబోమని స్పష్టం చేశారు.కొత్తగా ఇళ్ల నిర్మాణం చేపట్టే ప్రతి ఒక్కరూ ఈ నిబంధనను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ఇప్పటికే నిర్మించబడిన ఇళ్లలో కూడా వీలైనంత మేర ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు.పట్టణ ప్రాంతాల్లోని ప్రతి వార్డు పరిధిలో వచ్చే నెల రోజుల్లో కనీసం 30 ఇంకుడు గుంతలు నిర్మించేలా వార్డు అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని కార్యాచరణ రూపొందించాలని సూచించారు.ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో తప్పనిసరిగా సోక్‌పిట్‌లు ఏర్పాటు చేయాలని,వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.కాలానుగుణ వ్యాధుల నివారణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని, పట్టణాల్లో పారిశుద్ధ్య నిర్వహణను మరింత బలోపేతం చేయాలని సూచించారు.రహదారులపై ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని,దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు.తాగునీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షిస్తూ ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందేలా చూడాలని,ప్రజారోగ్యానికి భంగం కలిగించే పరిస్థితులు ఎక్కడా తలెత్తకుండా మున్సిపల్ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు వెంకటేష్,రమేష్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు ఇదే అరుదైన తరుణం

ఎకరాకు రూ. 50 వేల సబ్సిడీ - జిల్లా ఉద్యాన,పట్టు పరిశ్రమల అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్

పెద్దపల్లి,జూలై 31:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) జిల్లాలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఆయిల్‌పామ్ మొక్కల నాటడానికి మరియు కొత్త తోటల స్థాపనకు ఎంతో అనుకూలంగా ఉన్నాయని జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ తెలిపారు.వరి సాగుకు ప్రత్యామ్నాయంగా రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. భూమిలో తేమ సమృద్ధిగా ఉన్న ఈ వాతావరణాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.మొదటి మూడు సంవత్సరాల పాటు తోటలో కూరగాయలు,పప్పుధాన్యాలు వంటి స్వల్పకాలిక అంతర పంటలను సాగు చేసుకోవడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు.నాలుగో సంవత్సరం నుంచి ఆయిల్‌పామ్ గెలల కోత ప్రారంభమై రైతులకు ప్రతి నెలా నిరంతర ఆదాయం లభిస్తుందని వివరించారు.అలాగే డ్రిప్ ఇరిగేషన్,మల్చింగ్ పద్ధతుల ద్వారా నీటిని సమర్థవంతంగా పొదుపు చేసుకోవచ్చని తెలిపారు.ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు ఉద్యానవన శాఖ ద్వారా మొక్కలు,డ్రిప్ పరికరాలు,తోట నిర్వహణ నిమిత్తం అర్హులైన కొత్త రైతులకు ఎకరాకు రూ. 50 వేల వరకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందని పేర్కొన్నారు.రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, మరిన్ని వివరాల కోసం సమీపంలోని ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించాలని గడ్డం శ్యామ్ ప్రసాద్ కోరారు.

భూముల రీ-సర్వేను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు

పెద్దపల్లి,జూలై 31:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) జిల్లాలో చేపడుతున్న భూముల రీ-సర్వే కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని,అన్ని మండలాల్లో సర్వే పనులను వేగవంతంగా,పారదర్శకంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు ఆదేశించారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో రెగ్యులర్ సర్వేయర్లు,లైసెన్స్డ్ సర్వేయర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల్లో భూముల రీ-సర్వే ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా చేపట్టి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు.సర్వే ప్రక్రియలో నిబంధనలు, పారదర్శకతను కచ్చితంగా పాటిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులు నిర్వహించాలని తెలిపారు.ప్రతి సర్వేయర్‌కు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని,రీ-సర్వే పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.భూ రికార్డుల ఖచ్చితత్వం కోసం క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో పరిశీలన నిర్వహించాలని అన్నారు.భూముల రీ-సర్వే కార్యక్రమానికి సహకరించని లేదా నిర్లక్ష్యంగా వ్యవహరించే లైసెన్సుదు సర్వేయర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని,అవసరమైతే వారి లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు.రెగ్యులర్ సర్వేయర్లు, లైసెన్సుదు సర్వేయర్లు పరస్పర సమన్వయంతో పనిచేసి రీ-సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.జిల్లాలో రీ-సర్వే పనుల పురోగతి,మండలాల వారీగా చేపడుతున్న చర్యలు, ఎదురవుతున్న సమస్యలు,వాటి పరిష్కారంపై సమావేశంలో సమీక్ష నిర్వహించారు.ఈ సమావేశంలో పెద్దవల్లి ఆర్డీవో గంగయ్య,అదనపు సర్వేయర్ సోమేష్,రెగ్యులర్ సర్వేయర్లు,లైసెన్స్డ్ సర్వేయర్లు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నాలుగో బెటాలియన్లో ఉమేష్ ఘనంగా పదవీ విరమణ

హనుమకొండ జూలై 31 ప్రజా కలం ప్రతినిధి

మామనూర్ నాలుగవ బెటాలియన్ లో బెటాలియన్ నందు ఉమేష్ కుమార్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గా విధులు నిర్వర్తించి పదవీ విరమణ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంకు ముఖ్య అతిధిగా కమాండెంట్ డి.శివప్రసాద్ రెడ్డి హాజరు అయ్యి పదవీ విరమణ పొందుతున్న ఉమేష్ కుమార్ శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా కమాండెంట్ డి.శివ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... ఉమేష్ కుమార్ జూనియర్ అసిస్టెంట్ గా భర్తీ అయి అంచెలంచెలుగా ఎదిగి సీనియర్ అసిస్టెంట్,ఆఫీస్ సూపర్డెంట్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గా పదోన్నతులు పొందారు.మొదటి పోస్టింగ్ సిపిఒ కరీంనగర్,పిటిసి కరీంనగర్,సిపి కరీంనగర్,13వ బేటాలియాన్లో సుధీర్ఘ కాలం విధులు నిర్వర్తించి 4వ బేటాలియాన్లో తన సర్వీస్ లో ఎలాంటి రిమార్క్ లేకుండా పదవీ విరమణ పొశీదుతున్నారని తెలియజేసారు.ఉమేష్ కుమార్ సతీమణి సుధారాణి,వీరికి ఇద్దరు కుమార్తెలు సాయి నికిత, శ్రీ చందన. పదవీ విరమణ తర్వాత తమ కుటుంబంతో సంతోషంగా ఆయురారోగ్యాలతో ఉండాలని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్స్ కె.బాలయ్య, ఈ.వీరన్న రిజర్వు ఇన్స్పెక్టర్స్ విజయ్, కార్తీక్, రవి, సర్వర్,వెంకటేశ్వర్లు,రాజ్ కుమార్,కృష్ణ అధికారులు మరియు బెటాలియన్ సిబ్బంది, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది పాల్గొన్నారు.

స్థంభంపల్లి చెరువును పరిశీలించిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

వెల్గటూర్, జులై 31, ప్రజాకలం ప్రతినిధి :

జగిత్యాల జిల్లా, వెల్గటూర్ మండలంలోని స్థంభంపల్లి గ్రామ పరిధిలో గల పెద్ద చెరువును జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. మూడు రోజులపాటు కురిసిన భారీ వర్షాలకు అక్కడ గల చెరువు పూర్తిగా నిండి, కట్ట ప్రమాద స్థాయికి చేరుకుంది. కట్టకు ఏర్పాటు చేసిన తూము వద్ద గతంలో భారీగా గండిపడి" కట్ట" ప్రమాద స్థాయికి చేరుకోగా అధికారులు ఇసుక సంచులువేసి, గండిని మూసివేసి తాత్కాలిక మరమ్మతులు చేశారు. కాగా ప్రస్తుతం వరద నీటితో కట్ట తెగిపోయో ప్రమాదంలో ఉందని తెలుసుకున్న జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అక్కడికివెళ్లి చెరువును పరిశీలించి అక్కడి స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. భవిష్యత్తులో కట్టకు ఎటువంటి ప్రమాదం జరగకుండా ఉండేందుకు కోసం అవసమైన శాశ్వత చర్యలు చేపట్టాలని తెలిపారు.
కట్ట పై గల తుమ్మ చెట్లను తొలగించి, కట్ట కనిపించేలా చేయాలనీ ఆదేశించారు. ఈయన వెంట ఆర్డీఓ మధుసూదన్, వెల్గటూర్ తహసీల్దార్ శేఖర్, ఎస్సై ఉదయ్ కుమార్, ఇరిగేషన్ డీఈ చక్ర నాయక్, ఏఈ ప్రవీన్, సర్పంచ్ భూపెల్లి రాజయ్య, ఉప సర్పంచ్ యాగండ్ల గంగయ్య తదితరులు పాల్గొన్నారు..

బండలింగాపూర్‌లో బోనాల పండుగ సీసీ రోడ్డు ప్రారంభించిన జువ్వాడి నర్సింగరావు

మెట్‌పల్లి రూరల్, జూలై 31 (ప్రజా కలం);మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ గ్రామంలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారి బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల కాంగ్రెస్ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయానికి ఇటీవల మంజూరై నిర్మాణం పూర్తయిన నూతన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సాదుల్లా కుటుంబానికి రూ.51 వేల ఆర్థిక సాయం

ఇబ్రహీంపట్నం జులై 31(ప్రజా కలంప్రతినిధి) జగిత్యాల్ జిల్లా ఇబ్రహీంపట్నంమండలం లోనిగోధూర్ గ్రామానికి చెందిన ఎం.డి. సాదుల్లా ఇటీవల ఆకస్మికంగా మృతి చెందడంతో ఆయన కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న పదో తరగతి సహపాఠులు మానవత్వాన్ని చాటుకున్నారు. తమ వంతుగా తలా కొంత మొత్తం విరాళంగా అందించి మొత్తం రూ. 51,000 సేకరించారు. సేకరించిన మొత్తాన్ని సాదుల్లా కుమార్తె పేరుతో పోస్టాఫీసులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించి, గ్రామ సర్పంచ్ బండి రాజేష్, ఉపసర్పంచ్ ఓంకారి లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఆ డిపాజిట్‌కు సంబంధించిన చెక్కును సాదుల్లా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా సాదుల్లా కుటుంబానికి అండగా నిలిచిన సహపాఠుల సేవాభావాన్ని గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బండి రాజేష్, ఉపసర్పంచ్ ఓంకారి లక్ష్మణ్, క్లాస్‌మేట్స్ సాత్పడి శ్రీనివాస్, శ్రీధర్, రమేష్, శేఖర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు

-అదనపు కలెక్టర్ శ్రీరాములు

పెద్దపల్లి,జూలై 3:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) జిల్లాలో ప్రజల రెవెన్యూ సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని,భూ రీ-సర్వేను ప్రశాంత వాతావరణంలో చేపట్టాలని అదనపు రెవెన్యూ కలెక్టర్ బి.శ్రీరాములు అధికారులను ఆదేశించారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాం తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ సమీక్ష అనంతరం ఆయన శ్రీపాద యెల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించి వరద పరిస్థితులను పరిశీలించారు.ఈ సందర్భంగా మీసేవా దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలని,ఎస్ఐఆర్ ప్రక్రియకు కీలకమైన కుటుంబ రిజిస్టర్ ధ్రువపత్రాలను నిబంధనల ప్రకారం అర్హులకు మాత్రమే జారీ చేయాలని సూచించారు.అలాగే ఎగువ ప్రాంతాల వరదల దృష్ట్యా దిగువ ప్రాంతాల ప్రజలను, నది పరివాహక ప్రాంతాల్లో చేపల వేటకు వెళ్లే వారిని అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు.కాగా,మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రాజెక్టులో 147.46 మీటర్ల నీటి మట్టం 18.6750 టీఎంసీలు ఉండగా, 88,705 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా..15 గేట్లు ఎత్తి 96,428 క్యూసెక్కుల అవుట్‌ఫ్లోను విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్, రెవెన్యూ మరియు ప్రాజెక్టు అధికారులు పాల్గొన్నారు.

మా పార్టీ అంతర్గత వ్యవహారాలపై
వైసీపీకి అనవసర ఆసక్తి ఎందుకు?

వైసీపీ మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలకు టీడీపీ నుంచి ఘాటు కౌంటర్

నందిగామ: వైసీపీ మాజీ ఎమ్మెల్యే ఇటీవల తెలుగుదేశం పార్టీపై చేస్తున్న వ్యాఖ్యలపై చందర్లపాడు మండలం తుర్లపాడు గ్రామ టీడీపీ నాయకులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కార్యాలయం వేదికగా ఘాటుగా స్పందించారు. తమ పార్టీ అంతర్గత వ్యవహారాలపై వైసీపీ నాయకులు అనవసరంగా వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు. తమ పార్టీలో ఏం జరుగుతుందో చూసే ముందు మీ హయంలో 5 ఏళ్ల పాలనలో మీ పార్టీ లో జరిగిన పరిణామాలను గుర్తు చేసుకోవాలని పేర్కొన్నారు. గత ఐదేళ్ల వైకాపా పాలనను ప్రజలు మర్చిపోలేదు మర్చిపోలేరనీ టీడీపీ నేతలు అన్నారు. పరిటాలలో సొంత పార్టీ నాయకుల మధ్య జరిగిన ఘర్షణలు, సొంత పార్టీ కార్యకర్త రాజశేఖర్ రెడ్డి మృతికి కారణం, కంచికచర్లలో సొంత పార్టీ నాయకులపైనే ఎస్సీ, ఎస్టీ చట్టాల కింద కేసులు నమోదైన ఘటనలు, వెల్లంకిలో సొంత పార్టీ నాయకుల తిరుగుబాటు వంటి సంఘటనలు ప్రజలకు గుర్తున్నాయని పేర్కొన్నారు. నందిగామలో జరిగిన పరిణామాలు అందరికీ తెలుసు నందిగామలో వైసీపీకి చెందిన కౌన్సిలర్లు వేధింపులు తట్టుకోలేక పదవులు, ఊర్లు వదిలిన పరిస్థితులు కూడా ప్రజలకు తెలిసిన విషయాలేనని తెలిపారు. అధికారం కోల్పోయిన తర్వాత వైసీపీ నాయకులు రోజుకో ఆరోపణ చేస్తూ రాజకీయ ప్రచారం చేయడం సరికాదన్నారు. ఆ నైతిక హక్కు వైసీపీకి లేదన్న టీడీపీ పేకాట, జూదం, శాంతిభద్రతల అంశాలపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదని టీడీపీ నేతలు విమర్శించారు. అన్నా క్యాంటీన్ల ప్రారంభాన్ని అడ్డుకున్న ఘటనలను ప్రజలు ఇంకా గుర్తుంచుకున్నారని అన్నారు. హైకోర్టు ఉత్తర్వుల అమలుకు వెళ్లే సందర్భాల్లో కూడా రాజకీయ హంగామా సృష్టించడం సరైన విధానం కాదని అభిప్రాయపడ్డారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయండి

డోర్ టు డోర్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా చేపట్టండి

ఆదోని టీడీపీ నాయకులతో టిడిపి జాతీయ కార్య నిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ ఆత్మీయ సమావేశం

ఆదోని: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఆదోని పట్టణ, మండల టిడిపి నేతలు పని చేయాలని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ కోరారు. ఆదోని మండల, పట్టణ టిడిపి ముఖ్యనేతలతో నారా లోకేష్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... చిన్నచిన్న విభేదాలను పక్కనబెట్టి కూటమి నేతలు, కార్యకర్తలను కలుపుకెళ్లాలని అన్నారు. రెండేళ్ల కూటమి ప్రభుత్వ విజయాలపై డోర్ టు డోర్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించండి. మండల, క్లస్టర్, యూనిట్ ఇంచార్జిలు చురుగ్గా పనిచేయాలి. పనిచేసే వాళ్ళని గౌరవిస్తా. పార్టీ లైన్ దాటి ఎవరైనా మాట్లాడితే సహించేది లేదు. ఏవైనా సమస్యలు ఉంటే ఇంచార్జితో మాట్లాడండి. నాలుగు గోడల నడుమ కలసి కూర్చొని సమస్య పరిష్కరించుకోండి. మీడియాకి ఎక్కితే పార్టీ నష్టపోతుంది. రెవెన్యూ, పోలీసు సమస్యలు, జీ రామ్ జీ బిల్లుల సమస్యలపై అధికారులకు ఆదేశాలు ఇస్తాం. 2014-19 నడుమ హౌసింగ్ బిల్లుల సమస్యపై ముఖ్యమంత్రితో మాట్లాడి, విడతలవారీగా చెల్లించేలా కృషిచేస్తా. కూటమి ధర్మాన్ని పాటిస్తూ కలసికట్టుగా పని చేయాలని లోకేష్ దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జోనల్ ఇంచార్జి పెల్లకూరు శ్రీనివాసరెడ్డి, పార్లమెంటు పార్టీ అధ్యక్షురాలు కిస్టమ్మ, నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు కేశవరెడ్డి, ఆదోని పట్టణ పార్టీ అధ్యక్షుడు బి.తిమ్మప్ప, మండల పార్టీ అధ్యక్షుడు కురువ శివప్ప, జిల్లా పార్టీ ట్రెజరర్ వాల్మీకి రవి, ఆదోని టీడీపీ నాయకులు బి. కృష్ణయ్య, లక్ష్మీనారాయణ, బి. విరూపాక్షి, సజ్జాద్ హుసేన్, కొల్లా వీరేష్, రామాంజని, ఎస్.సయ్యదుల్లా, బిపి బస్వరాజ్, కురువ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బద్వేల్ పట్టణంలో గృహిణి ఆత్మహత్య

- విచారణ చేపట్టిన బద్వేల్ పోలీసులు

బద్వేలు : గొడ్లవీడు గ్రామం చెందిన గోపాల కృష్ణ రెడ్డి స్టేషన్ కు రాబడి తన కూతురు హేమలత కు 12 సంవత్సరాలు కింద ప్రభలవీడు గ్రామం కి చెందిన నెలటూరు రఘురామిరెడ్డి తో పెళ్ళి ఇద్దరు పిల్లలు ఉండి జీవనోపాధి కోసం కువైట్ లో వుంటూ కరోనా సమయంలో బద్వేల్ కు రాబడి తెలుగుగంగ కాలనీలో గత 5 సంవత్సరాలుగా నివాసం వుంటూ తాగుడు కి బానిసై కుటుంబమును నిర్లక్ష్యం చేస్తుండగా భార్య భర్త ల మధ్య సంసార సమస్యలు వచ్చి నిన్నటిదినం రాత్రి 9.30 గంటలకు ఇంట్లో ఉరి వేసుకొని చనిపోయినట్లు యిచ్చిన రిపోర్ట్ పై బద్వేల్ యు/జీ పోలీస్ స్టేషన్ అనుమానాస్పద మరణం కింద ఎస్సై చిరంజీవి కేసు నమోదు చేయడమైనది. కేసు విచారణ లో ఉంది. పోస్టుమార్టం నివేదిక అందిన తదనంతరం తదుపరి చర్యలు చేయడతాం. ప్రాథమికంగా కుటుంబ సమస్యలు ఈ మరణానికి ప్రాథమిక కారణంగా కనిపిస్తుండగా పూర్తిస్థాయిలో సమగ్ర విచారణ జరుపుతున్నామని బద్వేల్ యు/జి పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ బి. రామకృష్ణ తెలిపారు.

గంగాధర పోలీసు స్టేషన్ వార్షిక తనిఖీ చేసిన సిపి గౌష్ ఆలం

కరీంనగర్ : కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని గంగాధర పోలీసు స్టేషన్ ను కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ వార్షిక తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ కు విచ్చేసిన కమిషనర్ కు స్టేషన్ ఎస్సై వంశీకృష్ణ పూల మొక్కను అందించి స్వాగతం పలికారు. అనంతరం సాయుధ దళ పోలీసుల గార్డ్ అందించిన గౌరవ వందనం స్వీకరించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో పలు కేసుల్లో పట్టుబడి స్వాధీనంలో ఉన్న వాహనాల వివరాలు అడిగారు. పోలీస్ స్టేషన్ లో హాజరులో ఉన్న సిబ్బందితో మాట్లాడి, వారికి కేటాయించబడిన విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. సరైన పద్ధతిలో రికార్డుల నిర్వహణ, నమోదైన కేసుల వివరాలు సీసీటీఎన్ఎస్ లో పొందుపరచాలని సూచించారు. తెలంగాణ పోలీసులు టెక్నాలజీ వినియోగంలో భాగంగా ఉపయోగించే సీసీటీఎన్ఎస్-2.0, పిటిషన్ మేనేజ్మెంట్ సిస్టమ్‌లో ఈ-సమన్ల జారీ మరియు అమలు, టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్, దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్‌లో ఆర్థిక మరియు ఆర్థికేతర నేరాల సమాచారం, సీడీఆర్ వంటి అన్ని రకాల సాఫ్ట్‌వేర్ అప్లికేషన్‌లపై పూర్తి స్థాయిలో పట్టు సాధించి, వాటిని రోజువారీ విధుల్లో విరివిగా వినియోగించాలన్నారు. పోలీస్ స్టేషన్ కి కేటాయించబడిన పరికరాలను, అలాగే పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్ ను బ్లూ కోల్ట్స్ సిబ్బంది వినియోగించే తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయకుమార్, చొప్పదండి సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్, గంగాధర ఎస్సై వంశీకృష్ణలతో పాటు ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యమకారుల డిమాండ్లపై కాలయాపన వద్దు

జయశంకర్ భూపాలపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ప్రకటించిన మేనిఫెస్టో ప్రకారంగా కాలయాపన జరగకుండా డిమాండ్లను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ అధ్యక్షులు అక్రమొద్దీన్ కోరారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అయన మాట్లాడుతూ...గత ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను నిర్లక్ష్యం చేసిన విషయాన్ని ఎత్తిచూపుతున్న ప్రస్తుత ప్రభుత్వం ఉద్యమకారులను ఆదుకోవడంలో ముందుండాలని అన్నారు. టి యు ఎఫ్ రాష్ట్ర అధికారాల ప్రతినిధి ఎండి అయుబోదిన్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి ఆన్కారి ప్రభాకర్ లతో కలిసి మండలాధ్యక్షులు ఓ ఆ అక్రమొద్దీన్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల అంశాన్ని ప్రభుత్వ ప్రాధాన్య అంశంగా మార్చిన తెలంగాణ ఉద్యమకారుల పోరాట ఫలితంగా కే. కే.కమిటీ ఏర్పాటు. జార్ఖండ్, చత్తీస్గడ్ వంటి రాష్ట్రాల ఉద్యమకారులకు అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు తెలంగాణ ఉద్యమకారులకు కూడా అమలు చేయాలని అన్నారు.. ఇప్పటికే ప్రభుత్వము వేసిన కే. కే. కమిటీ వివిధ ఉద్యమ సంఘాలతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు, సూచనలు సేకరించడం జరిగినది.
ఇకపై ఈ కమిటీ ఆలస్యం చేయకుండా రాష్ట్ర క్యాబినెట్ మరియు అసెంబ్లీలో చర్చించి మేనిఫెస్టోలో పెట్టిన అన్ని హామీలు నెరవేర్చాలని కోరుకుంటున్నాము.

అసెంబ్లీ హామీల్లో సగమే అమలు

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పుష్కరం పూర్తయింది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తర్వాత 2018లో జరిగిన ముందస్తు ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చింది. కేసీఆర్ సారథ్యంలో పాలన సాగింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రస్తుతం పాలన సాగుతోంది. అయితే రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రులు, మంత్రులు ఇచ్చిన హామీల అమలు పెద్ద సవాల్‌గా మారింది. ఇప్పటి వరకు సగం హామీలే నెరవేరాయని శాసనసభ హామీల అమలు కమిటీ స్వయంగా వెల్లడించింది. గడిచిన 12 ఏళ్లలో పాలకులు అసెంబ్లీ వేదికగా 2,266 హామీలు ఇచ్చారు. వీటిలో ఇప్పటి వరకు 1,092 అమలయ్యాయి. 1,174 హామీలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇందులో 750 హామీలు గత ప్రభుత్వ కాలంలో ఇచ్చినవి. అసెంబ్లీలో ఇచ్చే హామీలు ప్రజలకు ఇచ్చే నమ్మకం. అవి నెరవేరకపోతే ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకం తగ్గుతుంది. రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఇన్ని సంవత్సరాలు గడిచినా సగం హామీలు పెండింగ్‌లో ఉండటం చట్టసభపై అలసత్వం నిర్లక్ష్యాన్ని సూచిస్తోంది. గత ప్రభుత్వ హామీలు ఎక్కువగా మిగిలిపోవడం ఒక వైపు. ప్రస్తుత ప్రభుత్వం వాటిని సమీక్షించి పరిష్కరించాల్సిన బాధ్యత ఉంది. మంత్రి శ్రీధర్ బాబు, స్పీకర్ గడ్డం ప్రసాద్ సమక్షంలో జరిగిన సమావేశంలో పెండింగ్ హామీలపై చర్యలు తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఇది సానుకూల అడుగు. అయితే కేవలం సమీక్షతో సరిపోదు. సమయ పట్టిక, బాధ్యతలు నిర్ణయించి, పురోగతిని క్రమం తప్పకుండా ప్రజలకు తెలియజేయాలి. హామీలు అమలు కాకపోవడంతో ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూరదు. అభివృద్ధి పథకాలు, సేవలు, స్థానిక సమస్యల పరిష్కారం ఆలస్యమవుతాయి. అసెంబ్లీలో ఇచ్చే హామీలు చట్టబద్ధమైన బాధ్యతగా పరిగణించబడాలి. లేకపోతే రాజకీయ ప్రకటనలు మాత్రమేగా మిగిలిపోతాయి. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకాన్ని బలహీనపరుస్తుంది. పెండింగ్ హామీలను ప్రాధాన్యత ఆధారంగా వర్గీకరించాలి. కొన్ని వెంటనే అమలు చేయగలిగేవి, కొన్ని దీర్ఘకాలిక ప్రణాళిక అవసరమైనవి. విభాగాల మధ్య సమన్వయం పెంచాలి. అమలు స్థితిని క్రమం తప్పకుండా అసెంబ్లీకి, ప్రజలకు నివేదించాలి. పారదర్శకత పెరిగితే నమ్మకం పునరుద్ధరణకు అవకాశం ఉంటుంది.

వర్షపు నీటిని ఒడిసిపట్టుకోలేమా

వర్షపు నీటిని ఒడిసిపట్టడంలో పాలకుల వైఫల్యం మరొక ఎత్తు. రాజకీయ నాయకులు కేవలం నీటి కేటాయింపులపైనే దృష్టి పెడుతున్నారు తప్ప వస్తున్న వరదను ఎలా నిల్వ చేయాలో ఆలోచించడం లేదు. పొరుగు రాష్ట్రాలపై బురదజల్లే బదులు రాష్ట్రంలోని నీటి వనరులను సద్వినియోగం చేసుకోవడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అత్యవసర పరిస్థితి ప్రస్తుతం స్పష్టంగా కనిపిస్తోంది. బంగాళాఖాతంలో అల్పపీడనాలు లేదా వాయుగుండాలు ఏర్పడినప్పుడు ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతం కంటే తెలంగాణలో భారీ వర్షాలు పడటం గమనించదగ్గ విషయం. సముద్రతీరంలో ఉన్న విశాఖపట్నంలో కేవలం ఈదురుగాలులు వీస్తున్నప్పటికీ, హైదరాబాద్ నగరంతో పాటు తెలంగాణలోని అనేక జిల్లాలలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం రాబోయే రెండు మూడు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇప్పటికే పలు గ్రామాలు, పట్టణాలు నీట మునిగి జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తమైంది. వర్షాల తీవ్రత కారణంగా హైదరాబాద్ నగరంలో ఐటీ ఉద్యోగులను సాయంత్రం వేళల్లో ఇళ్లకు త్వరగా పంపించివేయాలని పోలీసు కమిషనర్ స్వయంగా విజ్ఞప్తి చేశారు. రాత్రి సమయంలో భారీ వర్షం పడితే మహానగరం మరోసారి నీట మునిగిపోయే ప్రమాదం ఉంది. ఇది హైదరాబాద్ కీర్తిని తగ్గించడం కాదు, ప్రతి వర్షాకాలంలోనూ పునరావృతమవుతున్న చేదు వాస్తవం అని అందరికీ తెలుసు. గట్టిగా వాన పడిన ప్రతిసారీ నగరాలు, పల్లెలు నీట మునుగుతున్నాయే తప్ప ఆ వరద నీటిని ఎక్కడికి మళ్లించి భద్రపరుచుకోవాలో అర్థం కాని దుస్థితి నెలకొంది. తెలంగాణ వ్యాప్తంగా వేలాది ఎకరాల పంట పొలాలు, రోడ్లు జలమయం అవుతున్నా పాలకులకు ఇంకా నీళ్ల కోసం ఆరాటమే మిగులుతోంది. నీటి చుట్టూ రాజకీయాలు చేస్తూనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని నిందించడం రాజకీయ పార్టీలకు పరిపాటిగా మారింది. వరద ముంపు సమస్య శాశ్వత పరిష్కారం గురించి ఎవరూ ఆలోచించడం లేదు. పొరుగు రాష్ట్రంపై ఆరోపణలు గుప్పించడం ద్వారా ప్రజల దృష్టిని మళ్లించవచ్చని నాయకులు భావిస్తున్నారు. కానీ ప్రకృతి ఇస్తున్న సంపదను కాపాడుకోవడంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పట్టించుకోకుండా కేవలం రాజకీయ లబ్ధి కోసమే ఈ నిరసనలు కొనసాగుతున్నాయనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని నిందించే బదులు ముంచెత్తుతున్న వరద నీటిని ఎక్కడికక్కడ కాలువలు నిర్మించి రిజర్వాయర్లకు మళ్లించుకునే అద్భుతమైన అవకాశం ఉంది. హైదరాబాద్ నగరంలో కొన్ని ప్రధాన జంక్షన్ల వద్ద వరద నీటిని సేకరించేందుకు భూగర్భ స్టోరేజ్ ట్యాంకులు నిర్మించిన పద్ధతిని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలకు విస్తరించవచ్చు. వర్షాకాలంలో వృథాగా పోతున్న వేల టీఎంసీల నీటిని ఇలాంటి రిజర్వాయర్లు, స్టోరేజ్ ట్యాంకుల్లోకి మళ్లిస్తే భవిష్యత్తులో సాగునీటి కొరత ఉండదు. ప్రాజెక్టుల నిర్మాణం, కాలువల ఆధునీకరణపై సరైన ప్రణాళిక ఉంటే ప్రతి గొంతుకు నీరు అందుతుంది. కేవలం రాజకీయ మైలేజ్ కోసం నిత్యం ఆంధ్రాను దోషిగా చూపడం మానేసి సొంత రాష్ట్రంలో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే దిశగా పాలకుల ఆలోచన సాగాలి. వృథాగా పోతున్న వరద నీటిని ఒడిసిపట్టే సమర్థవంతమైన ఇంజనీరింగ్ అడుగులు పడిననాడే రాష్ట్రానికి నిజమైన నీటి భద్రత లభిస్తుంది.

పక్కా వ్యూహాలతో టీపీసీసీ

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయ క్షేత్రంలో ముందస్తు వ్యూహాలు, రాజకీయ ఎత్తుగడలు వేడెక్కుతున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పన్నుతున్న రాజకీయ వ్యూహాలను, కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సిద్ధమైంది. రాష్ట్రంలో రాజకీయ ఆధిపత్యం కోసం సాగుతున్న పోరులో బీజేపీ అవలంబిస్తున్న తీరును గమనించిన కాంగ్రెస్ నాయకత్వం, దాన్ని క్షేత్రస్థాయిలోనే ఎదుర్కొనేందుకు సమరశంఖం పూరించింది. ఇందులో భాగంగానే, న్యూఢిల్లీలోని ఇందిరా భవన్ వేదికగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ సమన్వయ కమిటీ అత్యంత కీలకమైన సమావేశాన్ని నిర్వహించింది. పీసీసీ సమన్వయ కమిటీ ఏర్పాటైన సుమారు నాలుగు నెలల తర్వాత మొదటిసారి జరిగిన ఈ భేటీ రాజకీయంగా ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ నాయకత్వంలో జరిగిన ఈ భేటీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, సీనియర్ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, దామోదర రాజనర్సింహ, వంశీచంద్ తదితర అగ్రనేతలు పాల్గొన్నారు. దాదాపు గంటన్నరకు పైగా సాగిన ఈ సమావేశంలో ప్రధానంగా ఓటర్ల నమోదు, ఎస్ఐఆర్, రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల సవరణ ప్రక్రియను దుర్వినియోగం చేస్తూ, అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని కాంగ్రెస్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. ఈ ఓట్ల తొలగింపు కుట్రను ఏకగ్రీవంగా తిప్పికొట్టాలని కమిటీ నిర్ణయించింది. ప్రస్తుతం ఈ సవరణ ప్రక్రియ రాష్ట్రంలో 50 నుండి 60 శాతం మేర పూర్తయిందని, రాబోయే రెండు మూడు రోజుల్లో మొదటి దశ పూర్తిగా ముగియనుందని వెల్లడించారు.
ఈ నేపథ్యంలో అర్హత కలిగిన ఏ ఒక్క పౌరుడూ ఓటు హక్కును కోల్పోకుండా చూసేందుకు క్షేత్రస్థాయిలో ఉన్న 36 వేల మంది బూత్ లెవల్ ఏజెంట్లు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ముగిసే వరకు పార్టీ ముఖ్య నేతలు, డీసీసీలు, మండల స్థాయి నాయకులు ఎలాంటి ఇతర పనులూ పెట్టుకోకుండా పూర్తిస్థాయిలో దీనిపైనే దృష్టి సారించాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియలో మందకొడిగా వ్యవహరించిన కొందరు పార్టీ ఇన్చార్జులు, ఎమ్మెల్యేలు, బీఎల్ఏల తీరుపై సమావేశంలో మీనాక్షి నటరాజన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. నిర్లక్ష్యం వహించే వారిపై రివ్యూ జరిపి, పార్టీ పరంగా కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించడం కాంగ్రెస్ కఠిన వైఖరికి నిదర్శనం.
పార్టీ యంత్రాంగం- ప్రభుత్వం మధ్య మెరుగైన సమన్వయం సాధించడం కోసం ప్రతి రెండు నెలలకోసారి పీసీసీ సమన్వయ కమిటీ భేటీ కావాలని ఏకాభిప్రాయానికి వచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రాబోయే ఖమ్మం-వరంగల్-నల్గొండ, హైదరాబాద్- రంగారెడ్డి -మహబూబ్ నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది.
ఈ రెండు స్థానాల్లో విజయం సాధించడమే లక్ష్యంగా జిల్లాల ఇన్చార్జిలు, జిల్లా పీసీసీలతో కూడిన ముగ్గురు సభ్యుల నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి నివేదికల ఆధారంగా ముందుకు సాగాలని నిర్ణయించారు. మొత్తానికి, ఓటర్ల జాబితా పరిరక్షణ నుండి ఎన్నికల వ్యూహాల వరకు కాంగ్రెస్ వేస్తున్న ఈ అడుగులు రాష్ట్ర రాజకీయాల్లో బీజేపీ దూకుడుకు అడ్డుకట్ట వేయడమే కాకుండా, రాబోయే రోజుల్లో పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయనున్నాయని స్పష్టమవుతోంది.

రేవంత్‌లో ఫైర్ తగ్గుతుందా?

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శైలి అనగానే ఎవరికైనా గుర్తొచ్చేది ఆయన దూకుడు, ప్రత్యర్థులపై విరుచుకుపడే నిరంతర ఎదురుదాడి. విపక్ష హోదాలో ఉన్నా, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నా ఆయన వైఖరి ఎప్పుడూ ఆఫెన్సివ్‌గానే ఉండేది. అయితే, ఇటీవల సొంత నియోజకవర్గం కొడంగల్ సమావేశాల్లోనూ, ఇతర బహిరంగ వేదికలపైనా ఆయన మాట్లాడిన మాటలు రాజకీయ వర్గాల్లో సరికొత్త చర్చకు తెరలేపాయి. కొడంగల్ సహా పలు సభల్లో తనపై కుట్రలు చేస్తున్నారని అంటున్నారు. విపక్షాలు నన్ను పని చేసుకోనివ్వాలి.. నా గొంతు నొక్కాలని చూస్తున్నారు అంటూ సీఎం చేసిన వ్యాఖ్యలు ఆయన నిరంతర ఫైరింగ్ టోన్‌కు భిన్నంగా, ఒక రకమైన ఆవేదనను లేదా ఆత్మరక్షణ ధోరణిని ప్రతిబింబిస్తున్నాయనే అభిప్రాయం వినిపిస్తోంది. ఈ మార్పు వెనుక ఉన్న ప్రధాన కారణాలను పరిశీలిస్తే.. పరిపాలనలో ఎదురవుతున్న క్షేత్రస్థాయి సవాళ్లే మొదటిది. ఎన్నికల హామీలుగా ఇచ్చిన ఆరు గ్యారంటీలు పూర్తిస్థాయిలో నెరవేర్చడంలో ఎదురవుతున్న ఆర్థిక పరిమితులు, ఉపాధి హామీలు, పింఛన్ల పంపిణీపై విపక్షాల నుంచి వస్తున్న నిరంతర ఒత్తిడి ఒకవైపు కాగా హైడ్రా సృష్టించిన కలకలం, ప్రభుత్వాన్ని కొంత రక్షణత్మక వైఖరిలోకి నెట్టాయి. గడిచిన ఎనిమిది-తొమ్మిది నెలల పాలనలో ఊహించిన వేగంతో ప్రాజెక్టులు ముందుకు సాగకపోవడం, అనుకున్న స్థాయిలో నిధుల సమీకరణ కాకపోవడం వల్ల వచ్చిన అసంతృప్తి రేవంత్ రెడ్డి స్పీచ్‌లలో ప్రతిబింబిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు, కొడంగల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఫార్మా సిటీ నిరసనలపై ప్రతిపక్షాలైన బిఆర్ఎస్ , బిజెపి సంయుక్తంగా తన రాజకీయ పునాదినే దెబ్బతీసేందుకు వ్యూహాలు రచిస్తున్నాయని సీఎం బహిరంగంగా ఆరోపించడం ఆయనలోని రాజకీయ భయాన్ని స్పష్టం చేస్తోందని విపక్ష నేతలంటున్నారు. తన సొంత నియోజకవర్గంలోనే ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని, తన పట్టును బలహీనపరిచేందుకు విపక్షాలు ఏకమవుతున్నాయని పదేపదే అనడం పార్టీ నేతలకు కూడా ఇబ్బందికరంగా ఉంది. కాంగ్రెస్ పార్టీ అంతర్గత సమీకరణలు కూడా రేవంత్ శైలిని ప్రభావితం చేస్తున్నాయి. ఒకవైపు ఢిల్లీ అధిష్టానం నిర్ణయాలపై ఆధారపడటం, మరోవైపు మంత్రివర్గంలోని సీనియర్ నేతల వైఖరి, అసంతృప్తుల సమన్వయం వంటి అంశాలు ఆయన స్వేచ్ఛాయుత నిర్ణయాధికారానికి అడ్డుకట్ట వేస్తున్నాయి. గతంలో ఫైర్ బ్రాండ్ నాయకుడిగా విమర్శలు చేసిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు ముఖ్యమంత్రి అనే రాజ్యాంగబద్ధమైన స్థానంలో ఉండటం వల్ల వ్యాఖ్యల్లో కొంత సంయమనం వహించాల్సి రావడం సహజమే అయినా.. నన్ను పని చేసుకోనివ్వడం లేదు అనే రక్షణాత్మక ధోరణి ప్రతిపక్షాలకు ఆయుధంగా మారుతోంది. రేవంత్ రెడ్డి మాటల్లో కనిపిస్తున్న ఈ హెచ్చుతగ్గులు కేవలం

పాలనాపరమైన ఒత్తిడి వల్ల వచ్చినవి కావు. గ్రేటర్ ఎన్నికలు, కొడంగల్‌లో పట్టు నిలుపుకోవడం, విపక్షాల ఐక్య దాడిని తిప్పికొట్టే క్రమంలో ఆయన అమల్లోకి తెచ్చిన సెంటిమెంట్ కార్డ్ కూడా కావచ్చు. అయితే, ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న నాయకుడు ఆవేదన వ్యక్తపరిస్తే అది బలహీనతగా ప్రచారమయ్యే ప్రమాదం ఉంది కాబట్టి, రాబోయే రోజుల్లో రేవంత్ రెడ్డి తిరిగి తన మార్క్ ఆఫెన్సివ్ డెవలప్‌మెంట్ ఎజెండాతో ముందుకు వస్తారా లేక ఈ పొలిటికల్ అప్రమత్తతలోనే కొనసాగుతారా అనేది వేచి చూడాలి.

నల్గొండలో కోమటి వర్గానిదే పై చేయి

నల్గొండ : తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో జిల్లా అధ్యక్షుల మార్పు అంశం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది. ముఖ్యంగా నల్గొండ డీసీసీ పీఠంపై జరుగుతున్న పోరు అధికార పార్టీలో అంతర్గత కుమ్ములాటలను బట్టబయలు చేస్తోంది. ప్రస్తుత అధ్యక్షుడు పున్నా కైలాష్ నేతను పదవి నుంచి తొలగించాలనే ప్రతిపాదన తీవ్ర దుమారానికి దారితీసింది. కోమటిరెడ్డి సోదరులు మొదటి నుంచి ఈయన నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్నారు.

గతంలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రోటోకాల్ వివాదం తలెత్తడం, స్థానిక కేడర్ మధ్య విభజన స్పష్టంగా కనిపించడం పార్టీలో చర్చనీయాంశమైంది. ఒకవైపు అధినేత అండదండలు ఉన్నప్పటికీ, సొంత జిల్లా మంత్రుల ఒత్తిడి కారణంగా ఈ మార్పు వ్యవహారం అత్యంత సున్నితమైన రాజకీయ అంశంగా మారింది. ఈ పరిణామం కేవలం ఒక పదవికి సంబంధించినది కాకుండా, పార్టీలో ఎవరి ఆధిపత్యం చెల్లుబాటు అవుతుందనే దానికి నిదర్శనంగా మారింది. ఒకవేళ పున్నాపై వేటు పడితే, అది సీఎం రేవంత్ రెడ్డి వర్గానికి ఎదురుదెబ్బగా భావించాల్సి వస్తుంది. కోమటిరెడ్డి బ్రదర్స్ పట్టు నెగ్గితే, అది ప్రత్యర్థి శిబిరానికి స్పష్టమైన రాజకీయ సంకేతాలను పంపుతుంది. ముఖ్యమంత్రి పూర్తి మద్దతు ఇస్తున్నప్పటికీ, మంత్రివర్గంలో చక్రం తిప్పుతున్న బలమైన మంత్రుల ఒత్తిడిని అధిగమించడం నాయకత్వానికి కత్తిమీద సాములా మారింది. ఉమ్మడి నల్గొండ జిల్లా రాజకీయ సమీకరణాలు ఎప్పుడూ అత్యంత కీలకమైనవే కాబట్టి, ఇక్కడ తీసుకునే ప్రతి నిర్ణయం రాష్ట్ర స్థా యిపై ప్రభావం చూపుతుంది. ఈ నేపథ్యం లో అధిష్ఠానం ఎవరి వైపు మొగ్గు చూపు తుందనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. ఈ వివాదంలో అత్యంత కీలకమైన అంశం సామాజిక సమీకరణాలు కావడం గమనార్హం. పున్నా కైలాష్ నేత బీసీ వర్గానికి చెందిన ప్రముఖ నాయకుడు కావడం పార్టీకి ఇప్పుడు పెద్ద సవాల్‌గా మారింది. ప్రభుత్వం ఇప్పటికే కుల గణనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న తరుణంలో, బీసీ నేతను పదవి నుంచి తప్పించడం తీవ్ర విమర్శలకు దారితీసే ప్రమాదం ఉంది. త్వరలో ఎమ్మెల్సీ ఎన్నికలు సమీపిస్తున్న ఈ తరుణంలో ఇలాంటి నిర్ణయం తీసుకుంటే, ప్రతిపక్షాలకు బలమైన అస్త్రం దొరికినట్లే అవుతుంది. కాంగ్రెస్ పార్టీ బలహీన వర్గాలకు వ్యతిరేకంగా పనిచేస్తోందనే తప్పుడు సంకేతాలు ప్రజల్లోకి వెళ్లే అవకాశం లేకపోలేదు. సామాజిక న్యాయం నినాదానికి తూట్లు పడుతున్నాయనే విమర్శలు రాకుండా ఉండేందుకు పార్టీ పెద్దలు ఆచితూచి అడుగులు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్గపోరు తీవ్ర రూపం దాల్చడం, బీసీ వర్గాల నుంచి వ్యతిరేకత వచ్చే ప్రమాదం పొంచి ఉండటంతో కాంగ్రెస్ హైకమాండ్ తల పట్టుకుంటోంది. ఒకవైపు మంత్రుల పట్టుదల, మరోవైపు ఎన్నికల సమయాన సామాజిక సమీకరణాలు దెబ్బతింటాయనే ఆందోళన పార్టీలో గుబులు పుట్టిస్తున్నాయి. ఇలాంటి సాహసోపేత నిర్ణయాలు పార్టీకి నష్టం చేకూరుస్తాయని అనుభవజ్ఞులైన నేతలు హెచ్చరిస్తున్నారు. సరిగ్గా ఎన్నికల వేళ అసమ్మతి రాగాలు పెరిగితే అది నష్టాన్ని కలిగిస్తుంది. వివాదాలను సద్దుమణిగిస్తూ, అందరినీ కలుపుకెళ్లే వ్యూహరచన చేయడంలో అధిష్ఠానం విఫలమైతే, అది ప్రత్యర్థులకు రాజకీయంగా లబ్ధి చేకూరుస్తుంది. ఈ సంక్లిష్ట పరిస్థితిని పార్టీ పెద్దలు ఎలా చక్కదిద్దుతారనేది అత్యంత ఆసక్తికరంగా మారింది.

గురుకుల డిగ్రీ కళాశాల నుంచి ఇద్దరు విద్యార్థినుల అదృశ్యం

మహబూబాబాద్ : పట్టణం లోని తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల నుంచి ఇద్దరు విద్యార్థినుల అదృశ్యం అయ్యారు. దాంతో కళాశాల ప్రిన్సిపాల్ బిందు మాధవి పోలీసులకు ఫిర్యాదు చేసారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా విచారణ చేపట్టారు. విద్యార్థినుల తల్లిదండ్రులు అందోళనలో వున్నారు.

ఝార్ఖండ్ బొగ్గు మాఫియాపై ఈడీ ఉక్కుపాదం

ధన్ బాద్ : అక్రమ బొగ్గు తవ్వకాలు, మనీలాండరింగ్ ఆరోపణలపై ధన్బాద్ జిల్లాలోని 25 చోట్ల ఈడీ ఏకకాలంలో భారీ సోదాలు నిర్వహించింది. ఈ సోదాల్లో భారీ మొత్తంలో నగదు, ఆస్తుల పత్రాలు, డిజిటల్ ఆధారాలు, ఆర్థిక రికార్డులను ఈడీ స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. దర్యాప్తులో భాగంగా సుమారు రూ.600 కోట్ల విలువైన ఆస్తులు, పెట్టుబడులను గుర్తించిన ఈడీ.. వాటిని ఫ్రీజ్ చేసినట్లు సమాచారం. దర్యాప్తులో అక్రమ బొగ్గు తవ్వకాల ద్వారా వచ్చిన నిధుల జాడను గుర్తించి, వాటి నెట్వర్క్ను ఛేదించడంపై ఈడీ దృష్టి సారించింది.

ఇన్ స్టాలో ప్రేమ, పరిచయం

హైదరాబాద్ : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన లైంగిక వేధింపుల కేసులో శిక్షణలో ఉన్న ఐపీఎస్ అధికారి ఎం. ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. సహచర మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి చేసిన ఫిర్యాదు మేరకు అరెస్టయిన అతడిని ఉప్పరపల్లి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. దీంతో నిందితుడిని చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ ఒక ప్రకటనలో వెల్లడించారు. శివరాంపల్లిలోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ(ఎస్‌వీపీఎన్‌పీఏ)లో శిక్షణ పొందుతున్న కర్ణాటకకు చెందిన 30 ఏళ్ల మహిళా అధికారిణి జూలై 18న అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఉదయ్ కృష్ణారెడ్డి తనపై పలుమార్లు లైంగిక వేధింపులకు పాల్పడటమే కాకుండా, అసభ్యకర సందేశాలు పంపాడని, కత్తితో బెదిరించి, గొంతు నులిమి హత్య చేసేందుకు ప్రయత్నించాడని ఆమె ఆరోపించారు. తన ప్రైవేట్ వీడియోలను చిత్రీకరించి భర్తకు పంపాడని కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసు దర్యాప్తును హైదరాబాద్ ఉమెన్స్ సేఫ్టీ వింగ్ డీసీపీ లావణ్య నాయక్ నేతృత్వంలోని ప్రత్యేక బృందానికి అప్పగించారు. బాధితురాలికి నిర్వహించిన వైద్య పరీక్షల్లో ఆమె మెడ, బుగ్గలపై గాయాలున్నట్లు నిర్ధారణ అయింది. నిందితుడు ఉదయ్ కృష్ణారెడ్డి గతంలో పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించినట్లు సజ్జనార్ వెల్లడించారు. యూపీఎస్సీలో 350వ ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికైన అతను, 2025 డిసెంబర్ నుంచి శిక్షణ పొందుతున్నాడని తెలిపారు. అదే ఏడాది మధ్యలో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా బాధితురాలితో నిందితుడికి పరిచయం ఏర్పడినట్లు వివరించారు. కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్ కు ఎంపికైన తన విజయప్రస్థానంపై ఉదయ్ కృష్ణారెడ్డి పెట్టిన పోస్టుకు బాధితురాలు స్పందించడంతో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో, తాను 2024 బ్యాచ్ ఐపీఎస్‌కు ఎంపికయ్యానని, ఎక్స్‌ట్రా ఆర్డినరీ లీవ్‌లో ఉన్నందున 2025 బ్యాచ్‌తో కలిసి శిక్షణ తీసుకోనున్నట్లు బాధితురాలు నిందితుడికి తెలియజేసినట్లు వెల్లడించారు. ఆ పరిచయం కాస్తా స్నేహంగా మారి, తదనంతరం ప్రేమకు దారితీసిందని సజ్జనార్ పేర్కొన్నారు. శిక్షణ సమయంలో వీరి మధ్య బంధం బలపడినప్పటికీ, కొంతకాలానికి ఇద్దరి మధ్య మనస్పర్థలు తలెత్తాయని తెలిపారు. నిందితుడి పలుమార్లు ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడమే కాకుండా, బాధితురాలి ల్యాప్‌టాప్‌ను విసిరికొట్టి ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. బాధితురాలు తనను బ్లాక్ చేయడంతో, నిందితుడు నకిలీ సోషల్ మీడియా ఖాతాలను సృష్టించి వ్యక్తిగత చాట్ వివరాలను బహిర్గతం చేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడని సజ్జనార్ తెలిపారు. వేధింపులు భరించలేక బాధితురాలు అతడికి దూరంగా జరిగి మరొకరిని వివాహం చేసుకున్నప్పటికీ, నిందితుడి వేధింపులు కొనసాగడంతో చివరకు ఆమె పోలీసులను ఆశ్రయించారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకుల అరెస్టు

– వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఈగల్ ఫోర్స్ దాడి..

ఎల్బీనగర్ :గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకులను ఈగల్ ఫోర్స్ నార్కోటిక్స్ పోలీసులు అరెస్టు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు ప్రత్యేక బృందం సాహెబ్‌నగర్‌లోని బాల్‌రెడ్డి గ్రౌండ్ సమీపంలోదాడి నిర్వహించింది. ఈ దాడిలోచింతల్‌కుంట సరస్వతీనగర్‌కు చెందిన గుర్రపు హర్ష్ రోహిత్ (19), వనస్థలిపురం పోలీస్ కాలనీకి చెందిన కోట కృపాకర్ (21) లను గంజాయి సేవిస్తున్న సమయంలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని ఈగల్ ఫోర్స్ నార్కోటిక్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రాథమిక విచారణలో ఇద్దరికీ స్నేహితుల ద్వారానే గంజాయి అలవాటు అయినట్లు వెల్లడైందని పోలీసులు పేర్కొన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, గంజాయి విక్రయాలు లేదా వినియోగంపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని అధికారులు సూచించారు.

ఆర్వోబీ పనుల జాప్యంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపాటు

కరీంనగర్ : కరీంనగర్లోని తీగలగుట్టపల్లి ఆర్వోబీ నిర్మాణ పనుల జాప్యంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఎందుకు చేయలేదని ఆర్‌అండ్బి అధికారులు, కాంట్రాక్టర్లను ప్రశ్నించారు. భూసేకరణలో జాప్యం కారణంగా పనులు ఆలస్యమయ్యాయని అధికారులు వివరించగా, బీటీ రోడ్డు, కల్వర్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదని తెలిపారు. దీంతో మేయర్ కొలగాని శ్రీనివాస్, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ వెంటనే ఆర్వోబీ ప్రాంతాన్ని పరిశీలించి, మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలోనే యుద్ధ ప్రాతిపదికన బీటీ రోడ్డు, కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాగా, భూసేకరణ పూర్తయిన వెంటనే ఆర్వోబీ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ వెల్లడించారు.

లోకల్ ఎన్నికలపై విజయ్ బ్యాక్ స్టెప్

చెన్నై : తమిళనాడు రాజకీయ వేదికపై విప్లవాత్మక మార్పులతో అధికారాన్ని కైవసం చేసుకుని ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్, ప్రతిపక్షాలకు చిక్కని కొత్త వ్యూహానికి తెరలేపినట్లు కనిపిస్తోంది. రాష్ట్రంలో త్వరలోనే జరగాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలను వెంటనే నిర్వహించడానికి ప్రభుత్వం సుముఖంగా లేదనే వార్తలు కొద్దిరోజులుగా ప్రచారంలోకి వచ్చాయి. పంచాయతీ, మునిసిపాలిటీ స్థాయిల్లో ఇప్పుడే ఎన్నికలకు వెళ్తే పార్టీకి మైలేజ్ కంటే నష్టమే ఎక్కువ జరుగుతుందనే అంచనాలతోఎన్నికలను కనీసం ఒక ఏడాది పాటు వాయిదా వేయాలని సీఎం విజయ్ వ్యూహాత్మక నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాల్లో విస్తృతమైన చర్చ జరుగుతోంది. ఈ వ్యూహాత్మక వెనుకంజ వెనుక ఉన్న అసలు కారణం.. టీవీకేకి క్షేత్రస్థాయిలో ఉన్న బలహీనమైన సంస్థాగత నిర్మాణమే . అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ స్టార్ పవర్, యువత ఓట్లు , కొత్త మార్పును కోరుకున్న ఓటర్ల మద్దతుతో టీవీకే ఘనవిజయం సాధించినప్పటికీ, గ్రామ స్థాయిలో క్రియాశీలక నాయకత్వం, బూత్ స్థాయి నెట్‌వర్క్ ఇంకా పూర్తిస్థాయిలో రూపుదిద్దుకోలేదు.

అసెంబ్లీ , పార్లమెంట్ ఎన్నికల్లో కేవలం అధినేత ఇమేజ్, రాష్ట్రస్థాయి అంశాలు సరిపోతాయి కానీ, స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తిగా క్షేత్రస్థాయి వ్యక్తిగత పరిచయాలు, బలమైన కార్యకర్తల జాలంపైనే ఆధారపడి ఉంటాయి. ఈ సమయంలో స్థానిక పోరుకు వెళ్తే గ్రామీణ స్థాయిలో ఉన్న క్యాడర్ లోపం బయటపడే అవకాశం ఉంది. మరోవైపు, పరాజయం పాలైనప్పటికీ ఇప్పటికీ సుదీర్ఘ రాజకీయ అనుభవం, గ్రామీణ స్థాయిలో బలమైన స్థానిక బూత్ కమిటీలు కలిగిన ప్రధాన ప్రతిపక్షం డీఎంకే ఈ పరిస్థితిని అనుకూలంగా మార్చుకోవాలని చూస్తోంది. ఇప్పటికిప్పుడు స్థానిక ఎన్నికలు జరిగితే, తమకున్న కేడర్ బలంతో డీఎంకే క్షేత్రస్థాయిలో మెజారిటీ స్థానాలను కైవసం చేసుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఒకవేళ ప్రతిపక్ష డీఎంకే గనుక స్థానిక పోరులో పైచేయి సాధిస్తే, టీవీకే గెలుపు కేవలం తాత్కాలిక వేవ్ లేదా హైప్ మాత్రమే.. క్షేత్రస్థాయిలో వాళ్లకు ఎలాంటి పునాది లేదు అని విస్తృతంగా ప్రచారం చేసి విజయ్ ప్రభుత్వ ఇమేజ్‌ను మొదటికే మోసం చేసేలా కౌంటర్ ఇచ్చే ప్రమాదం ఉందని అధికార పక్షం భావిస్తోంది.

మెట్రోపై అప్‌డేట్

హైదరాబాద్ : హైదరాబాద్ మెట్రో రైలు రెండోదశ ప్రాజెక్టు కేంద్ర కేబినెట్ అనుమతుల కోసం సిద్ధమవుతుండగా.. రెండు నెలల్లోగా తొలిదశ స్వాధీన ప్రక్రియ పూర్తి చేయాలని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎఫ్ఈఅ రుణం నిలిచిపోవడంతో, ఎస్‌బీఐ, ఐసీఐ వంటి ప్రత్యామ్నాయ బ్యాంకింగ్ సంస్థల ద్వారా రూ.13,527 కోట్ల రుణ సమీకరణకు హెచ్ఎంఆర్ కసరత్తు చేపట్టింది. నిర్ణయించిన గడువులోగా ఈ ప్రక్రియను పూర్తి చేయడంపై ప్రస్తుతం ఉత్కంఠ నెలకొంది. కాగా, కొత్తగా రాష్ట్ర ప్రభుత్వ పలు మార్గాల్లో మెట్రోను ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. హైదరాబాద్ మెట్రో రైలు రెండోదశ అనుమతుల ప్రక్రియ వేగవంతమైంది. రానున్న రెండు నెలల్లో ఈ అంశాన్ని కేంద్ర క్యాబినెట్ ముందుకు తీసుకురానున్నట్లు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి స్పష్టం చేసింది. అయితే, అప్పటిలోగా మెట్రో తొలిదశ స్వాధీన ప్రక్రియను పూర్తి చేయాలని తేల్చిచెప్పింది. ఢిల్లీలో గత వారం కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హైదరాబాద్ మెట్రోరైలు లిమిటెడ్ ఎండీ సమావేశమయ్యారు. తొలిదశ స్వాధీనంలో జాప్యం, రెండోదశ అనుమతుల్లో ఆలస్యం వల్ల ఎదురవుతున్న ట్రాఫిక్ ఇబ్బందులను రాష్ట్ర అధికారులు ఈ భేటీలో వివరించారు. తొలిదశతో రెండోదశను ముడిపెట్టవద్దని కోరినప్పటికీ, రెండు దశల అనుసంధానానికి స్పష్టమైన ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు లిఖితపూర్వకంగా తెలిపారు. తొలిదశ స్వాధీన ప్రక్రియ మే నెలాఖరు నాటికే ముగియాల్సి ఉన్నప్పటికీ, ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అందవలసిన రూ.13,527 కోట్ల రుణ మంజూరు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో జాప్యం జరుగుతోందని అధికారులు తెలిపారు. కేంద్రం నుంచి ఎన్వోసీ రాకపోవడంతో ఈ నిధులు విడుదల కాలేదన్నారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి గతంలో ఢిల్లీ పర్యటనలు, కేంద్ర మంత్రులతో చర్చల అనంతరం తొలిదశ విలువ నిర్ధారణకు, నూతన రుణాల సేకరణకు ఎస్‌బీఐ క్యాప్స్‌ను కన్సల్టెంట్‌గా నియమించాలని నిర్ణయించారు. అయితే, ఆ తర్వాత నెలన్నర రోజులుగా ఎలాంటి పురోగతి లేకపోవడంతో అధికారులు కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు. రెండు నెలల్లోగా ఈ ప్రక్రియ పూర్తి కావాలంటే నూతన రుణ సమీకరణ కీలకం కానుంది. ఎఫ్ఈఅ తప్పుకున్నట్లు కేంద్రం సంకేతాలు ఇవ్వడంతో జైకా తరహాలోనే 3.5 శాతం వడ్డీ రేటుకు కొత్తగా ప్రముఖ బ్యాంకింగ్ సంస్థల ద్వారా రుణం సమకూర్చుకునే మార్గాలపై హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ కసరత్తు ప్రారంభించింది. రుణమిచ్చే సంస్థల ఎంపిక కోసం ప్రత్యేకంగా ఏజెన్సీని నియమించే ఆలోచనలో ఉంది. గతంలో ఒప్పందానికి ఆరు నెలలకు పైగా సమయం పట్టగా.. ఇప్పుడు కేవలం రెండు నెలల్లోనే ఈ ప్రక్రియను పూర్తి చేయడం క్లిష్టతరమని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఇదే అంశంపై హైదరాబాద్‌లో మంగళవారం జరగాల్సిన కీలక బోర్డు సమావేశం వివిధ కారణాలతో వాయిదా పడింది. కాగా, ప్రస్తుతం ఎల్బీనగర్– మియాపూర్, నాగోల్– రాయదుర్గం, ఎంజీబీఎస్– పరేడ్ గ్రౌండ్స్ మధ్య మూడు మార్గాల్లో మెట్రో పరుగులు పెడుతుండగా.. కొత్తగా ఎంజీబీఎస్– చంద్రాయన్ గుట్ట, శంషాబాద్, ఎల్బీనగర్– హయత్ నగర్, సికింద్రాబాద్–మేడ్చల్ వరకు మెట్రో ప్రతిపాదనలు ఉన్నాయి.

తొట్టెల బుట్టలకు ఫుల్ డిమాండ్

హైదరాబాద్ : బోనాల ఉత్సవాలు తెలంగాణ రాష్ట్రంలో అత్యంత ప్రసిద్ధమైన పండుగలలో ఒకటి. ఈ పండుగలో అమ్మవారికి బోనం సమర్పించడం ఎంతో ముఖ్యమైన ఘట్టం. అయితే, ఈ ఉత్సవాల్లో తొట్టెల సమర్పణ కూడా ప్రత్యేకమైన ప్రాధాన్యతను కలిగి ఉంది. భక్తులు తమ మొక్కులు నెరవేరాలని, కుటుంబ సుఖశాంతులు, ఆయురారోగ్యం కోసం అమ్మవారికి తొట్టెలను సమర్పిస్తారు. ఈ సందర్భంగా, భక్తుల అభిరుచి మరియు మొక్కుల ప్రకారం, తొట్టెల పరిమాణం మారుతుంది. కొందరు చిన్న తొట్టెలను సమర్పిస్తుంటే, మరికొందరు భారీ, ప్రత్యేకంగా తయారు చేసిన తొట్టెలను సమర్పించడం బోనాల ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. ఈ తొట్టెల తయారీకి సంబంధించిన కళ, కార్వాన్, పురానాపూల్ ప్రాంతాల్లోని కొన్ని కుటుంబాలకు ప్రధాన జీవనాధారంగా మారింది. తాత ముత్తాతల కాలం నుంచి వస్తున్న ఈ సంప్రదాయ వృత్తిని నమ్ముకుని నేటికీ అనేక కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఈ తొట్టెలను వెదురు, రంగురంగుల కాగితాలు, అలంకరణ సామగ్రితో చేతిపనిగా రూపొందించడం జరుగుతుంది. ప్రతి ఏడాది, భక్తుల నుంచి ఈ తొట్టెలకు భారీ డిమాండ్ ఉంటుంది. ఈ డిమాండ్ కారణంగా, తొట్టెల ధరలు కూడా విభిన్నంగా ఉంటాయి. సాధారణ తొట్టెల ధరలు రూ.500 నుంచి ప్రారంభమవుతుండగా, భారీ బహుళ అంతస్తుల తొట్టెల ధరలు రూ.2 లక్షల వరకు చేరుకుంటున్నాయి. ఈ ధరలు, తయారీకి ఉపయోగించే సామగ్రి, అలంకరణ మరియు పరిమాణం ఆధారంగా మారుతుంటాయి. బోనాల ఉత్సవాల్లో తొట్టెల తయారీకి సంబంధించిన ఈ కళ, కేవలం ఆర్థిక వనరులే కాకుండా, సాంస్కృతిక వారసత్వాన్ని కూడా ప్రతిబింబిస్తుంది. ఈ సంప్రదాయాన్ని కొనసాగించడానికి, యువతను ప్రోత్సహించడం, ఈ కళను నేర్పించడం అత్యంత అవసరం. ఈ విధంగా, భవిష్యత్తులో కూడా ఈ కళను కొనసాగించడానికి వీలు కల్పించవచ్చు. బోనాల ఉత్సవాలు, తెలంగాణ సంస్కృతిలో ఒక ప్రత్యేక స్థానం కలిగి ఉన్నాయని, ఈ ఉత్సవాల్లో తొట్టెల తయారీకి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా, మన సంప్రదాయాలను మరింత బలపరిచే అవకాశం ఉంది. ఈ ఉత్సవాల్లో, తొట్టెల తయారీకి సంబంధించిన కుటుంబాలు, తమ కళను ప్రదర్శించడానికి, తమ ఉత్పత్తులను విక్రయించడానికి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తాయి. ఈ సమయంలో, భక్తులు తమ ఇష్టానికి అనుగుణంగా తొట్టెలను ఎంచుకుంటారు. ఈ విధంగా, బోనాల ఉత్సవాలు, కేవలం ఆధ్యాత్మిక పండుగ మాత్రమే కాకుండా, ఆర్థికంగా కూడా కొన్ని కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్నాయి. ఈ ఉత్సవాలు, తెలంగాణలోని సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తూ, ప్రజల మధ్య అనుబంధాన్ని పెంచుతున్నాయి. ఈ ఉత్సవాల ద్వారా, మన సంప్రదాయాలను, కళలను, మరియు సంస్కృతిని పునరుద్ధరించడానికి, ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

బస్ టికెట్‌తో పాటే ఆటో బుకింగ్

హైదరాబాద్ : తెలంగాణలో ప్రజా రవాణాను మరింత సులభతరం చేసే దిశగా టీజీఎస్‌ఆర్టీసీ మరో విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. బస్సు ప్రయాణికులకు ఇంటి నుంచి బస్ స్టాప్ వరకు, బస్సు దిగాక గమ్యస్థానం వరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణాన్ని కొనసాగించేందుకు 'ఫస్ట్ మైల్ టు లాస్ట్ మైల్' కనెక్టివిటీ విధానాన్ని అమలు చేయనుంది. ఇందులో భాగంగా త్వరలోనే రాష్ట్రంలో ఎలక్ట్రిక్ ఆటోలను ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు ప్రముఖ ఎలక్ట్రిక్ ఆటో తయారీ కంపెనీలతో ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్చలు జరుపుతున్నారు. ఈ చర్చలు కొలిక్కి వచ్చిన వెంటనే ఈ–ఆటోలు రోడ్డెక్కనున్నాయి. ఈ కొత్త విధానంలో ప్రయాణికులు తమ బస్ టికెట్‌ను బుక్ చేసుకునే సమయంలోనే అదనంగా ఆటో రైడ్‌ను కూడా ఒకేసారి బుక్ చేసుకునేలా ప్రత్యేక సౌకర్యం కల్పించనున్నారు. దీని ద్వారా ప్రయాణికులను వారి నివాసం నుంచి సమీప బస్ పాయింట్‌కు, అలాగే బస్సు దిగిన తర్వాత అక్కడి నుంచి వారి చివరి గమ్యస్థానానికి ఈ–ఆటోలు సురక్షితంగా చేరవేస్తాయి. ఫలితంగా ప్రయాణికులకు విలువైన సమయం ఆదా అవడంతో పాటు బస్టాప్‌లకు చేరుకోవడానికి, అక్కడి నుంచి గమ్యస్థానాలకు వెళ్లడానికి పడే ప్రయాసలు తప్పుతాయి. ఈ ఎలక్ట్రిక్ ఆటో సేవలను ప్రయోగాత్మకంగా తొలుత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. ఇక్కడ లభించే స్పందన, ఫలితాల ఆధారంగా రెండో దశలో వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ వంటి రాష్ట్రంలోని ఇతర ప్రధాన నగరాలకు దశలవారీగా విస్తరించాలని యోచిస్తున్నారు. ముఖ్యంగా ప్రస్తుతం నగరంలో అధిక ఛార్జీలతో నడుస్తున్న ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి ప్రైవేట్ రైడ్ హెయిలింగ్ యాప్‌ల కన్నా గణనీయంగా తక్కువ ఛార్జీలతో ఈ సేవలను అందించేందుకు ఆర్టీసీ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ నిర్ణయం వల్ల హైదరాబాద్ శివారు ప్రాంతాలైన ఎల్బీనగర్, ఉప్పల్, మియాపూర్, పటాన్‌చెరు, శంషాబాద్, ఘట్‌కేసర్ వంటి కనెక్టివిటీ సమస్యలున్న ప్రాంతాల ప్రజలకు గొప్ప ఊరట లభించనుంది.

సిటీలో మరో 2 ఫ్లైఓవర్లు

హైదరాబాద్ : హైదరాబాద్ నగరవాసులకు ట్రాఫిక్ ఇబ్బందుల నుంచి విముక్తి కల్పించేందుకు జీహెచ్ఎంసీ కీలక ప్రాజెక్టులను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ముసారాంబాగ్ బ్రిడ్జి, సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి నిర్మాణాలు తుది దశకు చేరుకోగా.. వచ్చే నెలలోనే ఇవి ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. వీటితో పాటు నెక్లెస్ రోడ్– బేగంపేట్ ఆర్వోబీ, రసూల్‌పురా ఫ్లైఓవర్ వంటి కొత్త ప్రాజెక్టులకు కూడా రంగం సిద్ధమైంది. రూ.600 కోట్లకు పైగా అంచనా వ్యయంతో రూపుదిద్దుకుంటున్న ఈ కీలక ప్రాజెక్టులు పూర్తయితే నగరంలో రద్దీ ప్రాంతాల ప్రయాణం మరింత సులభం కానుంది. హైదరాబాద్ నగరంలో నగరంలోని వాహనదారులకు తీపి కబురు. ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టిన కీలక ప్రాజెక్టులు తుది దశకు చేరుకున్నాయి. ఇప్పటికే నగరంలోని చాలా ప్రాంతాల్లో అండర్‌పాసులు, ఫ్లైఓవర్లు, కొత్త స్కైవాక్‌లు అందుబాటులోకి రాగా.. రద్దీ ప్రాంతాల్లో రాకపోకలను సులువు చేసేలా నిర్మిస్తున్న రెండు ప్రధాన ప్రాజెక్టులు వచ్చే నెలలోనే అందుబాటులోకి రానున్నాయి. మరో రెండు కొత్త ప్రాజెక్టులు సైతం త్వరలోనే పట్టాలెక్కనున్నాయి. ఇప్పటికే మూసారాంబాగ్ బ్రిడ్జి, సైదాబాద్ నుంచి సంతోష్‌నగర్ వైపు నిర్మించిన స్టీల్ బ్రిడ్జి పనులు చివరి దశకు చేరుకోగా, జీహెచ్ఎంసీ వీటిని ఆగస్టులోనే ప్రారంభించేందుకు వేగంగా కసరత్తు చేస్తోంది. కేవలం రూ.52 కోట్ల వ్యయంతో 6 లేన్లతో 220 మీటర్ల పొడవు, 20 మీటర్ల వెడల్పుతో అత్యాధునిక హంగులతో నిర్మిస్తున్న ముసారాంబాగ్ బ్రిడ్జి అందుబాటులోకి వస్తే.. అంబర్‌పేట్– మలక్‌పేట్ ప్రాంతాల మధ్య రాకపోకలు సాగించే ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తొలగిపోనున్నాయి. అలాగే, చంచల్‌గూడ ప్రింటింగ్ ప్రెస్ నుంచి సంతోష్‌నగర్ వరకు రూ.620 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న భారీ స్టీల్ బ్రిడ్జి కోసం పాతబస్తీ ప్రజలు ఆరేండ్లుగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఈ బ్రిడ్జికి సంబంధించి ర్యాంపులు, సైడ్ వాల్స్, విద్యుద్దీకరణ వంటి ఫినిషింగ్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. 3.32 కిలోమీటర్ల పొడవు, 85 పిల్లర్లతో రూపుదిద్దుకున్న ఈ స్టీల్ బ్రిడ్జి పూర్తయితే.. సైదాబాద్, సంతోష్‌నగర్, చంచల్‌గూడ, ఐఎస్ సదన్, చంపాపేట్ ప్రాంతాల ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు పూర్తిగా

తీరనున్నాయి. నగరంలో వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని జీహెచ్ఎంసీ కొత్తగా మరో రెండు ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. రూ.152 కోట్ల వ్యయంతో నెక్లెస్ రోడ్ సంజీవయ్య పార్కు నుంచి బేగంపేట్ వరకు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ప్రతిపాదించ గా.. దీనికి జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఇప్పటికే ఆమోదం తెలిపింది. ఈ ఆర్వోబీ అందుబాటులోకి వస్తే ట్యాంక్ బండ్ మీదుగా బేగంపేట్ వైపు వెళ్లేవారి ప్రయాణం మరింత సులభం కానుంది. అంతేకాకుండా రసూల్‌పురాలో రూ.48.14 కోట్ల అంచనా వ్యయంతో నాలుగు లేన్ల బయో డైవర్షనల్ ఫ్లైఓవర్‌ను నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్ ప్రక్రియ కూడా ఇప్పటికే పూర్తయిందని, త్వరలోనే క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభం కానున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే నిర్మించిన ముసారాంబాగ్ ఫ్లైఓవర్‌తో పాటు సైదాబాద్ స్టీల్ బ్రిడ్జిలతో పాటు కొత్త ఫ్లైఓవర్, ఆర్వోబీలు అందుటాటులోకి వస్తే వాహనదారుల ట్రాఫిక్ చిక్కులు తీరిపోనున్నాయి.

తెరపైకి ఎండ్రిన్ పార్టీ

హైదరాబాద్ : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమ స్ఫూర్తి తెలంగాణ నిరుద్యోగ యువతను తట్టిలేపుతోంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి, రాజకీయ హామీల ఉల్లంఘనకు నిరసనగా తెలంగాణ నిరుద్యోగ జేఏసీ, పోలీస్ జేఏసీ నేతలు ఏకమై 'తెలంగాణ ఎండ్రిన్ పార్టీ' పేరుతో కొత్త రాజకీయ వేదికను ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ సమస్యల సమగ్ర పరిష్కారమే అజెండాగా రూపుదిద్దుకున్న ఈ నిర్ణయం, ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ఈ సంచలనాత్మక నిర్ణయానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వివాదాస్పద వ్యాఖ్యలే ప్రధాన కారణమని నిరుద్యోగ నాయకులు స్పష్టం చేశారు. "మీరు ఒర్లినా, పొర్లుదండాలు పెట్టినా.. ఎండ్రిన్ తాగి బావిలో దూకినా పోలీస్ ఉద్యోగాలు పెంచడం సాధ్యం కాదు" అంటూ సీఎం చేసిన కామెంట్స్ నిరుద్యోగుల్లో తీవ్ర ఆగ్రహాన్ని రగిల్చాయి. దశాబ్దాలుగా ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్న యువత ఆవేదనను ఎద్దేవా చేసేలా ఉన్న ఈ వ్యాఖ్యలకు నిరసనగానే, ఆ పదాలనే ప్రత్యర్థులపై వ్యంగ్యాస్త్రంగా మలచి 'తెలంగాణ ఎండ్రిన్ పార్టీ'కి పురుడుపోశారు. ప్రజాస్వామ్యయుతంగా తమ గొంతును చట్టసభలు, రాజకీయ వేదికలపై వినిపించడమే ఈ నూతన వేదిక లక్ష్యమని ప్రతినిధులు వెల్లడించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందు పలు డిమాండ్లను కూడా పెట్టారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2 లక్షల ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏటా పారదర్శకంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి, నిర్దేశిత గడువులోగా నియామక ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన యువత కోసం 20 వేల పోలీస్ కానిస్టేబుల్ పోస్టులతో కొత్త నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. వెంటనే మెగా డీఎస్సీ నిర్వహించి టీచర్ పోస్టులను నింపాలన్నారు. గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్ –3, గ్రూప్–4 నియామక ప్రక్రియను ఎలాంటి చట్టపరమైన అడ్డంకులు లేకుండా పారదర్శకంగా వేగవంతం చేయాని డిమాండ్ చేశారు. పార్టీ నమోదు ప్రక్రియను వారం రోజుల్లో కేంద్ర ఎన్నికల కమిషన్ వద్ద పూ ర్తి చేస్తామని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. అనంతరం తెలంగాణ ఉద్యమాల పురిటిగడ్డ అయిన ఉమ్మడి నల్గొండ జిల్లా సూర్యాపేటలో భారీ ఆవిర్భావ సభను నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. విప్లవ పోరాటాల ప్రతీక మారోజు వీరన్న స్థూపం వద్ద తెలంగాణ ఎండ్రిన్ పార్టీ అధికారిక లోగోను ఆవిష్కరించి తొలి బహిరంగ సభ ద్వారా తమ బలాన్ని చాటుకోనున్నారు. ఇక్కడ ప్రధానంగా ప్రస్తావించాల్సిన రాజకీయం మరొకటి ఉంది. జాతీయ స్థాయిలో వెలిసిన కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమానికి కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ రెడ్డి బహిరంగంగా పూర్తి మద్దతు పలికారు. యువత భాగస్వామ్యాన్ని పెంచేందుకు 21 ఏళ్లకే చట్టసభల్లోకి అడుగుపెట్టేలా వయోపరిమితిని సడలించాలని కాంగ్రెస్ గళమెత్తి సర్వత్రా ప్రశంసలు అందుకుంది. కానీ, సొంత రాష్ట్రంలో గత 50 రోజులుగా నిరుద్యోగులు రోడ్డెక్కి పోరాడుతున్నా, వారి సమస్యలను పట్టించుకోకపోవడంపై జేఏసీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ స్థాయిలో ప్రజాస్వామ్య హక్కులు మాట్లాడే కాంగ్రెస్, స్థానికంగా నిరుద్యోగుల ఆవేదనను తృణీకరించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శిస్తున్నారుకాక్రోచ్ జనతా పార్టీ బాటలోనే 'తెలంగాణ ఎండ్రిన్ పార్టీ' ఆవిర్భవించడం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఊహించని పెద్ద రాజకీయ తలనొప్పిగా మారింది.

కేటీఆర్ హస్తిన పర్యటనల వెనుక..

హైదరాబాద్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వరసగా ఢిల్లీ పర్యటనలు చేస్తున్నారు. కేంద్ర మంత్రులను కలుస్తున్నారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చిస్తున్నారు. విపక్షంలో ఉన్న బీఆర్ఎస్ నేతలు ఇటీవల హస్తిన బాట పట్టడం ఒకింత రాజకీయంగా చర్చకు దారి తీస్తుంది. అధికార పక్షంలో ఉన్న వారు సహజంగా హస్తినకు వెళ్లి కేంద్ర మంత్రులను కలసి రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులు, నిధుల గురించి చర్చించడం ఎక్కడైనా జరుగుతుంది. కానీ తెలంగాణలో మాత్రం కేటీఆర్ ఇటీవల కాలంలో వరసగా ఢిల్లీకి వెళుతూ కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర ప్రయోజనాలపై చర్చించడం హాట్ టాపిక్ గా మారింది. ఒక రకంగా రేవంత్ రెడ్డికి కేటీఆర్ ఇదొక రకమైన సవాల్ విసురుతున్నట్లే అనుకోవాల్సి ఉంటుంది... బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఢిల్లీ పర్యటనలు రాజకీయంగా ఆసక్తిని రేపుతున్నాయి. కొన్నిరోజుల క్రితం కేటీఆర్ ఢిల్లీకి వెళ్లి ఆదిలాబాద్ లో సీసీఐ ఏర్పాటుకు ప్రయత్నించారు. ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కర్మాగారాన్ని పునరుద్ధరించాలని కోరుతూ బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఢిల్లీకి వెళ్లారు. కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈనెల 1వతేదీన కేటీఆర్ నేతృత్వంలోని బృందం ఢిల్లీలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసింది. రెండు వేల కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఆధునిక ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరడం కూడా చర్చనీయాంశంగా మారింది. తాజాగా మరోసారి ఢిల్లీకి వెళ్లి రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ను కేటీఆర్ కలిశారు. రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులు, ఐటీ విస్తరణ మరియు జాతీయ రాజకీయ వ్యూహాలపై కేంద్ర మంత్రులతో చర్చలు జరిపినట్లు వార్తలు వచ్చాయి. ఆర్ ఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి సిరిసిల్ల రైల్వే ప్రాజెక్టుతో పాటు తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న పలు రైల్వే పనులపై చర్చించారు. రాష్ట్రంలో కొత్త ఐటీ సంస్థల ఏర్పాటు, యువతకు ఉపాధి అవకాశాల కల్పన గురించి కేంద్ర పెద్దలతో మాట్లాడారు.

విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడితే కఠిన శిక్ష

విజయవాడ : ప్రభుత్వ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలు, మాల్‌ప్రాక్టీస్‌కు అడ్డుకట్ట వేసే లక్ష్యంతో తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు-2026 లోక్‌సభలో ఆమోదం పొందడంపై ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ చట్టం విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే వారికి గట్టి హెచ్చరికగా నిలుస్తుందని చెప్పారు. పరీక్షల విశ్వసనీయతను కాపాడే దిశగా ఇది కీలక అడుగని అభిప్రాయపడ్డారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన లోకేశ్.. ప్రశ్నపత్రాల లీకేజీలు, పరీక్షల మోసాలకు పాల్పడే వారిపై ఇక కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. చట్టపరమైన చర్యలతో పాటు పరీక్షల వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టిందని తెలిపారు. యువత భవిష్యత్తు రాజకీయాలకు అతీతమని, ప్రతిభ, పారదర్శకత, సమాన అవకాశాలే ఎప్పుడూ గెలవాలని ఆకాంక్షించారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ ఘటన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం వేగంగా స్పందించిందని లోకేశ్ అన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు పరీక్షను తిరిగి సమయానికి నిర్వహించి, లక్షలాది మంది విద్యార్థుల విద్యా సంవత్సరం వృథా కాకుండా కాపాడిందని గుర్తుచేశారు. విద్యార్థుల భవిష్యత్తును రక్షించడంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించిందని పేర్కొన్నారు. ఇదే అంశంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా స్పందించారు. ఈ బిల్లు లక్షలాది మంది విద్యార్థుల ఆశయాలను కాపాడే కీలక చట్టమని చెప్పారు. పరీక్షల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే నిర్ణయమిదని అభిప్రాయపడ్డారు.

కూరగాయల సాగుతో రైతులకు అధిక లాభాలు

జయశంకర్ భూపాలపల్లి : సాంప్రదాయ పంటలతో పోలిస్తే కూరగాయలు మరియు అంతర పంటల సాగు రైతులకు ఎంతో లాభదాయకమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. బసవరాజుపల్లి గ్రామంలోజిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పర్యటించి ఎల్ నినో ప్రభావంతో రైతులు వరికి బదులుగా నీరు తక్కువ వినియోగంతో పండే పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యాదగిరి, మార్త రమేష్, బోర రాజయ్య క్షేత్రాల్లో చేపట్టిన కూరగాయలు, అంతర పంటల సాగును ప్రత్యక్షంగా పరిశీలించారు. ?ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ కూరగాయలు దిగుబడి, యాజమాన్య పద్ధతులు, మార్కెటింగ్ అవకాశాల గురించి రైతులతో నేరుగా మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తక్కువ పెట్టుబడితో, తక్కువ సమయంలో మంచి ఆదాయం పొందేందుకు అంతర పంటల సాగు లాభదాయకమని తెలిపారు. కూరగాయలు సాగు వల్ల కూలీల సమస్య తగ్గుతుందని, మల్చింగ్ వల్ల అధిక దిగుబడులు వస్తాయని రైతులు తెలిపారు. నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటూ కూరగాయల సాగు వైపు రైతులు మొగ్గు చూపాలని ?ఒకే పంటపై ఆధారపడకుండా అంతర పంటలు వేయడం వల్ల చీడపీడల ఉధృతి తగ్గి, ఆదాయం. లభిస్తుందని తెలిపారు. ?జిల్లాలోని ఇతర రైతులు కూడా వీరిని ఆదర్శంగా తీసుకుని ఆధునిక సాగు పద్ధతులను చేపట్టాలని సూచించారు. వ్యవసాయం, ఉద్యానవన శాఖల అధికారులు రైతులకు కూరగాయలు, పప్పు దినుసులు సాగు చేపట్టేలా అవసరమైన సాంకేతిక సలహాలు, ప్రభుత్వ పథకాల ద్వారా అందే ప్రోత్సాహకాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.

భారీ వర్షాల పై జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జయశంకర్ భూపాలపల్లి : వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు రానున్న రెండు రోజులు జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు ఇంటి నుండి బయటకు రావొద్దని, అత్యవసర అవసరాల కోసం వస్తే తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలలో నివసించే ప్రజలు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని, ఉధృతంగా ప్రవహించే వాగులు, వంకలు, చెరువులు, కల్వర్టుల వద్దకు ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లకూడదని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు కలెక్టరేట్‌లో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మహిళల స్వీరరక్షణకు మార్షల్ ఆర్ట్స్

హైదరాబాద్ :మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవటం వల్ల మహిళల స్వీయ రక్షణకు తోడ్పాటు ఉంటుందని ప్రముఖ సినీ నటుడు సుమన్ తల్వార్ అన్నారు. కూకట్‌పల్లి వివేకానంద నగర్ లోని టైకా మార్షియల్ ఆర్ట్స్ అకాడమిలో సెప్టెంబర్ 5వ ,6వ తేదీలో గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న టైకా ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ 2026 కి సంబంధించి బ్రోచర్ తో పాటు కప్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టైకా మార్షల్ ఆర్ట్స్ అకాడమి ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ పి అశోక్ చక్రవర్తి మాట్లాడుతూ ... ఈ ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ పోటీలో దేశం నుండి 10 రాష్ట్రాలకు చెందిన వారు పాల్గొంటున్నారని అన్నారు. ఆగస్టు 20వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 5,6 వ తేదీన నిర్వహించబోయే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ ప్రవీణ్ కుమార్, సినీ నటుడు డాక్టర్ సుమన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు మెడల్స్ అందజేస్తారని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అశోక్ చక్రవర్తి వెల్లడించారు.

కోడుమూరును అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెడతా

సి. బెళగల్ : కోడుమూరును అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెడతానని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రెండేళ్ల నమ్మకం,సంక్షేమ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా, నాలుగవ రోజు డోర్ టు డోర్ కార్యక్రమాన్ని, మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో జరిగిన కార్యక్రమానికి కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, ఎన్నికల పరిశీలకులు వి.వెంకట్,ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కొండపురం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, సచివాల సిబ్బంది, ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో గల ప్రతి ఇంటికి వెళ్లి రెండు సంవత్సరాలలో కూటమి ప్రభుత్వం చేసిన, అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పథకాలకు ప్రజలు ఆకర్షితులయ్యారని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ చంద్రశేఖర్, సింగిల్ విండో చైర్మన్ బోయ చిన్న తిమ్మప్ప, తెలుగు యువత అధ్యక్షులు కొత్తకోట హరికృష్ణ, గ్రామ నాయకులు,శంకర్ బాబు రెడ్డి, రఘునాథ్ రెడ్డి, తదితర తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అభిమానులు కార్యకర్తలు పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు.

ప్రజలకు నిష్పాక్షికంగా సేవలు అందించాలి

జయశంకర్ భూపాలపల్లి :జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, వార్షిక తనిఖీల్లో భాగంగా మహాదేవ్పూర్ పోలీస్ స్టేషన్ను సందర్శించి సమగ్ర తనిఖీ నిర్వహించారు. జిల్లాలో పోలీస్ వ్యవస్థ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలు, కేసుల దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ స్టేషన్ ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలను నాటారు., అనంతరం పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. రోడ్డు ప్రమాద కేసులకు సంబంధించిన వాహనాల స్థితిగతులు, వాటి పరిష్కార పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రిసెప్షన్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, అందిన ప్రతి ఫిర్యాదును వెంటనే ఆన్లైన్లో నమోదు చేసి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లో నమోదైన కేసుల పురోగతిని సమీక్షించిన ఎస్పీ గారు, దర్యాప్తు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేస్తూ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధి నిర్వహణ, కేసు రికార్డుల నవీకరణ విధానాన్ని పరిశీలించి, అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తూ నిర్వహించాలని ఆదేశించారు. రౌడీ షీటర్లపై తీసుకుంటున్న చర్యలను సమీక్షించి, వారిపై నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. పోలీస్ స్టేషన్కు వచ్చే ప్రతి పౌరుడికి స్నేహపూర్వక వాతావరణం కల్పిస్తూ, వారి సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించే విధంగా సేవలు అందించాలని అధికారులు,

మూగబోయిన ఫైర్ బ్రాండ్స్

విజయవాడ : 2024 ఎన్నికల ఓటమి అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో రాజకీయం ఊహించని మలుపు తిరిగింది. గతంలో ప్రత్యర్థిపార్టీల నేతలపై నిమిషానికో రీతిలో విరుచుకుపడే ఫైర్ బ్రాండ్ నాయకులు ఆర్.కే. రోజా, కొడాలి నాని, జోగి రమేష్, వల్లభనేని వంశీ వంటి కీలక నేతలు రాజకీయంగా పూర్తిగా మౌనం వహించారు. ఎన్నికలు ముగిసి రెండేళ్లు దాటిపోయినా వీరు పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాల్గొనకపోవడం, మీడియా ముందుకు రాకపోవడం కేడర్‌లో తీవ్ర నిరాశను నింపుతోంది. ప్రస్తుతం కేవలం పేర్ని నాని, అంబటి రాంబాబు వంటి కొద్దిమంది నాయకులు మాత్రమే మైకుల ముందుకు వచ్చి ప్రత్యర్థులపై ఎదురుదాడి చేస్తున్నారు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నమోదైన వరుస కేసులు, చట్టపరమైన చర్యల భయంతో స్లో అయ్యారు. జోగి రమేష్ పై సిఐడి కేసులు, అగ్రిగోల్డ్ భూ వివాదం, తాజాగా కుటుబం కేసులు కూడా వచ్చి పడ్డాయి. అలాగే వల్లభనేని వంశీ చాలా రోజులు జైల్లో ఉండి వచ్చారు. కొడాలి నాని అనారోగ్యం, రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అసలు గుడివాడలోనే కనిపించడం లేదు. ఐదేళ్ల పాలనలో వ్యక్తిగత దూషణలతో తీవ్ర స్థాయి విమర్శలు చేసిన ఈ నేతలు, ఇప్పుడు అధికార పక్షం కఠినంగా వ్యవహరిస్తుండటంతో చట్టపరమైన చిక్కుల నుంచి తప్పించుకు నేందుకు తాత్కాలికంగా రక్షణాత్మక వైఖరి లోకి వెళ్లిపోయారనేది స్పష్టమవుతోంది. మరోవైపు, ప్రతిపక్షంలో ఉన్న ఈ సమయంలో తీవ్రంగా విరుచుకుపడే నాయకులు మీడియా ముందు రాకపోతే పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం రాదనేది పక్కా వాస్తవం. జగన్ మోహన్ రెడ్డి సైతం క్షేత్రస్థాయికి వచ్చి నిరసనలకు పిలుపునిస్తున్నా, దూకుడైన నేతల నాయకత్వం లేకపోవడం వల్ల ఆందోళనలు ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోతున్నాయి. పేర్ని నాని, అంబటి రాంబాబులు ఒంటరి పోరాటం చేస్తున్నప్పటికీ, రాయలసీమ నుంచి రోజా, కృష్ణా జిల్లా నుంచి కొడాలి నాని, వంశీ, జోగి రమేష్ వంటి వారు జతకలిస్తేనే పార్టీ కేడర్‌లో పూర్వ వైభవం, మైలేజ్ లభిస్తాయని వైఎస్సార్సీపీ శ్రేణులు భావిస్తున్నాయి. అయితే, వీళ్లను జగన్ ఎప్పుడు యాక్టివ్ చేస్తారు? లేదా వారే స్వయంగా బయటకు వస్తారా? అనే ప్రశ్నలకు పార్టీ వ్యూహకర్తల నుంచి భిన్నమైన సమాధానాలు వస్తున్నాయి. ఎన్నికలకు ముందు అధికారంలో ఉన్నప్పుడు చేసిన విమర్శల వల్లే తీవ్ర వ్యతిరేకత వచ్చిందని భావిస్తున్న జగన్, ప్రస్తుతానికి కొత్త డెసిషన్ తీసుకునే ముందు కొంత సమయం ఇవ్వాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా, ప్రభుత్వం విధించే చట్టపరమైన సవాళ్లు , కేసుల తీవ్రత కొంత తగ్గిన తర్వాతే లేదా స్థానిక సంస్థల ఎన్నికల సమయానికి వీరిని మళ్లీ ముందువరుసలోకి తెచ్చేలా వ్యూహం రచిస్తున్నారని సమాచారం. అందుకే వారు వారి వారి నియోజకవర్గాల్లో పెద్దగా పార్టీ వ్యవహారాలను పట్టించుకోకపోయినా.. లైట్ తీసుకుంటున్నారని అంటున్నారు. వైఎస్సార్సీపీ తిరిగి పుంజుకోవాలంటే కేవలం జగన్ ఓరల్ ప్రసంగాలు సరిపోవు. క్షేత్రస్థాయిలో కౌంటర్ ఇవ్వగలిగే బలమైన గొంతులు మళ్లీ ప్రజా క్షేత్రంలోకి రావడం అత్యంత అవసరం. ఈ నేతలు తమ వ్యక్తిగత, న్యాయపరమైన సవాళ్లను దాటుకుని ధైర్యంగా ముందుకు వస్తే తప్ప వైఎస్సార్సీపీ కేడర్‌లో కోల్పోయిన ఆత్మవిశ్వాసం తిరిగొచ్చే అవకాశం లేదు. మరి దానికి జగన్ ఏం చేయబోతున్నారో ?

హద్దు మీరుతున్న మందుబాబుల వీరంగం

ప్రభుత్వ పాఠశాలలో ధ్వంసం - తాళాలు పగులగొట్టి ఫ్యాన్లు, సామగ్రి ధ్వంసం

సి.బెళగల్ : మండల పరిధిలోని కొండాపురం గ్రామ మండల ప్రజా పరిషత్ పాఠశాలలో గుర్తుతెలియని ఆకతాయిలు సృష్టించిన విధ్వంసం గ్రామంలో తీవ్ర కలకలం రేపింది. కొందరు మందుబాబులు పాఠశాల ఆవరణలోకి అక్రమంగా ప్రవేశించి తరగతి గదుల తాళాలు పగులగొట్టి లోపల ఉన్న సామగ్రితో పాటు సీలింగ్ ఫ్యాన్లను ధ్వంసం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. శుక్రవారం ఉదయం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు తరగతి గదుల పరిస్థితిని చూసిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశారు. ఈ ఘటనతో విద్యార్థుల చదువులకు అంతరాయం ఏర్పడటంతో పాటు పాఠశాల ఆస్తులకు గణనీయమైన నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. స్థానికుల కథనం ప్రకారం, రాత్రి వేళల్లో కొందరు మందుబాబులు తరచూ పాఠశాల ప్రాంగణంలో సంచరిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, పలుమార్లు హెచ్చరించినా పరిస్థితిలో మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులపై దాడులు జరుగుతున్నప్పటికీ సంబంధిత శాఖలు తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఈ ఘటనపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండల విద్యాశాఖ అధికారి ఆదం భాషకు సమాచారం అందించినట్లు తెలిపారు. పాఠశాల భద్రతను బలోపేతం చేయడంతో పాటు ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామస్థుల ఆరోపణల ప్రకారం, ప్రభుత్వ పాఠశాలకు కేవలం పది అడుగుల దూరంలో బెల్ట్ షాపు నిర్వహిస్తుండటమే ఇలాంటి ఘటనలకు ప్రధాన కారణమని పేర్కొంటున్నారు. అక్కడ మద్యం సేవించే వ్యక్తులు రాత్రివేళల్లో పాఠశాల పరిసరాల్లోనే తిరుగుతూ విద్యాసంస్థ ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల సమీపంలో బెల్ట్ షాపు కొనసాగడం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని చెప్పారు. పాఠశాలలో భద్రపరిచిన విద్యార్థుల రికార్డులు, ధ్రువపత్రాలకు సంబంధించిన పత్రాలు ధ్వంసమైతే భవిష్యత్తులో విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీ చేయడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తుల రక్షణతో పాటు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వెంటనే భద్రతా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రేవంత్‌కు గ్రేటర్ కలవరం



హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి అంత సులువు కాదు. అధికారంలో ఉన్నారన్న మాటే కానీ గ్రేటర్ ఎన్నికలపై కొంత ఆందోళన కాంగ్రెస్ పార్టీలో నెలకొంది. అనేక అంశాలు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశముంది. మొన్నటి ఎన్నికల్లోనూ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ పరిధిలో కాంగ్రెస్ కు ఒక్క శాసనసభ నియోజకవర్గంలోనూ గెలవలేదు. తర్వాత జరిగిన రెండు ఉప ఎన్నికల్లో మాత్రం గెలిచి హైదరాబాద్ లో కాంగ్రెస్ కు ప్రాతినిధ్యం లభించినట్లయింది. అయితే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలు మాత్రం అంత సులువు కాదన్నది రాజకీయ విశ్లేషకుల అంచనా. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్ నగర అభివృద్ధి కంటే రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలపై దృష్టి పెట్టిందన్న విమర్శలున్నాయి. బీఆర్ఎస్ హయాంలో వేగంగా హైదరాబాద్ అభివృద్ధి చెందిందని, కానీ కాంగ్రెస్ హయాంలో కొంత హైదరాబాద్ లో అభివృద్ధి వెనకబడి ఉందని అంటున్నారు. రియల్ ఎస్టేట్ కూడా పెద్దగా ముందుకు పోవడం లేదు. అనేక ఇళ్లు కొనుగోలు చేయకుండా మూలన పడి ఉన్నాయి. ఇదే సమయంలో రహదారులు కూడా అస్తవ్యస్తంగా ఉన్నాయి. వర్షం కురిస్తే చాలు మ్యాన్ హోల్స్ లో పడి మృతులు కూడా ఇటీవల కాలంలో ఎక్కువవుతున్నారు. అలాగే మంచినీటి సరఫరా కూడా వేసవిలో సక్రమంగా అందకపోవడంతో నగరవాసులు ఒకింత అసంతృప్తితో ఉన్నారంటున్నారు మరొకవైపు హైడ్రా అంశం కూడా కీలకంగా మారింది. హైడ్రా అధికారులు ఆక్రమణలు కూల్చివేయడంతో అనేక మంది తమ నివాసాలను కోల్పోయారు. హైడ్రా ఏకపక్షంగా వ్యవహరిస్తుందని, అన్యాయంగా కూల్చివేస్తుందని ఆరోపిస్తున్నారు. మరొకవైపు మూసీ రిజర్వాయర్ ప్రక్షాళన పనులు ప్రారంభిస్తామని చెప్పడం, సర్వేలు చేయడం వంటివి కూడా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో ప్రభావం చూపే అవకాశాలున్నాయన్న అంచనాలు వినపడుతున్నాయి. దీంతో పాటు హైదరాబాద్ నగరంలో బీఆర్ఎస్, బీజేపీ బలంగా ఉండటం, కాంగ్రెస్ ఏ మేరకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలలో అత్యధిక స్థానాలను సాధిస్తుందన్న ప్రశ్నలు సొంత పార్టీ నేతల నుంచే వినిపిస్తున్నాయి. బీజేపీ హిందుత్వ నినాదంతో వెళుతుండటం, మజ్లిస్ పార్టీతో కాంగ్రెస్ సన్నిహిత్వంపై ప్రశ్నిస్తుండటం కూడా కాంగ్రెస్ ను కొంత గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలు కలవరానికి గురి చేస్తున్నాయని చెప్పక తప్పదు.

సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ అంశంపై జాతీయ ఎస్సీ కమిషన్ సీరియస్

తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అత్యవసర ఆదేశాలు

15 రోజుల్లో చర్యల నివేదిక సమర్పించాలని ఆదేశించిన జాతీయ ఎస్సీ కమిషన్

రైతుల తరపున ఢిల్లీ వరకు పోరాటం చేసిన షాద్ నగర్ బీజేపీ నేతల చొరవ ఫలితం

రంగారెడ్డి : కొత్తూర్ మండలం సిద్ధాపూర్ గ్రామంలో ప్రతిపాదిత జీహెచ్ఎంసీ ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం ఏర్పాటుపై జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ స్పందించింది. సిద్ధాపూర్ గ్రామానికి చెందిన పట్నం సురేష్ సమర్పించిన ఫిర్యాదును పరిశీలించిన కమిషన్, ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూకు అధికారిక లేఖ పంపింది. ఫిర్యాదులో పేర్కొన్న అంశాల ప్రకారం, ప్రతిపాదిత డంపింగ్ యార్డ్ వల్ల షెడ్యూల్డ్ కులాల కుటుంబాలు, చిన్న రైతుల భూములు, జీవనోపాధి, ఆరోగ్యం, రాజ్యాంగ హక్కులు దెబ్బతినే అవకాశం ఉందని కమిషన్ పేర్కొంది. ఈ అంశం భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 338 పరిధిలోకి వస్తుందని స్పష్టం చేసింది.

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామ్‌చందర్ సంతకంతో జారీ చేసిన లేఖలో, సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి చట్టపరమైన నిబంధనలు పాటిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే విచారణ అనంతరం తీసుకున్న చర్యలు, సంబంధిత ఆధారాలతో కూడిన యాక్షన్ టేకెన్ రిపోర్ట్ (ఏటీఆర్)ను 15 రోజుల్లోగా కమిషన్‌కు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు.

బీజేపీ నేతల చొరవతో ఢిల్లీ వరకు రైతుల పోరాటం

సిద్ధాపూర్ రైతుల సమస్యను జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో బీజేపీ షాద్‌నగర్ సీనియర్ నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందే బాబయ్య కీలక పాత్ర పోషించారు. రైతులకు అండగా నిలిచి, వారిని ఢిల్లీకి తీసుకెళ్లి జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులను కలిసి సమస్యను వివరించేలా సహకరించారు. వారి చొరవ, సమన్వయం ఫలితంగానే కమిషన్ వెంటనే స్పందించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక కోరడం ప్రాధాన్యత సంతరించుకుంది.

మెగా డీఎస్సీ పరీక్షల అవినీతి పై నారా లోకేష్

తక్షణం రాజీనామా చేయాల్సిందే..

పోరుమామిళ్ల(బి. కోడూరు): నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారానికి భాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి దరేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినట్లు నీతి,నిజాయితీ,నిబద్ధత ఉంటే మెగా డీఎస్సీ పరీక్షల నిర్వాహణలో జరిగిన అవినీతి,అక్రమాలకు భాధ్యత వహిస్తూ ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖమంత్రి నారా లోకేష్ రాజీనామాచేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రచార కమిటీ సంయుక్త కార్యదర్శి చాపాటి లక్ష్మీనారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో డీఎస్సీ నియామక ప్రక్రియలో ముఖ్యంగా. నాలుగో తరగతి నుండి పదో తరగతి వరకు. నాలుగు సంవత్సరాలు ఎక్కడైతే చదువుతారో వారి కి. వారి జిల్లాలలో లోకల్ అభ్యర్థులుగా పరిగణలోకి తీసుకుంటారు. కానీ డీఈవో స్థాయి నుంచి. ఎంఈఓ స్థాయి వరకు నివేదిక తీసుకోకపోవడం వలన. చాలామంది డిఈఓ లు అమ్ముడుపోయారని . అందుకే ఇలాంటి తప్పులు ఎన్నో జరిగాయని. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎంపికైన అభ్యర్థులను చాలామంది అభ్యర్థులు 1.నాన్ లోకల్ అభ్యర్థులు దొంగ లోకల్ సర్టిఫికెట్లు సృష్టించారని. 2 పీహెచ్ కోటాలో హెచ్. ఐ. కోటాలో చెవుడు దొంగ సర్టిఫికెట్లు 3. ఈడబ్ల్యూఎస్ దొంగ సర్టిఫికెట్లు. 4 స్పోర్ట్స్ కోట దొంగ సర్టిఫికెట్లు. ఈ నాలుగు అంశాలను ప్రభుత్వం ఎలా మర్చిపోయిందని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. అనేక అక్రమాలు,అవకతవకలు జరిగిన నేపథ్యంలో ఆభ్యర్థుల్లో తీవ్ర ఆందోళన నెలకొందని అయినా దానిని కనీసం పరిగణలోనికి తీసుకోకుండా. నారా లోకేష్ రి ఎంక్వయిరీ చేయిస్తే దొంగలు బయటపడే అవకాశం ఎక్కువగా ఉంటుందని నిజమైన లబ్ధిదారులు న్యాయం జరుగుతుందని కానీ నారా లోకేష్ పట్టీ పట్టనట్టుగా వ్యవహరించడం ఉన్నత విలువలకు కోల్పోయాడని ఆయన శాఖలో ఇంత అవినీతి జరుగుతూ ఉంటే ఏ మాత్రం స్పందించకుండా తాను నిర్వహించిన మెగా డీఎస్సీ తప్పులు కప్పిపుచ్చడం అతి దారుణమైన చర్యని విద్యార్థుల ప్రాణాలతో చలగాటమాడుతున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణం రాజీనామా చేసి తన చిత్తశుద్ధిని, నైతిక విలువలను కాపాడు కోవాలని. అనంతరం డిఎస్సీ నియామకాల్లో జరిగిన లోపాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర విద్యామంత్రి దరేంద్ర ప్రధాన్ రాజీనామా ఎన్డీఏ కూటమి ప్రభుత్వా నైతిక విలువలకు అద్దం పడుతోనీదన్నారు. అదే కూటమి లో బాగస్వామిగా ఉన్న రాష్ట్ర విద్యా మంత్రి నారాలోకేష్ రాజీనామా చేసి నైతిక విలువలను పరిరక్షిస్తారా. పదవే ముఖ్యమని బావించి అంటిపెట్టు కుని ఉంటారో. చెప్పాలని, దీనిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన వైఖరిని రాష్ట్ర ప్రజలకు, నిరుద్యోగులకు వెల్లడించాలని ఆమన డిమాండ్ చేశారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని నమ్మిన నిరుద్యోగులు చంద్రబాబు వస్తే దొంగలకు ఉద్యోగాలు వస్తున్నాయంటే దీనికి మెగా డీఎస్సీ నిదర్శనం. ఎన్నికల ముందు, ఎన్నికల అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు, కూటమి నేతలు నమ్మబలికారని, ప్రజలను విద్యార్థులను మోసం చేశారని చిత్తశుద్ధి ఉంటే చంద్రబాబు నాయుడు సిబిఐ ద్వారా విచారణ చేపట్టి అవకతవకలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని తన కుమారుడిని మంత్రి పదవి నుంచి తొలగించాలని ఆయన కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రమాదాలకు నిలయంగా మారిన రోడ్డు

కౌతాళం : మండలంలోని ఉరుకుందకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిని అధ్వానంగా మారింది. రోడ్డంతా భారీ గుంతలతో నిండిపోవడంతో పాదాచారులు పొలాలకు వెళ్లే రైతన్నలు మరియు వాహనదారులు , తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో వాటి లోతు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉరుకుంద శ్రీ ఈరన్న స్వామి దేవస్థానానికి నిత్యం వేలాది మంది భక్తులు ఈ మార్గంలోనే ప్రయాణిస్తుంటారు. రహదారి దుస్థితి కారణంగా ద్విచక్ర వాహనదారులు, రైతులు, ఆటో, బస్సు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయంలో అంబులెన్స్ సేవలు కూడా వేగంగా చేరుకోవడం కష్టమవుతోందని ప్రజలు చెబుతున్నారు.

అగస్టు 9 నుంచి సైదాబాద్ లో బోనాలు

హైదరాబాద్ :భాగ్యనగరం ప్రజలు ఆరాధ్యదై వంగా పూజించే మహంకాళి అమ్మవారి ఉత్స వాలు సైదాబాద్ ప్రాంతంలో ఆగస్ట్ 9న (ఆదివారం) ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు బ్రోచర్ ఆవిష్కరించారు శ్రద్ధా బాద్ మార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 48సంవత్సరాల నుంచి మహంకాళి జాతర జరు పుతూ ఈ సంవత్సరం కూడా వేడుకలు ఘనంగా జరిపేందుకు సిద్ధమయ్యారు. మూడు రోజుల పాటు నిర్వహించే సైదాబాద్ బోనాల జాతరకు ఓ ప్రత్యేకత ఉన్నది. 10న మధ్యాహ్నం 1-30 గంటల నుంచి అమ్మవారి. ఘటం ఊరేగింపు,పోతురాజు లా గావు పెట్టి,పలహారబండ్ల ఊరేగింపు,11న మధ్యాహ్నం జరిగే అన్నదాన కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయి. అమ్మవారి ఘట్టాల ఊరేగింపులో పౌరాణిక వేషాలు ధరించి భక్తి భజన పాటలతో కనువిందు చేసే ఆర్కెస్ట్రా,పోతురాజుల వేషాలతో అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. దేశభక్తిని పెంపొందించే భగత్ సింగ్, మహాత్మాగాంధీ,అల్లూరి సీతారామరాజు,శివాజీ, రాణాప్రతాప్ వంటి దేశ భక్తుల వేషధారణలతో జాతీయ సమైఖ్య తను చాటిచెప్పేలా ప్రదర్శనలు ఇప్పిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రద్ధాబాద్ మహంకాళి జాతర అధ్యక్షుడు కె.మల్లేష్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కదారి రాంకుమార్, ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాస్ చందర్జీ, ఉపాధ్యక్షులు సహదేవ్ యాదవ్, గౌలీకార్ దినేష్, కోళ్ళ గోపీ, జైల్ సింగ్ కోశాధికారిగ గోలీకార్ పూర్ణచందర్, కార్యనిర్వాహక కార్యదర్శి ఆశీష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి పునాది

గచ్చిబౌలి : గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో 11వ ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్ ఛాంపియన్‌షిప్ ఘనంగా ముగిసింది. దేశంలోని వివిధ పోలీసు బలగాలకు చెందిన క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సి.వి. ఆనంద్ విజేతలకు ట్రోఫీలు, పతకాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, దేశంలోని వివిధ పోలీసు బలగాలు ఒకే వేదికపై కలుసుకోవడం జాతీయ ఐక్యతకు ప్రతీక అని అన్నారు. ఇటువంటి పోటీలు పరస్పర అవగాహనను పెంపొందించడంతో పాటు స్నేహపూర్వక వాతావరణాన్ని సృష్టిస్తాయని పేర్కొన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని, జూడో, కరాటే, తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్ ఆత్మ నియంత్రణ, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ చిన్ననాటి నుంచే క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. తాను కూడా విద్యార్థి దశ నుంచే క్రీడాకారుడినేనని, పోలీసు అకాడమీలో శిక్షణ సమయంలోనూ, అనంతరం సేవలోనూ క్రికెట్, టెన్నిస్ వంటి క్రీడల్లో చురుకుగా పాల్గొన్నానని డీజీపీ గుర్తు చేసుకున్నారు. క్రికెట్ తనకు అత్యంత ఇష్టమైన క్రీడ అని, సహచరులతో కలిసి మూడు ఛాంపియన్‌షిప్‌లు గెలిచిన అనుభవం ఉందన్నారు. 2019లో ఇంటిబట పనిచేసిన సమయంలో ఆ సంస్థకు లభించిన ఏకైక ట్రోఫీని తమ జట్టు సాధించిందని, అలాగే రెండు సంవత్సరాల క్రితం బెంగళూరులో జరిగిన పోటీల్లో విజేతగా నిలిచిన జట్టుకు నాయకత్వం వహించిన విషయాన్ని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాను ఉద్దేశించి తెలంగాణలో మరిన్ని జాతీయ స్థాయి క్రికెట్, టెన్నిస్ టోర్నమెంట్లు నిర్వహించేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. భారతదేశం ఒలింపిక్స్, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో మరిన్ని పతకాలు సాధించే దిశగా యువతను ప్రోత్సహించాలని, ప్రధానమంత్రి ప్రారంభించిన ఖేలో ఇండియా కార్యక్రమం ద్వారా క్రీడలకు విశేష ప్రోత్సాహం లభిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడలను రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని, ఉద్యోగ జీవితంలోనే కాదు పదవీ విరమణ అనంతరం కూడా ఆరోగ్యకరమైన జీవనశైలిని కొనసాగించేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని డీజీపీ సూచించారు. ఈ ఛాంపియన్‌షిప్ విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన నిర్వాహకులు, రిఫరీలు, టెక్నికల్ సిబ్బంది,

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతిక- కేసీఆర్ సంతాపం

హైదరాబాద్, జూలై 31 (ప్రజా కలం ప్రతినిధి)

తెలంగాణ ఉద్యమకారుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి అకాల మరణం పట్ల పార్టీ అధినేత కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఒక ఆప్తమిత్రుడిని, ఉద్యమ సహచరుడిని కోల్పోవడం వ్యక్తిగతంగా తనకు, పార్టీకి తీరని లోటని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన మలిదశ పోరాటంలోనూ, వరంగల్ జిల్లా ఉద్యమంలోనూ సుదర్శన్ రెడ్డి తనతో కలిసి నడిచిన తీరును కేసీఆర్ స్మరించుకున్నారు. పెద్దిని బతికించుకోవడానికి పార్టీ పక్షాన చేసిన విశ్వప్రయత్నాలు, వైద్యులు అందించిన చికిత్స విఫలం కావడంపై మనోవేదన చెందారు. తెలంగాణనే శ్వాసగా, నీతి నిజాయితీలతో ప్రజా జీవితంలో కొనసాగిన ఆయన రాజకీయ ప్రస్థానం ఆదర్శప్రాయమైనదని కొనియాడారు. పోరాటాల ఖిల్లా నర్సంపేట గడ్డపై గులాబీ జెండాను ఎగురవేసి, మొక్కవోని ధైర్యంతో పోరాడిన ధీరుడని ప్రశంసించారు.

చివరి శ్వాస వరకు గులాబీ జెండా నీడలోనే నడుస్తూ, అటు ఉద్యమంలోనూ, ఇటు నియోజకవర్గ అభివృద్ధిలోనూ తనకంటూ ఒక చెరగని ముద్ర వేసుకున్నారని కేసీఆర్ పేర్కొన్నారు. పోలీసు ఒత్తిళ్లు, కేసులు, జైలు నిర్బంధాలకు లొంగని ఆయన ఉద్యమ పటిమ, ధైర్యసాహసాలు కార్యకర్తల హృదయాల్లో ఎప్పటికీ నిలిచిపోతాయని తెలిపారు. సుదర్శన్ రెడ్డిని కోల్పోయి శోకసంద్రంలో ఉన్న ఆయన కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అన్ని వేళలా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ సమయంలో నియోజకవర్గ పార్టీ కార్యకర్తలు, నాయకులు ధైర్యంగా ఉండాలని కేసీఆర్ సూచించారు.

కరకపట్లలో పోలీసుల కార్డన్ సెర్చ్

- 32 బైకులు సీజ్.. బెల్ట్ షాపులపై కొరడా
-నేర నియంత్రణకు భారీ ఆపరేషన్.

గజ్వేల్ నియోజకవర్గం: 31 జూలై (ప్రజా కలం ప్రతినిధి)

సిద్ధిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని మార్కుక్ మండలం కరకపట్ల గ్రామంలో శుక్రవారం గజ్వేల్ ఏసీపీ నరసింహులు ఆధ్వర్యంలో భారీ పోలీసు బలగాలతో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ లక్ష్యంగా చేపట్టిన ఈ ప్రత్యేక తనిఖీల్లో గజ్వేల్ ఏసీపీతో పాటు ఇద్దరు సీఐలు,10 మంది ఎస్ఐలు, 111 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.మొత్తం సిబ్బందిని తొమ్మిది ప్రత్యేక బృందాలుగా విభజించి గ్రామంలోని ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.తనిఖీల్లో సరైన పత్రాలు లేని 32 ద్విచక్ర వాహనాలను,బెల్ట్ షాపుల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 29 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ నరసింహులు మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులకు లేదా పూర్తి వివరాలు,గుర్తింపు కార్డులు లేని వారికి ఇళ్లను అద్దెకు ఇవ్వవద్దని ప్రజలకు సూచించారు.గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని,గ్రామంలో ఎవరైనా అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గ్రామాల్లో భద్రతను మరింత బలోపేతం చేసేందుకు ప్రతి వీధి, కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు సంబంధించిన అన్ని చట్టబద్ధమైన పత్రాలు వెంట ఉంచుకోవాలని,ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని తెలిపారు. నేరరహిత సమాజ నిర్మాణానికి ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ రూరల్ సీఐ రవిరాజు,తొగుట సీఐ లతీఫ్, మార్కుక్ ఎస్ఐ యూనిస్‌తో పాటు గజ్వేల్ డివిజన్‌కు చెందిన ఎస్ఐలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బిజెపి జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా నాగు ముదిరాజ్ కు కీలక బాధ్యత

గజ్వేల్:31 జూలై 2026 (ప్రజా కలం ప్రతినిధి)

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సిద్దిపేట జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా మామిండ్ల నాగు ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా తనపై నమ్మకంతో కీలక బాధ్యతను అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి, రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా బీజేపీ రాష్ట్ర నాయకులు రామచంద్రరావు, మెదక్ ఎంపీ ఎం. రఘునందన్‌రావు,సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మల్లన్నగారి భిక్షవతి, నియోజకవర్గంలోని మండల పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్ యాదవ్‌తో పాటు పార్టీ కార్యకర్తలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.మామిండ్ల నాగు ముదిరాజ్ మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా అంకితభావంతో పనిచేస్తానని అన్నారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు.అందరినీ కలుపుకొని ముందుకు సాగుతూ,పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు సిద్దిపేట జిల్లాలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు నిరంతరం శ్రమిస్తానని ఆయన పేర్కొన్నారు.

మహేశ్వరం మండల స్థాయి సమావేశంలో రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ సమస్యలపై చర్చ

సర్పంచులు ప్రస్తావించిన సమస్యలను పరిష్కరిస్తాం అధికారుల హామీ

మహేశ్వరం, జూలై 31 (ప్రజా కలం)

మహేశ్వరం మండలంలోని గ్రామాల్లో నెలకొన్న వివిధ సమస్యలపై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల స్పెషల్ ఆఫీసర్ ఎన్. శుభాషిణి

అధ్యక్షత వహించారు. మండలంలోని గ్రామాల సర్పంచులు తమ గ్రామాల్లో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రోడ్ల దుస్థితి, తాగునీటి సమస్యలు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, వీధి దీపాల నిర్వహణ, రెవెన్యూ సమస్యలు, మొక్కల పెంపకం, విద్యా వ్యవస్థ, మద్యపాన నియంత్రణ, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.అనంతరం వివిధ శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో చేపడుతున్న పనులు, ప్రగతి, పెండింగ్ అంశాలపై సమీక్ష నిర్వహించారు. సర్పంచులు ప్రస్తావించిన సమస్యలను పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఎన్. శారదమ్మ, డీఎల్‌పీఓ సామీ రెడ్డి, తహసీల్దార్ చిన్న అప్పలనాయుడు, ఏఎంసీ చైర్మన్ సభావత్ కృష్ణ నాయక్, పీఏసీఎస్ చైర్మన్ మంచే పాండు యాదవ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తెలంగాణ రక్షణ ట్రేడ్ యూనియన్ ఏర్పాటు

- ట్రేడ్ యూనియన్ లోగో ఆవిష్కరణ..
- టీఆర్ఎస్ కార్మికుల ఫ్రెండ్లీ పార్టీ-కల్వకుంట్ల కవిత
- దేశంలో హక్కులను కాలరాసే కుట్ర...
- కార్మికుల శ్రమను దోచుకుంటున్న ప్రభుత్వాలు..
- ప్రైవేట్ శక్తులకు అండగా నిలుస్తున్నారని ఆరోపణలు ..
- కార్మికులు,ఉద్యోగులు,టీచర్ల హక్కుల కోసం పోరు..

హైదరాబాద్, జూలై 31 (ప్రజా కలం ప్రతినిధి)

తెలంగాణ రక్షణ సేన పార్టీ కార్మికుల ఫ్రెండ్లీ పార్టీగా ఉంటుందని తెలంగాణ రక్షణ సేనా అధ్యక్షురాలు కవిత స్పష్టం చేశారు. తెలంగాణ రక్షణ సేనా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ట్రేడ్ యూనియన్ లోగోను శుక్రవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...టీఆర్ఎస్ అధికారంలోకి వస్తాని ధీమా వ్యక్తం చేశారు. తమది కార్మికుల ఫ్రెండ్లీ ప్రభుత్వంగా పని చేస్తామని హామీ ఇచ్చారు. టీఆర్టీయూను కార్మిక లోకానికి అంకితం చేస్తున్నట్లు వెల్లడించిన అమె లోగో లో ఒక వైపు పెన్ను, మరో వైపు పాణా ఉందని వివరించారు.అన్ని రంగాల అండగా ఉంటామని వివరించారు. ఇక దేశంలో లేబర్ చట్టాలు, కార్మికుల హక్కులను పూర్తిగా కాలరాస్తున్నారని ఆరోపిం చారు. కార్మికుల హక్కులు కాపాడాలంటే ట్రేడ్ యూనియన్, లేబర్ యూనియన్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్మికులు,యువశక్తి లేకుండా దేశం ముందుకు వెళ్లడం కష్టమన్నారు. ప్రజాస్వామ్యం అంటే ప్రజలకు సంతోషంగా పనిచేసే అవకాశం కల్పించాలని కవిత పేర్కొన్నారు.కానీ ప్రభుత్వమే ఎక్కువ శ్రమ దోపిడీ చేస్తుందని మండిపడ్డారు.అవుట్ సోర్స్,కాంట్రాక్ట్ కార్మికులు,ప్రభుత్వ ఉద్యోగులు ధర్నాలు చేసే పరిస్థితి తలెత్తడం అందుకు నిదర్శనమ న్నారు.ఈ అంశాన్ని ప్రస్తావించి నిలదీస్తే బెదిరించటం, కేసులు పెట్టుతున్నారని స్పష్టం చేశారు. ప్రభుత్వాలు ఇలా ఉంటాయా?అని ప్రశ్నించారు.ప్రైవేట్ దోపిడీకి ప్రభుత్వమే మార్గాన్ని చూపిస్తోందని ఎద్దేవ చేశారు.

ట్రేడ్ యూనియన్ రక్షణ కవచం,రాజ్యాంగ బద్ధం,కార్మికుల హక్కు

ట్రేడ్ యూనియన్ చట్టాలు కార్మికులకు రక్షణగా నిలిచాయని కవిత తెలిపారు.1926 నుండి ఈ చట్టాలు అమల్లోకి వచ్చినట్లు వివరించారు. దేశంలో బీజేపీ అధికారం చేపట్టిన తర్వాత, మోడీ ప్రభుత్వం లేబర్ చట్టాలను తుంగలో తొక్కి నాలుగు కొత్త లేబర్ చట్టాలను తీసుకువచ్చిందన్నారు.ఈ చట్టాల కారణంగా కార్మికుల హక్కులను కోల్పోయే ప్రమాదం పొంచి ఉందన్నారు.ఆయా చట్టాలను అమలు చేయమని బెంగాల్, తమిళనాడు రాష్ట్రాలు ఇప్పటికే స్పష్టం చేసినట్లు తెలిపారు.మన రాష్ట్రంలో ఈ చట్టాలను అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలి సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు స్పష్టమైన భరోసా ఇవ్వాలన్నారు. మల్కాజిగిరి ఎంపీగా రేవంత్ రెడ్డి పని చేసిన సమయంలో షెడ్యూల్ ఆఫ్ ఇండస్ట్రీస్ కార్మికులకు కనీస వేతనం 20 వేలు ఉండాలని నాటి సీఎం కేసీఆర్ కు లేఖ రాసిట్లు గుర్తు చేశారు. ఆయన సీఎంగా పదవీబాధ్యలు చేపట్టిన తర్వాత ఆ అంశాన్ని మరిచారని మండిపడ్డారు. ఇప్పటికి వారికి రూ.16 వేలు చెల్లిస్తున్నారని వివరించారు.వారికి 26 వేల కనీసం వేతనం చెల్లించాలని తెలంగాణ రక్షణ సేన డిమాండ్ చేస్తోందన్నారు.

ఐటీ,ఫార్మాలో యూనియన్లు....

ఐటీ, ఫార్మా రంగాల్లో యూనియన్ల అవసరం ఉందని కవిత గుర్తు చేశారు.ప్రభుత్వాల కన్నాఐటీ రంగం గొప్పది కాదని,ఐటీ లో పనిచేసే వాళ్ల ఉద్యోగం ఎప్పుడు పోతుందనే భయం ఉందన్నారు.టీఆర్ఎస్ పార్టీలో ఐటీ సెక్టార్ కోసం వింగ్ ఏర్పాటు చేస్తామన్నారు.ఇటీవల జీనోమ్ వ్యాలీలో రెండు వందల మంది తెలుగు మాట్లాడే వాళ్లను తీసేశారు. ఏలాంటి యూనియన్లు లేకపోవడంతో వారి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని స్పష్టం చేశారు. ప్రైవేట్ ఉద్యోగులు, కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు సంతోషంగా ఉన్నప్పుడే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. అందుకు తగిన వాతావరణాన్ని ప్రభుత్వం కల్పించాల్సిన అవసరం ఉంది.ప్రభుత్వం ఆటోడ్రైవర్లను టెర్రరిస్టులు చూస్తోం దని, పోలీసులు చలాన్ వేస్తున్నారని స్పష్టం చేశారు.రోజంతా కష్టపడి సంపా దించిన డబ్బు చలాన్లకే సరిపోతుందన్నారు.ప్రభుత్వాలు పేదలు, కార్మికులు, ఉద్యోగుల వైపే ఉండాలి కవిత సూచించారు.

చోరీకి పాల్పడిన నిందితుడు అరెస్ట్...

రిమాండ్‌కు తరలింపు.
దౌల్తాబాద్ ఎస్ ఐ అరుణ్ కుమార్.

దుబ్బాక ప్రజాకలం జూలై 31.

దౌల్తాబాద్‌లో బైక్ చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు దౌల్తాబాద్ ఎస్ఐ జి.అరుణ్ కుమార్ తెలిపారు. దౌల్తాబాద్ ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. దౌల్తాబాద్‌లోని ఎల్లమ్మ ఆలయం సమీపంలోని కల్లు కాంపౌండ్ వద్ద పార్క్ చేసి ఉన్న మోటార్‌సైకిల్‌ను కొండాపూర్ గ్రామానికి చెందిన వరదం యాదగిరి చోరీ చేశాడు. అనంతరం ఆ బైక్‌ను అమ్మేందుకు తీసుకెళ్తున్న సమయంలో దౌల్తాబాద్ పోలీసులు పట్టుకొని అదుపులోకి తీసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ జి.అరుణ్ కుమార్ ప్రజలకు పలు సూచనలు చేశారు. వాహనాలను పార్క్ చేసే సమయంలో తప్పనిసరిగా లాక్‌తో పాటు ఇతర భద్రతా పరికరాలు ఉపయోగించాలని సూచించారు. అలాగే అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాల కదలికలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

15వ వార్డు సమస్యపై బిజెపి వినతి పత్రం

గజ్వేల్:31 జూలై 2026 (ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ 15వ వార్డులోని తూప్రాన్ రోడ్డు, హెచ్‌పీ పెట్రోల్ బంక్ వెనుక కాలనీలో ప్రతి ఏడాది వర్షపు నీరు నిల్వ ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ నాయకులు తెలిపారు.ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ 15వ వార్డు బీజేపీ నాయకుడు జోడు ప్రకాష్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు,మున్సిపల్ చైర్మన్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.ప్రజల సమస్యల పరిష్కారమే బీజేపీ ధ్యేయమని,వర్షపు నీరు నిలిచిపోవడం వల్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్నందున అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ పట్టణ బీజేపీ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్ యాదవ్, సిద్దిపేట జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు నత్తి శివకుమార్, గజ్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శి నాయిని సందీప్ కుమార్,సీనియర్ నాయకులు వెంకటేష్,గడియారం రాజేశ్వర్ చారి తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, సవరణలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

డాక్టర్స్ కాలనీ డివిజన్‌లో సర్ కార్యక్రమంపై సమావేశం నిర్వహించిన డాక్టర్స్ కాలనీ డివిజన్ అధ్యక్షులు నల్లెంకి ధన్‌రాజ్ గౌడ్

మహేశ్వరం, జూలై 31,(ప్రజా కలం)

కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, సవరణలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డాక్టర్స్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నల్లెంకి ధన్‌రాజ్ గౌడ్ అన్నారు.డాక్టర్స్ కాలనీ డివిజన్‌లో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ – సర్ కార్యక్రమంలో భాగంగా ఏ ఎస్ ఆర్ గార్డెన్స్‌లో బూత్ లెవెల్ ఏజెంట్స్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన అధ్యక్షత డివిజన్ అధ్యక్షులు నల్లెంకి ధన్‌రాజ్ గౌడ్ ముఖ్య అతిథులు డివిజన్ సర్ ఇన్‌చార్జి నవారు మల్లారెడ్డి కెఎల్ఆర్ పి.ఏ. రవీందర్ పాల్గొన్నారు.డివిజన్‌కు చెందిన బూత్ లెవెల్ ఏజెంట్స్ పెద్ద సంఖ్యలో సమావేశంలో సర్ కార్యక్రమాన్ని 100 శాతం విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ప్రతి బి ఎల్ ఏ తమ బూత్ పరిధిలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ పనిని బాధ్యతాయుతంగా, ఖచ్చితంగా నిర్వహించాలని సూచించారు. ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సరిచూడాలని, కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, సవరణలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. డాక్టర్స్ కాలనీ డివిజన్ ఏ ఎస్ ఆర్ గార్డెన్స్‌లో సర్ కార్యక్రమంపై బి ఎల్ ఏ సమావేశం. డివిజన్ అధ్యక్షులు నల్లెంకి ధన్‌రాజ్ గౌడ్ గారి ఆధ్వర్యంలో, సర్ ఇన్‌చార్జి నవారు మల్లారెడ్డి రవీందర్ సమక్షంలో జరిగింది.

తోగుట పోలీస్ స్టేషన్‌ను వార్షికంగా తనిఖీ చేసిన గజ్వేల్ ఏసీపీ కె.నర్సింలు.

దుబ్బాక ప్రజాకలం జూలై 31.

గజ్వేల్ ఏసీపీ కె. నర్సింలు శుక్రవారం వార్షిక తనిఖీ నిమిత్తం తోగుట పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణతో పాటు అన్ని విభాగాలను పరిశీలించారు. సిబ్బంది పనితీరు, రికార్డులు, కేసు ప్రాపర్టీ, స్టేషన్ ఆవరణలో ఉన్న కేసులకు సంబంధించిన వాహనాలను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. అలాగే సైబర్ క్రైమ్, రిసెప్షన్, కోర్టు డ్యూటీ, సీసీటీఎన్ఎస్ తదితర విభాగాల పనితీరును సమీక్షించి, సంబంధిత సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగే ఆర్థిక నేరాలు, దొంగతనాలు మరియు ఇతర కేసుల దర్యాప్తును నిష్పాక్షికంగా, వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తోగుట సిఐ లతీఫ్, ఎస్ఐ నవీన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన పోలీసు సిబ్బందిని ఘనంగా సత్కరించిన యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్

యాదాద్రి భువనగిరి జిల్లా, జులై 31 (ప్రజా కలం)

యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అక్షాన్ష్ యాదవ్, శుక్రవారం రోజున ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో పోలీసు శాఖలో సుదీర్ఘకాలం

అంకితభావంతో, నిబద్ధతతో సేవలందించి పదవీ విరమణ పొందిన పోలీసు సిబ్బందిని ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఎస్పీ పదవీ విరమణ పొందిన సిబ్బంది పోలీసు శాఖకు అందించిన విలువైన సేవలను అభినందించారు.ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో వారు నిర్వర్తించిన బాధ్యతలను ప్రశంసించారు. పదవీ విరమణ పొందిన సిబ్బంది: 1.ఎం.డి.కాజా లతీఫ్,ఏఎస్ఐ --తుర్కపల్లి పోలీస్ స్టేషన్ ,2.ఎం.డి.నుస్రత్ అలీ, ఏఎస్ఐ --మహిళా పోలీస్ స్టేషన్,భువనగిరి,3 కె. శ్రీనివాసులు, ఏఎస్ఐ -- ట్రాఫిక్ పోలీస్ స్టేషన్,చౌటుప్పల్ పోలీసు శాఖలో ఎన్నో సంవత్సరాల పాటు నిబద్ధతతో సేవలందించినందుకు గాను వారి సేవలను గుర్తిస్తూ ఎస్పీ సత్కరించారు.ఈ సందర్భంగా పదవీ విరమణ అనంతరం వారు మరియు వారి కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా, ఆనందంగా,ప్రశాంతమైన మరియు సంతృప్తికరమైన జీవితాన్ని గడపాలని ఎస్పీ ఆకాంక్షించారు.పోలీసు శాఖకు, ప్రజలకు వారు అందించిన సేవలకు గుర్తుగా ఈ సత్కార కార్యక్రమం నిర్వహించబడింది.

గీతం క్యాంపస్‌లో ఉద్యోగాల వర్షం

-గీతం విద్యార్థులకు వెయ్యికి పైగా ఉద్యోగాలు..

పటాన్‌చేరు, జులై 31 (ప్రజా కలం) ప్రతినిధి

హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం శుక్రవారం అచీవర్స్ డే--2026ను ఘనంగా నిర్వహించి, 2026 బ్యాచ్ ప్రాంగణ నియామకాల ఫలితాలను ప్రకటించింది. 1,347 మంది విద్యార్థుల్లో 771 మంది ఉద్యోగాలు

సాధించగా, 324 ప్రముఖ సంస్థలు వెయ్యికి పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించాయి..వ్యాపార నిర్వహణ విద్యా విభాగం 97.5 శాతం ఉద్యోగాలతో అగ్రస్థానంలో నిలవగా, నిర్మాణ శిల్ప విద్యా విభాగం వంద శాతం ఉద్యోగాలు నమోదు చేసింది. కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగానికి అత్యధికంగా 544 ఉద్యోగ అవకాశాలు లభించాయి. ఈ ఏడాది గరిష్ఠంగా రూ.16 లక్షల వార్షిక వేతన ప్యాకేజీ నమోదైంది.

జీ.టి. కృష్ణ చైతన్య, రిచర్డ్ కింగ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. జి. సృజన్, డి. వీణాశ్రీ, ఇ.జె. సంఘమిత్ర, నిహారిక నోముల, పమిశెట్టి ప్రేమ్ కుమార్ తమ అనుభవాలను పంచుకోగా, ఎన్.వి. శ్రీనివాస్ స్వరూప్ విశ్వవిద్యాలయాన్ని అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్ వడ్డి, ప్రొఫెసర్ జి. శివకుమార్, డాక్టర్ దివ్య కీర్తి గుప్తా, డాక్టర్ మోతహర్ రెజా, డాక్టర్ బందన్ కుమార్ మిశ్రా, డాక్టర్ శామ్యూల్ ధరు, డాక్టర్ ఎడ్విన్ ఆంథోనీ, డాక్టర్ కె. మమతతో పాటు అధ్యాపకులు, తల్లిదండ్రులు, అధికారులు పాల్గొన్నారు..

నకిలీ నెంబర్ ప్లేట్లపై కఠిన చర్యలు

- హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు తప్పనిసరి

-గజ్వేల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ

గజ్వేల్:31 జూలై 2026 (ప్రజా కలం ప్రతినిధి)

ప్రభుత్వం ఆమోదించిన హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు (హెచ్ ఎస్ ఆర్ పి) మాత్రమే చట్టబద్ధమైనవని, నకిలీ, మార్పులు చేసిన,స్టిక్కర్ ఆధారిత, డూప్లికేట్ లేదా అస్పష్టంగా కనిపించే నంబర్ ప్లేట్లను వాహనాలపై అమర్చడం చట్టవిరుద్ధమని గజ్వేల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు.గజ్వేల్ పట్టణంలో గజ్వేల్ ట్రాఫిక్ సత్యనారాయణ మాట్లాడుతూ. ప్రభుత్వం ఆమోదించిన హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లను ఉపయోగించడం ద్వారా వాహనాల అసలు గుర్తింపును దాచడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిం చడం,నేర కార్యకలాపాలకు సహకరించే అవకాశం ఉన్నందున ఇటువంటి ఉల్లంఘనలను సిద్ధిపేట పోలీసులు అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నారని పేర్కొన్నారు.నకిలీ లేదా అనధికారిక నెంబర్ ప్లేట్లతో సంచరించే వాహనాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు, అవసరమైతే వాహనాలను స్వాధీనం చేసుకుని అమల్లో ఉన్న చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అన్ని వాహన యజమానులు తమ వాహనాలకు ప్రభుత్వం ఆమోదించిన హెచ్ ఎస్ ఆర్ పి నంబర్ ప్లేట్లు మాత్రమే అమర్చుకున్నట్లు వెంటనే ధృవీకరించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్ నిబంధనలను పాటిస్తూ,ట్రాఫిక్ నియమాలను గౌరవించి పోలీసులకు సహకరించాలని గజ్వేల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు.

భారీ వర్షాల నేపథ్యంలో... అధికారులు అప్రమత్తంగా ఉండాలి.

- వాగులు, వంకలు, కాజ్‌వేల వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలి.

- లోతట్టు ప్రాంతాలను గుర్తించి పునరావాస కేంద్రాలు సిద్ధం చేయాలి. -జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి, ప్రతినిధి జూలై 31(ప్రజా కలం): రాష్ట్రంలో కొనసాగుతున్న వాతావరణ మార్పులు, భారత వాతా వరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వచ్చే వారంలో కూడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పూర్తి అప్రమత్తతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు.ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, జిల్లా నుంచి గ్రామ స్థాయి వరకు విపత్తు నిర్వహణ వ్యవస్థను పటిష్ఠంగా సిద్ధం చేయాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్య, వ్యవసాయ, పశుసంవర్ధక, విద్య, మత్స్య, పోలీస్ తదితర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

జిల్లాలో నమోదైన వర్షపాతం, రానున్న రోజుల వర్ష సూచనలు, తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమగ్రంగా సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,

మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులతో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేసి స్థానిక పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తూ మీడియా ద్వారా హెచ్చరికలు జారీ చేయాలని చెప్పారు.

జిల్లాలోని అన్ని లోతట్టు ప్రాంతాలను గుర్తించి అవసరమైన చోట పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. గ్రామాలు, వట్టణాల్లో శిథిలావస్థలో ఉన్న పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాత భవనాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల వారీగా పూర్తి వివరాలను అన్ని శాఖలు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు.

వాగులు, వంకలు, చెరువులు, కుంటలు, కాలువల నీటి ప్రవాహాన్ని ఇరిగేషన్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. కాజ్‌వేలపై నీరు ప్రవహిస్తున్న ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, ప్రజలను అటువైపు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన చోట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని తెలిపారు.

క్షేత్రస్థాయిలో వరదలు లేదా ఇతర నష్టాలు సంభవించిన వెంటనే సంబంధిత అధికారులు జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించి అత్యవసర చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు, పశుసంపద, పంటలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు నష్టం జరగకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని సూచించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను మిషన్ మోడ్‌లో నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని, ప్రత్యేక మండల అధికారులు తమకు కేటాయించిన మండలాల్లో స్వయంగా పర్యవేక్షించాలని సూచించారు.

త్రాగునీటికి ప్రాధాన్యతనివ్వాలని,జిల్లాలో ప్రజలకు ఎక్కడా త్రాగునీటి సమస్య తలెత్తకుండా సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు.

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను చూసి రైతులు అధిక నీరు అవసరమయ్యే పంటల సాగు చేయకుండా, భూగర్భ జలాల లభ్యత, ఎల్‌నినో ప్రభావం దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటితో తక్కువ కాలంలో అధిక దిగుబడినిచ్చే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ, వరదనీటి పారుదల, అత్యవసర సేవలకు సంబంధించి ముందస్తు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

జిల్లా అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి మాట్లాడుతూ, రాత్రికి రాత్రే భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రతి మండలంలో ప్రత్యేక విపత్తుల నివారణ కమిటీలు ఏర్పాటు చేసి తరచూ సమావేశాలు నిర్వహించాలని సూచించారు.

ప్రమాదకర చెరువులు, కాలువలు, కాజ్‌వేలు, ఇతర ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, మున్సిపల్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సంగారెడ్డి మెడికల్ కళాశాల ముందు మెడికల్ యూనియన్ ధర్నా.

-అక్రమాలకు పాల్పడుతున్న ఏజెన్సీలను రద్దు చెయ్యాలి

-కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగాలపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్య తీసుకోవాలి

-కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగాలు అమ్మడమే ఏజెన్సీలో పనిగా మారింది

-మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం,యాదగిరి ప్రభుత్వానికి డిమాండ్

సంగారెడ్డి ప్రతినిధి
జులై 31(ప్రజా కలం):

అక్రమాలకు పాల్పడుతున్న ఏజెన్సీలను రద్దు చెయ్యాలి కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగాలపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై కఠినమైన చర్య తీసుకోవాలి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగాలు అమ్మడమే ఏజెన్సీల పనిగా మారిందని మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం,యాదగిరి అన్నారు శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ ముందు ధర్నా నిర్వహించి అనంతరం సూపర్డెంట్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం, యాదగిరి మాట్లాడుతూలి ప్రభుత్వ హాస్పిటల్ మెడికల్ కళాశాలలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఏజెన్సీలకు వత్తాసు పలుకుతూ వారికి అనుకూలంగా ఉన్నవారికే ఉద్యోగాలివ్వడం చాలా దారుణమన్నారు. ప్రభుత్వ హాస్పిటల్ మెడికల్ కళాశాలలో ఉద్యోగాలు రావాలంటేనే ఏజెన్సీలు,అధికారులకు చేతులు తడిస్తే తప్ప ఉద్యోగాలు ఇచ్చే పరిస్థితి లేదని అన్నారు అందులో పని చేస్తున్న కార్మికులను కాదని అధికారులు ఏజెన్సీలకు వత్తాస్తు పలుకుతూ వాళ్లకి అనుకూలంగా ఉన్నవారికి డబ్బులు ఇస్తేనే ఉద్యోగం ఇస్తున్నారని ఆయన అన్నారు మార్పు అంటే ఇదేనేమో అని అన్నారు ఆస్పత్రిలో కొన్నేళ్లుగా పనిచే స్తున్న కార్మికులను కాదని ఇతరులకు ఔట్సోర్సింగ్ కింద ఉద్యోగాలివ్వడం అన్యాయమని దుయ్యబట్టారు. ఔట్సోర్సింగ్ కింద ఉద్యోగాలు పేరుమీద నోటిఫికేషన్ వేయకుండా ఎలా రిక్రూట్మెంట్ చేస్తారని అన్నారు అధికారులు ఎవరికి చెప్పకుండా కాంట్రాక్టర్లకు వత్తాస్తు పలుకుతూ వారికి అనుకూలంగా ఉన్న వారికి ఉద్యోగాలు ఇవ్వడం ఏంటని అన్నారు కార్మికులకు మేలు చేయాల్సిన అధికారులే ఇలా చేయడం ఏంటని అన్నారు నోటిఫికేషన్ వేయకుండా ఉద్యోగాలు తీసుకున్న వారిని రా తొలగించి వారి స్థానంలో అందులో పని చేస్తున్న కాంటాక్ట్ కార్మికులను తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు లేనివక్షంలో కార్మికులందరూ ఐక్యం చేసి పోరాటం నిర్వహిస్తామని ఆయన ప్రభుత్వానికి హెచ్చరించారు ఇప్పటికైనా ప్రభుత్వ హాస్పిటల్,మెడికల్ కళాశాల అధికారులు పద్ధతి మార్చుకోవాలని ఆయన అన్న లేనిపక్షంలో భవిష్యత్తులో ఏమన్నా జరుగుతే దీనికి బాధ్యత ప్రభుత్వ హాస్పిటల్, మెడికల్ కళాశాల అధికారులు వహించాల్సి వస్తుందని అన్నారు .

ప్రభుత్వం నుండించి వెంటనే నియామ కాల్లో నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని లేదా పోరాటం మరింత తీవ్రతం చేస్తామని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కే,యాదగిరి కే, సదానంద నాగరాజు, సునీత లక్ష్మీ ప్రియ మొగులమ్మ భాగ్యలక్ష్మి శేఖర్ నాగరాజు, మహేందర్ రెడ్డి సురేష్ మల్లేశం మహేందర్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రేంజ్ ఆఫీసర్ వినాయక్ ను సన్మానించిన డాక్టర్ కుమారస్వామి



గజ్వేల్:31 జూలై 2026
(ప్రజా కలం ప్రతినిధి)

అంతర్జాతీయ రేంజర్స్ డే సందర్భంగా సిద్ధిపేట జిల్లా గజ్వేల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షుడు డాక్టర్ లయన్ కుమారస్వామి ఆధ్వర్యంలో గజ్వేల్ రేంజ్ ఆఫీసర్ వినాయక్‌ను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి,స్వామి వివేకానంద జీవిత చరిత్ర పుస్తకాన్ని బహూకరించారు.

ఈ సందర్భంగా డాక్టర్ కుమారస్వామి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ,అడవుల సంరక్షణ,వన్యప్రాణుల రక్షణ కోసం గజ్వేల్ రేంజ్ ఆఫీసర్ వినాయక్ చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని అన్నారు.సమాజంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడంలో అటవీ శాఖ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.రేంజ్ ఆఫీసర్ వినాయక్ మాట్లాడుతూ,లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణను తమ బాధ్యతగా భావించి మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ ఆఫీసర్ పవన్ కుమార్, శ్రీహరి, అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లెలగూడకు కాంగ్రెస్ నేత జి.చిన్నారెడ్డి

బోనాల ఉత్సవాల చెక్కుల పంపిణీ

ఆగస్టు 3తో ముగియనున్న ఓటర్ల సమగ్ర ప్రత్యేక సవరణ

మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేఎల్ఆర్

మహేశ్వరం, జూలై 31, (ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండల కేంద్రం జిల్లెలగూడ డివిజన్ లో తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డి పర్యటించనున్నారు.బోనాల ఉత్సవాల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా నిధులను మంజూరు చేస్తుందని కె ఎల్ ఆర్ అన్నారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ నుంచి ప్రభుత్వం అందిస్తున్న

చెక్కులను ఇచ్చేందుకు రాష్ట్ర ప్లానింగ్ కమిటీ వైఎస్ చైర్మన్ జి. చిన్నారెడ్డి రానున్నారు.ఈ సందర్భంగా కె ఎల్ ఆర్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు తెలిపేందుకు సీఎం రేవంత్ రెడ్డి గారి సర్కార్... బోనాల పండుగను ఘనంగా నిర్వహిస్తుందన్నారు.

ఆగస్టు 3తో సర్ ముగింపు: కిచ్చెన్న

ఓటర్ల సమగ్ర ప్రత్యేక సవరణ– సర్ కార్యక్రమం ముగుస్తున్నందున్న ఎన్యూమరేషన్ ఫారమ్స్ నింపిన వారు వెంటనే బి ఎల్ వో లకు అందజేయాలని తెలిపారు. ప్రతీ బూత్ స్థాయిలో కాంగ్రెస్ బి ఎల్ ఏ లు సైతం ఇంటింటికి వెళ్లి ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారని కె ఎల్ ఆర్ చెప్పారు.

ప్రతీ బి ఎల్ ఏ 5 నుంచి 10 మంది పేర్లు ఇవ్వండి లక్ష్మారెడ్డి 542 బూత్ ల్లో నిర్విరామంగా పని చేస్తున్న కాంగ్రెస్ బి ఎల్ ఏ లు ప్రతీ ఇంటినీ, ఓటర్, ఎన్యూమరేషన్ ఫారమ్స్ పంపిణీ, ఆన్ లైన్ ఎన్ రోల్ మెంట్, చనిపోయిన వారి వివరాలు, ట్రాన్స్ ఫర్ అయిన ఓటర్ల మ్యాపింగ్ ను ఎప్పటికప్పుడూ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని లక్ష్మారెడ్డి సూచించారు.

ఏడుపాయల తల్లికి ఘనంగా కళ్యాణం

-ఏడుపాయల దుర్గమ్మ

కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి..

పటాన్‌చెరు, జులై 31 (ప్రజా కలం) ప్రతినిధి

అమీన్పూర్ డివిజన్ పరిధిలోని కిష్టారెడ్డిపేట గ్రామంలో ఉన్న శ్రీశ్రీశ్రీ ఏడుపాయల దుర్గమ్మ తల్లి దేవాలయంలో శుక్రవారం వైభవంగా నిర్వహించిన కళ్యాణ మహోత్సవం,బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ జడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్, దర్శన్, కుమ్మరి శాలివాహన సంఘం సభ్యులు, భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు..



భారీగా పెరిగిన బియ్యం ధరలు

హైదరాబాద్ : తెలంగాణలో బియ్యం ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దేశ సగటుతో పోలిస్తే రాష్ట్రంలో ధరల పెరుగుదల మరింత ఎక్కువగా నమోదవుతోంది. ఈ పరిస్థితికి ఎల్‌నినో ప్రభావంతో పంట దిగుబడులపై నెలకొన్న ఆందోళనలు ఒక కారణమైతే,.. ప్రైవేటు వ్యాపారులు భారీగా బియ్యాన్ని నిల్వ చేయడం మరో ప్రధాన కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారం.. మే నుంచి జులై మధ్య దేశవ్యాప్తంగా బియ్యం రిటైల్ ధరలు సగటున 3.33 శాతం పెరిగాయి. అదే కాలంలో తెలంగాణలో మాత్రం 4.65 శాతం పెరుగుదల నమోదైంది. ప్రస్తుతం రాష్ట్రంలో బియ్యం సగటు రిటైల్ ధర కిలోకు రూ.52.67గా ఉండగా.. ఇది దేశ సగటుతో పోలిస్తే దాదాపు రూ.10 ఎక్కువ. ప్రముఖ రకాల సన్నబియ్యం ధరలు కిలోకు రూ.54 నుంచి రూ.70 వరకు విక్రయిస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. తెలంగాణ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు.. ఎల్‌నినో ప్రభావంతో పంటపై ఆందోళనలు నెలకొనడంతో ధరలు పెరిగాయని చెప్పారు. రానున్న నెలల్లో పంట బాగా వస్తే ధరలు మళ్లీ తగ్గే అవకాశం ఉందని వారు అభిప్రాయపడ్డారు.అయితే ధరల పెరుగుదలకు ఎల్‌నినో ఒక్కటే కారణం కాదని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. తెలంగాణలో వరి సాగు విస్తీర్ణం బాగానే ఉన్నందున సరఫరాలో పెద్ద అంతరాయం లేదన్నారు. అయినప్పటికీ ధరలు పెరగడానికి ప్రైవేటు వ్యాపారుల నిల్వలు కూడా ప్రధాన కారణమని పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పొందించిన పాలసీ పత్రం ప్రకారం.. భౌగోళిక-రాజకీయ అనిశ్చితులు, ఎరువులు-ఇంధన వ్యయాల పెరుగుదల, ఆసియా దేశాల్లో ఎల్‌నినో ప్రభావం కారణంగా ప్రపంచ మార్కెట్‌లో బియ్యం ధరలు 30 నుంచి 50 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని అంచనా వేసింది.పాలసీ పత్రంలో మూడు రకాల పరిస్థితులను ప్రస్తావించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో రానున్న రోజుల్లో బియ్యం ధరలు అకస్మాత్తుగా ఎగబాకే ప్రమాదం ఉందని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం హెచ్చరించింది. ప్రస్తుతానికి మార్కెట్‌లో ధాన్యపు నిల్వలు తగినంతగా ఉన్నప్పటికీ.. భవిష్యత్తులో ఏర్పడే వాతావరణ మార్పులు, ఎల్ నినో ప్రభావం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు బియ్యం వ్యాపారాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే అవకాశం ఉందని తాజా పాలసీ పత్రంలో స్పష్టం చేశారు. సెంటర్ ఫౌండింగ్ డైరెక్టర్ సమరేందు మొహంతి, పీజేటీఏయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనం ప్రకారం.. ఆసియాలోని ప్రధాన వరి సాగు ప్రాంతాలపై ఎల్ నినో ప్రభావం పడితే, దిగుమతి చేసుకునే దేశాలు ముందుగానే నిల్వలు పెంచుకోవడానికి మొగ్గు చూపుతాయి.దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా బియ్యం ధరలు యావరేజ్‌గా 30 నుంచి 50 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని అధ్యయనం అంచనా వేసింది. ఉత్పత్తి స్థిరంగా ఉండి, ప్రభుత్వాలు ఎగుమతి ఆంక్షలు విధించకపోతే, ఆందోళన కొనుగోళ్లు లేకపోతే ధరలు కేవలం 10 నుంచి 20 శాతం వరకు మాత్రమే పెరుగుతాయన్నారు. మధ్యస్థ ఉత్పత్తి నష్టాలు, ఆగ్నేయాసియా దేశాలు ముందు జాగ్రత్త చర్యగా నిల్వలు పెంచుకోవడం వల్ల ధరలు 30 నుంచి 50 శాతం వరకు ఎగిసే అవకాశం ఉందని చెప్పారు. తీవ్రమైన ఉత్పత్తి నష్టాలు, విస్తృతమైన ఎగుమతి నిషేధాలు, పానిక్ బైయింగ్ చోటు చేసుకుంటే మాత్రం గ్లోబల్ మార్కెట్‌లో బియ్యం ధరలు ఇప్పుడున్న ధరలకు రెట్టింపు అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ప్రపంచ బియ్యం మార్కెట్‌ను స్థిరీకరించడంలో భారత్ పాత్ర అత్యంత కీలమని అధ్యయనం స్పష్టం చేసింది. ఉత్పత్తి, ఎగుమతులు, ప్రభుత్వ ఆహార ధాన్యాల నిల్వల్లో భారత్ అగ్రగామిగా ఉండటమే ఇందుకు ప్రధాన కారణమన్నారు. అయితే, దేశీయ అవసరాలరీత్యా భారత్ మళ్లీ ఎగుమతులపై ఆంక్షలు విధిస్తే.. అది అంతర్జాతీయ మార్కెట్లో ధరల పెరుగుదలను మరింత వేగవంతం చేస్తుందని హెచ్చరించారు.ఎలాంటి సంక్షోభాలనైనా ఎదుర్కొనేందుకు అంతర్జాతీయ సహకారం, పారదర్శకమైన వాణిజ్య విధానాలు, ఎప్పటికప్పుడు సరైన మార్కెట్ సమాచారం అందుబాటులో ఉండటం చాలా అవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే నిత్యవసర ధరలు ఆకాశన్నంటుతున్న తరుణంలో ఇప్పుడు బియ్యం ధరలు కూడా పెరిగితే సామాన్యుల జీవనం కష్టతరమవుతుందని అంటున్నారు. ఇలా అయితే జీవించటం కష్టమేనని అంటున్నారు.పంట ఉత్పత్తి సాధారణంగా ఉండి, భారీ కొనుగోళ్లు జరగకపోతే ధరలు10-20 శాతం వరకు మాత్రమే పెరగొచ్చని పేర్కొంది. అయితే ప్రస్తుతం ఎక్కువ అవకాశాలు ఉన్న పరిస్థితిలో.. మోస్తరు దిగుబడి తగ్గుదల, నిల్వల పెరుగుదల కారణంగా ధరలు 30-50 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని తెలిపింది. ఒకవేళ ఎగుమతి ఆంక్షలు, భయంతో భారీ కొనుగోళ్లు జరిగితే ప్రపంచ బియ్యం ధరలు రెట్టింపు అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది. రానున్న ఖరీఫ్ పంట ఆశించిన స్థాయిలో వస్తే బియ్యం ధరలు క్రమంగా తగ్గే అవకాశం ఉందని వ్యాపారులు భావిస్తున్నారు. అయితే ఎల్‌నినో ప్రభావం కొనసాగడం, నిల్వలు పెరగడం వంటి అంశాలు కొనసాగితే వినియోగదారులపై ధరల భారం మరింత పెరిగే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఇంకా తేలని రాష్ట్రాల పంచాయితీ

పుష్కర కాలమైన బదిలీ కాని ఆస్తులు

హైదరాబాద్ : రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్లైనా ఇంకా రెండు రాష్ట్రాల మధ్య ప్రభుత్వ భవనాల పంపకాలు పూర్తి కాలేదు. హైదరాబాద్‌లో ఉన్న ప్రభుత్వ భవనాలను ఆంధ్రప్రదేశ్ సర్కార్ ఇంకా తెలంగాణకు అప్పగించలేదు. కొన్ని భవనాలను ఖాళీ చేసినప్పటికీ వాటిని అప్పగించలేదు. మరికొన్ని భవనాల్లో ఏపీ ఉద్యోగులు కొనసాగుతున్నారు. లేక్ వ్యూ గెస్ట్ హౌస్ సహా కీలక ఆస్తుల బదిలీ కూడా పెండింగ్‌లోనే ఉంది. ఆస్తుల విభజన, నదీ జలాల పంపకం వంటి అంశాలు ఇంకా పరిష్కారం కాకపోవడంతో రెండు రాష్ట్రాల మధ్య విభజన సమస్యలు కొనసాగుతున్నాయి.ఆంధ్రప్రదేశ్ పునర్విభజన జరిగి పుష్కర కాలం పూర్తి అయిపోయింది. హైదరాబాద్ నగరం ఉమ్మడి రాజధానిగా 10 ఏళ్ల పాటు కొనసాగింది. ఆ గడువు కూడా తీరిపోయి 2 ఏళ్లు గడిచింది. అయితే ఈ 12 ఏళ్లు పూర్తి అయినా రెండు రాష్ట్రాల మధ్య ఆస్తుల విభజన అంశం ఇంకా పూర్తిగా పరిష్కారం కాలేదు. అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలంగాణ మధ్య పలు సమస్యలు ఇంకా అపరిష్కృతంగానే ఉంటున్నాయి. మరీ ముఖ్యంగా హైదరాబాద్‌లోని ప్రభుత్వ భవనాల బదిలీ ముందుకు సాగడం లేదు.ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం హైదరాబాద్‌లోని మొత్తం 2,565 ప్రభుత్వ భవనాల్లో 589 భవనాలను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించారు. మిగిలిన 1,976 భవనాలను తెలంగాణకు అప్పగించారు. అయితే ఉమ్మడి రాజధాని గడువు ముగిసిన తర్వాత ఈ భవనాలను తెలంగాణకు అప్పగించాలని అప్పుడే తేల్చి చెప్పారు. కానీ ఇప్పటి వరకు ఆ ప్రక్రియ మాత్రం ప్రారంభం కాలేదు.పాటిగడ్డ, బంజారాహిల్స్, కుందన్‌బాగ్, ఎర్రమంజిల్, సైఫాబాద్, మలక్‌పేట్, ఖలాదేరా, మదన్నపేట వంటి ప్రాంతాల్లో ఉన్న ఈ భవనాలు ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగుతున్నాయి. తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ ఇచ్చిన సమాచారం ప్రకారం.. మొత్తం 589 భవనాల్లో 221 భవనాల్లో ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులు ఉండగా.. మరో 368 భవనాలను వారు ఖాళీ చేసినప్పటికీ తెలంగాణ ప్రభుత్వానికి మాత్రం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా అప్పగించలేదు.రాష్ట్ర విభజన జరిగిన తర్వాత పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిష్కరించేందుకు 2024 జూలై 6వ తేదీన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

సమావేశం అయి చర్చించారు. అనంతరం అధికారులు, మంత్రుల కమిటీలను ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు ప్రారంభించినట్లు చెప్పారు. అయితే ఈ మీటింగ్ జరిగి కూడా 2 ఏళ్లు గడిచినా ఆస్తుల పంపకాల విషయంలో ఎలాంటి పురోగతి కనిపించలేదు.

లేక్ వ్యూ గెస్ట్ హౌస్ వంటి కీలక ప్రభుత్వ భవనాల బదిలీ కూడా ఏపీ, తెలంగాణ మధ్య వివాదంగానే కొనసాగుతోంది. ఈ భవనాన్ని తిరిగి అప్పగించాలని తెలంగాణ ప్రభుత్వం కోరగా.. షెడ్యూల్-9, షెడ్యూల్-10 కింద ఆస్తుల విభజనతోపాటు ఇతర పెండింగ్ అంశాలు ఇంకా పరిష్కారం కాలేదని పేర్కొంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ ఏడాది మార్చిలో ఆ విజ్ఞప్తిని తిరస్కరించింది. ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్ ఆధీనంలో ఉన్న భవనాల్లో మలక్‌పేట్‌లోనే అత్యధికంగా 308 భవనాలు ఉన్నాయి. పాటిగడ్డలో 95, ఎర్రమంజిల్‌లో 67, కుందన్‌బాగ్‌లో 44, బంజారాహిల్స్‌లో 33, ఖలాదేరాలో 13, సైఫాబాద్‌లో 12, పంజాగుట్టలో 9, మదన్నపేటలో 8 భవనాలు ఇప్పటికీ ఏపీ వద్దే ఉన్నాయి. ఆస్తుల విభజనతో పాటు నదీ జలాల పంపకం, ప్రాజెక్టుల అనుమతులు వంటి పలు కీలక అంశాలు కూడా ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. దీంతో రాష్ట్ర విభజనకు సంబంధించిన ప్రధాన సమస్యలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

డిఫెన్స్‌లో మోడీ

న్యూఢిల్లీ : కేంద్రంలో రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. ఇటీవల జెన్ జీ ఆందోళనను ఆసరా చేసుకుని రాహుల్ కేంద్రంపై విరుచుకు పడేందుకు ప్రయత్నిస్తున్నారు. మ్యాగ్జిమం ప్రెషర్ వ్యూహాన్ని రెడీ చేసుకున్నారు. జెన్-జీ విద్యార్థుల నిరసనల తీవ్రతకు, ప్రతిపక్షాల వరుస ఆందోళనలకు లొంగి కేంద్రం విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయించారు. ప్రధాని మోదీ హయాంలో కేంద్రం ఇంతటి తీవ్ర ఆత్మరక్షణ ధోరణిలోకి వెళ్లడం ఇదే తొలిసారి. ఈ పరిణామాన్ని తమకు లభించిన అతిపెద్ద విజయంగా భావిస్తున్న రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ద్వయం.. ఇప్పుడు తమ దాడులను నేరుగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాపైకి మళ్లించారుపార్లమెంట్ లోపల, బయట రాహుల్ గాంధీ తీవ్రమైన ఆరోపణలు గుప్పిస్తూ రాజకీయ వేడిని పెంచారు. విద్యార్థుల ఆందోళనలపై పోలీసుల చర్యలను ప్రస్తావి విద్యార్థుల

శరీరంపైకి పెల్లెట్లు, బుల్లెట్లు వేయించింది అమిత్ షానే అంటూ రాహుల్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. సభలో మాట్లాడేందుకు పూర్తి అవకాశం ఇవ్వలేదని ఆరోపిస్తూ బయటకు వచ్చి విలేకరుల సమావేశం పెట్టి, జెన్-జీ తరాన్ని రెచ్చగొట్టేలా నేరుగా హోంమంత్రినే టార్గెట్ చేయడం ప్రతిపక్షం మార్చుకున్న దూకుడు వైఖరికి నిదర్శనం. సభలో ప్రియాంక గాంధీ సైతం ఇదే తరహా దూకుడును ప్రదర్శిస్తుండటంతో.. పార్లమెంట్‌లో ప్రతిపక్షం ఎటాక్ మోడ్‌లోకి వెళ్లగా, అధికార పక్షం కౌంటర్ ఇచ్చుకోవడానికి కష్టపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరో వైపు ప్రధాన్‌ను మార్చేసినట్లుగా ప్రధానిని మార్చేస్తామని కాక్రోచ్ పార్టీ ప్రెసిడెంట్ దీప్కే హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ప్రధాని మోదీ ఇన్ ఫ్లూయన్సర్‌గా మారాలని మాట్లాడుతున్నారు. వారి వెనుక ఆమ్ ఆద్మీ వంటి పార్టీలు ఉన్నాయి. ఆ విషయం బహిరంగంగా చెప్పుకోవడం లేదు. బీజేపీకి తెలుసు. కానీ ఇలాంటి వారికి బలం ఇచ్చింది బీజేపీ డిఫెన్సివ్ ధోరణినే. అందుకే భరించక తప్పడం లేదు.దశాబ్దాలుగా ఎలక్షన్ మెషినరీని, పార్లమెంటరీ వ్యూహాలను శాసిస్తున్న బీజేపీ, మోదీ-షా ద్వయం ఈ ఒత్తిడిని ఎదుర్కొనేందుకు స్వంత శైలిలో కౌంటర్ స్ట్రాటజీని అమలు చేస్తోంది. అమిత్ షాపై రాహుల్ గాంధీ చేసిన పెల్లెట్ ప్రయోగం ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని, పార్లమెంట్ వేదికగా క్షమాపణ చెప్పాలని బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, జితేంద్ర సింగ్‌లు సభలో తీవ్రంగా నిలదీశారు. రూల్ బుక్ ఆధారంగా స్పీకర్ చేత ఆ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించేలా చేయడంలో సఫలమ య్యారు. డిఫెన్సివ్‌గా కనిపిస్తూనే, మరోవైపు ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ బిల్ వంటి జాతీయ భద్రతా బిల్లులను పార్లమెంట్‌లో ఆమోదింపజేసుకుంటూ.. తాము నేషనల్ సెక్యూరిటీ విషయంలో రాజీపడేదే లేదని, ఓటు బ్యాంక్ రాజకీయాలకు లొంగబోమని తమ శ్రేణులకు సంకేతాలు ఇస్తున్నారు. రాహుల్ గాంధీ విద్యార్థులను, యువతను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటూ దేశంలో అశాంతిని రేపుతున్నారని, ఆర్ఎస్ఎస్ , విద్యావ్యవస్థపై బురద జల్లుతున్నారని బీజేపీ మీడియా విభాగాలు విస్తృత ప్రచారం మొదలుపెట్టాయి. కానీ ఇవన్నీ అంతగా ప్రజల్లోకి వెళ్లడం లేదు.అత్యధిక సీట్లతో తిరుగులేని బలంతో ఉన్నప్పటికీ.. జెన్ జీ యువత ఆలోచనలు, బీజేపీకి అంత తేలికైన విషయమేమీ కాదు.

రంగనాథ్‌కు మద్దతుగా రేవంత్



హైదరాబాద్ : హైదరాబాద్ నగర రూపురేఖలను మారుస్తామని.. చెరువులు, ఆక్రమణలను ఉపేక్షించేది లేదని కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా హైడ్రా ను తెరపైకి తెచ్చింది. అయితే ఇప్పుడిది రాజకీయంగా, న్యాయపరంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోంది. హైడ్రాను సీఎం రేవంత్ రెడ్డి తన 'బ్రెయిన్ చైల్డ్'గా భావిస్తుంటారు. అందుకే హైడ్రా కమిషనర్‌గా సమర్థుడిగా పేరొందిన ఐపీఎస్ అధికారి రంగనాథ్‌ను నియమించి, అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపారు. అయితే, ఇటీవల హైకోర్టు రంగనాథ్ కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని, ఆయనను ఆ పదవి నుంచి తొలగించాలని ఆదేశించడంతో ఈ ఉదంతం ఒక్కసారిగా కీలక మలుపు తిరిగింది. హైకోర్టు ఆదేశాలతో ప్రభుత్వం డిఫెన్స్‌లో పడినట్లే కనిపించినా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ఈ అంశంలో అంగుళం కూడా వెనక్కి తగ్గడానికి సిద్ధంగా లేరు. ఎలాగైనా రంగనాథ్‌నే అదే పదవిలో కొనసాగించాలనే దిశగా కాంగ్రెస్ సర్కార్ వేగంగా అడుగులు వేస్తోంది. కోర్టు తీర్పు వెలువడిన వెంటనే ప్రభుత్వ యంత్రాంగం రంగంలోకి దిగింది. అధికారుల నియామకం, బదిలీలు అనేది సంపూర్ణంగా ప్రభుత్వం పరిధిలోని అంశమని, ఇందులో కోర్టు జోక్యం సరికాదనే బలమైన వాదనను వినిపించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయ నిపుణులతో వరుస సమావేశాలు నిర్వహించి లీగల్ ఆప్షన్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన నుంచి తిరిగి రాగానే దీనిపై తుది సమీక్ష నిర్వహించి, హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించేందుకు పక్కా ప్రణాళికలు రచిస్తున్నారు. కోర్టు ఆదేశాలపై స్టే తెచ్చుకోవడమే కాకుండా, రంగనాథ్ బాధ్యతలను యథాతథంగా కొనసాగించేలా న్యాయపోరాటం చేయాలని ప్రభుత్వం గట్టి పట్టుదలతో ఉంది.రాజకీయ కోణంలో చూస్తే, హైడ్రా అనేది కేవలం ఒక ప్రభుత్వ విభాగానికో లేదా ఆక్రమణల తొలగింపుకో పరిమితమైన అంశం కాదు. ఇది రేవంత్ రెడ్డి పొలిటికల్ ఇమేజ్‌తో నేరుగా ముడిపడి ఉంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రేవంత్ రెడ్డి అత్యంత ఆవేశంగా, పట్టుదలతో ముందుకు తీసుకెళ్లిన ప్రాజెక్ట్ హైడ్రా. ఇప్పుడు కోర్టు ఉత్తర్వుల కారణంగా వెనకడుగు వేస్తే, అది ప్రతిపక్షాలైన బిఆర్ఎస్, బీజేపీలకు పెద్ద ఆయుధంగా మారుతుంది. అధికారుల నియామకంలో కోర్టుల ఆదేశాలకు తలొగ్గితే, భవిష్యత్తులో పరిపాలనాపరమైన నిర్ణయాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. హైడ్రా లక్ష్యాలను నిర్భయంగా అమలు చేయడంలో రంగనాథ్ చూపిన చొరవ రేవంత్‌కు బాగా నచ్చింది. ఆయనను తొలగిస్తే పథకం వేగం మందగిస్తుందనేది సర్కార్ భయం.న్యాయస్థానాలు కోర్టు ఉత్తర్వులను గౌరవించాల్సిన ఆవశ్యకతను నొక్కిచెబుతుంటే, ప్రభుత్వం మాత్రం తమ పరిపాలనాధికారాలను కాపాడుకునే ప్రయత్నం చేస్తోంది. ఒకవైపు చట్టబద్ధత, కోర్టు ధిక్కరణ ఆరోపణలు, మరోవైపు రాజకీయ వ్యూహాలు, ప్రభుత్వ పట్టుదల.. ఈ రెండింటి నడుమ హైడ్రా వ్యవహారం ఇప్పుడు అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.డివిజన్ బెంచ్‌లో ప్రభుత్వం వినిపించే వాదనలు ఎంతవరకు నిలబడతాయి? కోర్టు రంగనాథ్ నియామకంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? అనేది వేచి చూడాలి. ఏది ఏమైనా, రేవంత్ రెడ్డి తీసుకోబోయే తుది నిర్ణయం తెలంగాణ రాజకీయాల్లోనూ, అధికారుల నియామక ప్రక్రియల్లోనూ ఒక కొత్త చర్చకు దారితీయడం ఖాయం

అమరావతి, మావిగన్‌కు పెద్ద తేడా లేదా ?

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణం, రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ ప్రాజెక్టుల పురోగతిపై ఇటీవల నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేసిన కీలక వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త చర్చకు తెరలేపాయి. అమరావతి అంటే కేవలం 29 గ్రామాల సముదాయం మాత్రమే కాదు.. విజయవాడ, గుంటూరు నగరాలతో అనుసంధానమైన సమగ్ర బృహత్ రాజధాని ప్రాంతం అంటూ చంద్రబాబు ఇచ్చిన స్పష్టత, అమరావతి బ్రాండ్‌ను పునర్నిర్మించే వ్యూహాత్మక అడుగుగా కనిపిస్తోంది. విజయవాడ-గుంటూరు-అమరావతిలను కలిపి ఒక మెగా మెట్రోపాలిటన్ రీజియన్‌గా తీర్చిదిద్దడమే ఏపీ భవిష్యత్ ఆర్థిక, సామాజిక దిశను నిర్దేశించే అసలైన మాస్టర్ ప్లాన్ అని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.ఈ ప్రకటన వెనుక విస్తృతమైన రాజకీయ, నరేటివ్ పోరాటం దాగి ఉంది. గత కొద్దికాలంగా అమరావతి బ్రాండ్ ఇమేజ్‌ను తగ్గించేందుకు ప్రతిపక్ష వైఎస్సార్సీపీ నిరంతరం కౌంటర్ నెరేటివ్‌ను నడుపుతోంది. జగన్ మావిగన్ ప్రతిపాదన తెచ్చారు. మావిగన్‌లో మ అంటే మచిలిపట్నం..మిగతా రెండు విజయవాడ, గుంటూరు. ఇప్పుడు చంద్రబాబు చెప్పిన దాంట్లో మచిలీపట్నం లేదు. మిగతా అంతా సేమ్. మాది విజన్, మీది కేవలం 29 గ్రామాల రియల్ ఎస్టేట్ మోడల్ అని చిత్రీకరించే ప్రయత్నం చేయడం ద్వారా రాజధానిపై ప్రజల్లో గందరగోళం సృష్టించడమే వైఎస్సార్సీపీ ప్రధాన రాజకీయ వ్యూహంగా మారింది. దీనికి చెక్ పెడుతూనే, సాధారణ ప్రజల్లో ఉన్న సంకోచాలను తొలగించేందుకు చంద్రబాబు ఈ త్రివేణీ సంగమం ఫార్ములాను తెరపైకి తెచ్చారు. కేవలం 29 గ్రామాలలోని కోర్ క్యాపిటల్ ఏరియానే రాజధానిగా ప్రచారం కావడం వల్ల రాయలసీమ, ఉత్తరాంధ్ర లేదా పల్నాడు ప్రజల్లో ఇది అందరి రాజధాని కాదు అనే భావన కలిగే ప్రమాదం ఉంది. అందుకే, విజయవాడ, గుంటూరు నగరాల ఆర్థిక వ్యవస్థను, మౌలిక వసతులను అమరావతితో ఐక్యపరిచి, 80 లక్షలకు పైగా జనాభాను కవర్ చేసే ఒక విశ్వనగరంగా డెవలప్ చేస్తామని చెప్పడం ద్వారా ఈ ప్రాజెక్టుకు ప్రాంతీయ ఆమోదాన్ని పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది.రూ.50,999 కోట్ల విలువైన 95 మౌలిక వసతుల ప్రాజెక్టులతో అమరావతిలో పనులు పునఃప్రారంభమైన వేళ, ప్రతినెల కనీసం 7.92 శాతం పురోగతి సాధించాలని చంద్రబాబు క్షేత్రస్థాయి అధికారులకు నిర్దేశించిన గడువు కేవలం నిర్మాణ వేగాన్ని సూచించడమే కాకుండా.. పనులను వేగవంతం చేసి స్పీడ్, క్వాలిటీ, డెలివరీ సూత్రంతో ప్రతిపక్షాల నోళ్లు మూయించాలనే పట్టుదలను ప్రతిబింబిస్తోంది. ప్రతిపక్షాలు ఇది సాధ్యం కాని కల, కేవలం భూముల ప్రకటనలు మాత్రమే అని విమర్శిస్తుండగా, ప్రభుత్వం మాత్రం ఇది అమరావతి విజన్ 2.0 అని గట్టిగా నమ్ముతోంది.మరోవైపు, వైఎస్సార్సీపీ ఈ పరిణామాలను తమకు అనుకూలంగా మార్చుకోవడానికి ప్రయత్నిస్తోంది.

జగన్ చెప్పిన మావిగన్ రూట్‌లోకే చంద్ర బాబు వస్తున్నారని జగన్ విజనరీ అంటున్నారు. ఇప్పుడు అమరావతి అంటే 29 గ్రామాలు కాదని, విజయవాడ- గుంటూరుతో పాటు మచిలీపట్నాన్ని కూడా కలపాల్సిందే అని వైసీపీ సోషల్ మీడియా విభాగాలు ప్రచారం వేగవంతం చేశాయి. అంటే ఎలా చూసినా అమరావతి, మావిగన్‌కు పెద్ద తేడా లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సీఆర్డీఏ గ్రామీణ పరిధులను, మచిలీపట్నం పోర్ట్ కనెక్టివిటీని తెరపైకి తెస్తూ.. అమరావతి నిర్మాణంలో జాప్యాన్ని కప్పిపుచ్చు కోవడానికే చంద్రబాబు ఈ కొత్త మెట్రోపాలిటన్ డెఫినిషన్‌ను తెరపైకి తెచ్చారనేది వైసీపీ ప్రధాన ఆరోపణ. రాజధాని అమరావతి ప్రాంతం కేవలం భౌగోళిక నిర్మాణం కాక ఏపీ భవిష్యత్ ఆర్థిక ఇంజిన్ కాబోతుందా లేదా రాజకీయ వివాదాల నిలయంగా మిగిలిపోతుందా అనేది రాబోయే రెండేళ్లలో పనుల పురోగతి , పైనే ఆధారపడి ఉంటుంది.

భారతికి కీలక బాధ్యతలు

కడప : వైసీపీలో అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాత్ర ఎంత కీలకమో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు ఆయన నాయకత్వమే ప్రధాన బలంగా నిలిచింది. పార్టీ విజయాలు, పరాజయాలు, రాజకీయ నిర్ణయాలు అన్నీ కూడా జగన్ చుట్టూనే తిరిగాయి. అయితే మారుతున్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో పార్టీ నిర్వహణలో మరో కీలక నాయకత్వం అవసరమనే చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.గతంలో విజయసాయిరెడ్డి పార్టీ వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించారని భావించేవారు. ఆయన పార్టీకి దూరమైన తర్వాత ఆ బాధ్యతలను సజ్జల రామకృష్ణారెడ్డి సమన్వయం చేస్తున్నారని ప్రచారం ఉన్నప్పటికీ, పార్టీ అంతర్గత వ్యవహారాల్లో ఇంకా మార్పులు అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు నేతలు కోటరీ రాజకీయాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారనే ప్రచారం కూడా సాగుతోంది.ఈ పరిస్థితుల్లో భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని జగన్ కొత్త వ్యూహం సిద్ధం చేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. రానున్న సంవత్సరాల్లో ఆయన ప్రజల మధ్య ఎక్కువ సమయం గడపాలని, రాష్ట్రవ్యాప్తంగా విస్తృత పర్యటనలు చేపట్టాలని భావిస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. అలాంటి సమయంలో పార్టీ రోజువారీ వ్యవహారాలను చూసుకునే నమ్మకమైన నాయకత్వం అవసరమని ఆయన భావిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. జగన్ సతీమణి వైఎస్ భారతి పేరు ఎక్కువగా వినిపిస్తోంది. కుటుంబ సభ్యురాలు కావడం, సంస్థాగత వ్యవహారాలపై అవగాహన ఉండడం, నాయకత్వంపై పూర్తి విశ్వాసం ఉండడం వంటి కారణాలతో ఆమెకు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇతర నేతలకు అలాంటి బాధ్యతలు ఇస్తే అంతర్గత విభేదాలు వచ్చే అవకాశం ఉంటుందని కొందరు అభిప్రాయపడుతుండగా,



భారతి అయితే అందరినీ సమన్వయం చేయగలరని కూడా అంటున్నారు.ఇప్పటి వరకు భారతి ప్రత్యక్ష రాజకీయాల్లో పెద్దగా చురుకుగా కనిపించలేదు. అయితే ఎన్నికల సమయంలో పులివెందుల ప్రాంతంలో జగన్ తరఫున ప్రచారం నిర్వహించిన సందర్భాలు ఉన్నాయి. అలాగే వ్యాపార, సంస్థాగత అంశాల నిర్వహణలో ఆమెకు అనుభవం ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ అనుభవం పార్టీ నిర్వహణలో కూడా ఉపయోగపడుతుందని కొందరు విశ్లేషిస్తున్నారు.రానున్న సాధారణ ఎన్నికల్లో కడప లోక్‌సభ స్థానం నుంచి భారతిని పోటీ చేయించే అవకాశాన్ని జగన్ పరిశీలిస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్న వైఎస్ అవినాష్ రెడ్డి ఇప్పటికే వరుస విజయాలు నమోదు చేశారు. అయితే భవిష్యత్తులో భారతిని బరిలోకి దింపితే ఆ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ స్థానాలపై కూడా పార్టీకి మరింత బలం చేకూరుతుందనే అంచనాలు కొందరు వ్యక్తం చేస్తున్నారు.అయితే ఇవన్నీ ఇప్పటికైతే అధికారికంగా ధృవీకరించబడిన విషయాలు కావు. పార్టీ నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

మూడేళ్లలో ఎయుఎంను 1.5 బిలియన్ డాలర్లకు రెట్టింపు చేయనున్న అర్ధ భారత్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్; ప్రపంచవ్యాప్త విస్తరణ ప్రణాళిక ప్రకటింపు

- గిఫ్ట్ సిటీలోని ప్రముఖ ఫండ్ మేనేజ్‌మెంట్ సంస్థ మూడు దిశల్లో వృద్ధి ప్రణాళికను ప్రకటించింది

- ఉత్పత్తుల విస్తరణ, అంతర్జాతీయ మార్కెట్లలో విస్తరణ, కొత్త పెట్టుబడిదారుల వర్గాలపై దృష్టి

గాంధీనగర్/ముంబై, జూలై 31 (ప్రజా కలం ప్రతినిధి)

గిఫ్ట్ సిటీలో ప్రధాన కార్యాలయం కలిగిన ప్రముఖ ఫండ్ మేనేజ్‌మెంట్ సంస్థ అర్ధ భారత్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ ఐఎఫ్ఎస్‌సీ ఎల్ఎల్‌పీ, గిఫ్ట్ సిటీలో తన కార్యకలాపాలను ప్రారంభించి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా, రాబోయే మూడు సంవత్సరాల్లో తమ నిర్వహణలోని మొత్తం ఆస్తుల (ఎయుఎం) విలువను 750 మిలియన్ డాలర్ల నుంచి 1.5 బిలియన్ డాలర్లకు రెండింతలు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు నేడు ప్రకటించింది.

ఆస్తి వర్గాల్లో భిన్నమైన, అధిక విలువ సృష్టించే పెట్టుబడి అవకాశాలను అందించడంపై దృష్టి సారించిన ఈ ఫండ్ మేనేజ్‌మెంట్ సంస్థ, తన ఉత్పత్తుల శ్రేణిని విస్తరించడం, అంతర్జాతీయ స్థాయిలో తన ఉనికిని మరింత బలోపేతం చేయడం, అలాగే కొత్త భౌగోళిక ప్రాంతాలు మరియు కొత్త పెట్టుబడిదారుల వర్గాలను లక్ష్యంగా చేసుకోవడం అనే మూడు ప్రధాన అంశాలపై ఆధారిత విస్తరణ వ్యూహాన్ని ప్రకటించింది.

ఇన్ఫోగ్రాఫిక్

ముఖ్యాంశాలు

ఎయుఎం లక్ష్యం: రాబోయే మూడు సంవత్సరాల్లో నిర్వహణలోని మొత్తం ఆస్తుల (ఎయుఎం) విలువను 750 మిలియన్ డాలర్ల నుంచి 1.5 బిలియన్ డాలర్లకు రెండింతలు పెంచే ప్రణాళిక.

ఉత్పత్తుల విస్తరణ: డాలర్-నామినేటెడ్ రుణ ఆధారిత రెండు ఉత్పత్తులతో పాటు, కమోడిటీ/విలువైన లోహాల ఆర్బిట్రాజ్ ఫండ్, గ్లోబల్ ఈక్విటీ ఫండ్‌ను ప్రారంభించనున్న ప్రణాళిక.

అంతర్జాతీయ విస్తరణ: మధ్యప్రాచ్య దేశాలతో పాటు మారిషస్, సింగపూర్ వంటి అంతర్జాతీయ ఆర్థిక కేంద్రాల్లో అదనపు కార్యాలయాలను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తోంది.

భారతీయ పెట్టుబడిదారులకు విస్తృత ప్రాప్యత: ఫండ్ డిస్ట్రిబ్యూటర్లు, బ్యాంకుల ద్వారా భారతీయ పెట్టుబడిదారులకు తమ గ్లోబల్ పెట్టుబడి ఉత్పత్తులను మరింత అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తోంది. అలాగే ఈ ఏడాదిలోనే ముంబై, ఢిల్లీ, బెంగళూరు, కోల్‌కతాల్లో కొత్త పెట్టుబడిదారుల సంబంధాలు, వంపిణీ కార్యాలయాలను ప్రారంభించనుంది.

గిఫ్ట్ సిటీ విస్తరణ: అదనంగా 3,300 చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని ఏర్పాటు చేసి, 100 మంది వరకు పనిచేసే సామర్థ్యాన్ని కల్పించనుంది. గిఫ్ట్ సిటీపై దీర్ఘకాలిక నిబద్ధత: గిఫ్ట్ సిటీలో నిర్మాణంలో ఉన్న శిల్ప్ ట్విన్ టవర్లో 12,000 చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది.

ఉత్పత్తుల పనితీరు: సంస్థ ప్రారంభించిన తొలి ఫండ్, ప్రారంభమైన తొలి మూడేళ్లలోనే పెట్టుబడిదారులకు ఆరు రెట్లు (6శ) రాబడిని అందించింది.

గిఫ్ట్ సిటీలో అర్ధ భారత్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ వృద్ధి ప్రస్థానం

గిఫ్ట్ సిటీలో కార్యకలాపాలను ప్రారంభించిన రెండేళ్లలోనే అర్ధ భారత్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ ఒకే ఫండ్‌తో ప్రారంభమైన వేదిక నుంచి ఆరు ఫండ్లను నిర్వహించే సంస్థగా ఎదిగింది. అదే సమయంలో, తన బృందాన్ని గణనీయంగా విస్తరించడంతో పాటు కార్యాలయ మౌలిక సదుపాయాలను కూడా మరింత బలోపేతం చేసింది.

అర్ధ భారత్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ ఐఎఫ్ఎస్‌సీ ఎల్ఎల్‌పీ మేనేజింగ్ పార్ట్నర్ సచిన్ సావ్రికర్ మాట్లాడుతూ, ''మా రెండో వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న ఈ సందర్భంగా, ఇంకా బాల్యదశలోనే ఉన్న మా ఔత్సాహిక వ్యాపార ప్రయాణం విశేషంగా అభివృద్ధి చెందింది. ఒకే ఒక్క ఫండ్‌తో ప్రారంభమైన మా సంస్థ నేడు ఆరు ఫండ్ల స్థాయికి చేరుకుంది. ఇద్దరు సభ్యులతో స్వయం నమీకృత (బూట్‌స్ట్రాప్డ్) స్టార్టప్‌గా ప్రారంభమైన మా బృందం ఇప్పుడు దానికి పది రెట్లు విస్తరించింది. అలాగే, కో-వర్కింగ్ స్పేస్‌లోని నాలుగు సీట్ల యూనిట్ నుంచి ప్రస్తుతం 2,345 చదరపు అడుగుల విస్తీర్ణంలో 60 మంది కూర్చునే సామర్థ్యం కలిగిన కార్యాలయానికి ఎదిగాం'' అని తెలిపారు.

ఈ కాలంలో, అర్ధ భారత్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ భారతదేశంలోని ఏకైక ఆఫ్‌షోర్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్ అయిన గిఫ్ట్ సిటీలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న అతిపెద్ద ఫండ్ మేనేజ్‌మెంట్ సంస్థల్లో ఒకటిగా అవతరించింది. అంతేకాకుండా, థర్డ్-పార్టీ ఫండ్ మేనేజ్‌మెంట్ సేవలను అందించేందుకు లైసెన్స్ పొందిన తొలి సంస్థగా, అలాగే భౌతిక కమోడిటీ ఆధారిత గోల్డ్ ఫండ్‌ను ప్రారంభించిన తొలి ఫండ్ హౌస్‌గా కూడా గుర్తింపు పొందింది.

భవిష్యత్ వృద్ధికి మద్దతుగా గిఫ్ట్ సిటీలో విస్తరణ

తదుపరి దశ వృద్ధి వ్యూహంలో భాగంగా, అర్ధ భారత్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ గిఫ్ట్ సిటీలోని తన కార్యాలయ విస్తీర్ణాన్ని మరింత పెంచుతోంది. సచిన్ సావ్రికర్ మాట్లాడుతూ, ''రెండో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న ఈ సమయంలో, మరింత వేగవంతమైన వృద్ధికి మేము సిద్ధమవుతున్నాం. వ్యాపార విస్తరణ ప్రణాళికలకు మద్దతుగా, ప్రస్తుతం గిఫ్ట్ సిటీలో ఉన్న 2,400 చదరపు అడుగుల కంటే తక్కువ కార్యాలయ స్థలానికి అదనంగా 3,300 చదరపు అడుగుల స్థలాన్ని జోడిస్తూ, మా కార్యాలయ విస్తీర్ణాన్ని రెండింతలకు పైగా పెంచుతున్నాం. ఈ విస్తరించిన మౌలిక సదుపాయాలు రాబోయే మూడు సంవత్సరాల్లో 100 మంది వరకు పనిచేసే సామర్థ్యంతో మా అవసరాలను సమర్థంగా తీర్చగలవు'' అని తెలిపారు. ఈ కొత్త కార్యాలయ స్థలం గిఫ్ట్ సిటీలోని ప్రీమియం గ్రేడ్-ఏ వాణిజ్య భవనం ఫ్లెక్స్‌వన్ ఐదో అంతస్తులో ఏర్పాటు చేయబడుతోంది.

సచిన్ సావ్రికర్ ఇంకా మాట్లాడుతూ, ''గిఫ్ట్ సిటీ వల్ల మా నిబద్ధత దీర్ఘకాలికమైనది. ఈ ప్రాంతంలో గిఫ్ట్ సిటీని అగ్రశ్రేణి అంతర్జాతీయ ఆర్థిక సేవల కేంద్రంగా తీర్చిదిద్దడంలో మా వంతు పాత్రను పోషించాలని మేము భావిస్తున్నాం. అందుకే, ప్రస్తుతం ప్రారంభిస్తున్న విస్తరించిన పెట్టుబడి మూలధనాన్ని మరింత విస్తృత స్థాయిలో ఆకర్షించడంతో పాటు, ప్రపంచస్థాయి ప్రముఖ ఫండ్ మేనేజ్‌మెంట్ వేదికగా తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది.

భారతీయ పెట్టుబడిదారులు, కొత్త పెట్టుబడిదారుల వర్గాలపై ఫండ్ హౌస్ దృష్టి

అర్ధ భారత్ వృద్ధి వ్యూహంలోని మూడో ప్రధాన స్తంభం, కొత్త భౌగోళిక ప్రాంతాలు మరియు కొత్త పెట్టుబడిదారుల వర్గాలను లక్ష్యంగా చేసుకుని తన పెట్టుబడిదారుల స్థావరాన్ని విస్తరించడంపై కేంద్రీకృతమై ఉంది. సచిన్ సావ్రికర్ మాట్లాడుతూ, ''ఇప్పటివరకు మా అన్ని ఫండ్‌లు భారతదేశం వెలుపల ఉన్న పెట్టుబడిదారుల నుంచి నిధులను సమీకరించడంపైనే దృష్టి సారించాయి. ఇకపై మా ఫండ్‌లను దేశీయ పెట్టుబడిదారులకు కూడా అందుబాటులోకి తీసుకురావాలని మేము లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆల్ఫా సృష్టిపై దృష్టి సారించిన మా ప్రత్యేక పెట్టుబడి ఉత్పత్తుల ద్వారా, వివిధ ఆస్తి వర్గాల్లోని గ్లోబల్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టే అవకాశాన్ని భారతీయ పెట్టుబడిదారులకు కల్పించాలనుకుంటున్నాం. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు, మా పెట్టుబడి పథకాలను తమ దేశీయ ఖాతాదారులకు అందించేందుకు పలువురు ఫండ్ డిస్ట్రిబ్యూటర్లు, బ్యాంకులతో ప్రస్తుతం చర్చలు జరుపుతున్నాం'' అని తెలిపారు. ఈ విస్తరణ కార్యక్రమానికి మరింత బలం చేకూర్చేందుకు, అర్ధ భారత్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ ముంబై, ఢిల్లీ, బెంగళూరు, కోల్‌కతా వంటి ప్రధాన మహానగరాల్లో పెట్టుబడిదారుల సంబంధాలు మరియు వంపిణీ కార్యాలయాలను ప్రారంభించనున్నట్లు తెలిపింది. దీంతో, మధ్యప్రాచ్యం, మారిషస్, సింగపూర్‌లలో ఇప్పటికే ఉన్న తన అంతర్జాతీయ ఉనికితో పాటు, భారతదేశంలోని ప్రధాన ఆర్థిక, సంపద నిర్వహణ కేంద్రాల్లో కూడా అర్ధ భారత్‌కు ప్రత్యక్ష కార్యాచరణ ఉనికి ఏర్పడుతుంది. భారతదేశంలో వేగంగా పెరుగుతున్న అధిక నికర విలువ మరియు అత్యంత అధిక నికర విలువ కలిగిన పెట్టుబడిదారుల సంఖ్య, ప్రత్యేకమైన గ్లోబల్ పెట్టుబడి పరిష్కారాలను అందించే ఫండ్ మేనేజర్లకు గణనీయమైన అవకాశాలను సృష్టిస్తోంది. హురున్ గ్లోబల్ జాబితా ప్రకారం, 300 మందికి పైగా బిలియనీర్లతో, అమెరికా, చైనా తర్వాత అత్యధిక బిలియనీర్లు ఉన్న దేశంగా భారతదేశం ప్రపంచంలో మూడో స్థానంలో నిలిచింది. దీని ఫలితంగా దేశంలో వెల్త్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ వేగంగా విస్తరిస్తోంది. సంపన్న పెట్టుబడిదారుల సంపదను సంరక్షించడంతో పాటు మరింత పెంపొందించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై సలహాలు అందించే వెల్త్ మేనేజర్ల నెట్‌వర్క్ కూడా నిరంతరం విస్తరిస్తోంది.

ప్రణాళికలో ఉన్న కొత్త ఫండ్‌ల ప్రారంభం, అంతర్జాతీయ విస్తరణ, అలాగే వేగంగా పెరుగుతున్న భారతీయ సంపన్న పెట్టుబడిదారులు మరియు ఫ్యామిలీ ఆఫీసెస్‌ను లక్ష్యంగా చేసుకున్న వ్యూహం ద్వారా, ప్రత్యేకమైన గ్లోబల్ పెట్టుబడి అవకాశాలపై పెరుగుతున్న డిమాండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని అర్ధ భారత్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ వ్యూహంతో, రాబోయే మూడు సంవత్సరాల్లో తన నిర్వహణలోని మొత్తం ఆస్తుల (ఎయుఎం) విలువను 1.5 బిలియన్ డాలర్లకు రెండింతలు పెంచాలని సంస్థ భావిస్తోంది.

అంతర్జాతీయ విస్తరణకు అర్ధ భారత్ ప్రణాళికలు

అంతర్జాతీయ స్థాయిలో తన ఉనికిని మరింత బలోపేతం చేసే వ్యూహంలో భాగంగా, అర్ధ భారత్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ ఇప్పటికే ఒమాన్, దుబాయ్‌లలో ఉన్న తన కార్యకలాపాలను ఆధారంగా చేసుకుని మధ్యప్రాచ్యంలో తన ఉనికిని మరింత విస్తరించాలని యోచిస్తోంది. అదేవిధంగా, మారిషస్ మరియు సింగపూర్ వంటి ఇతర అంతర్జాతీయ ఆర్థిక సేవల కేంద్రాల్లో కూడా కార్యకలాపాలను ప్రారంభించే అవకాశాలను ఈ ఫండ్ హౌస్ పరిశీలిస్తోంది.

ఈ విస్తరణ ద్వారా అర్ధ భారత్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ అంతర్జాతీయ

బరోడా బీఎన్‌పీ పరిబాస్ మల్టీ అసెట్ యాక్టివ్ ఎఫ్.ఓ.ఎఫ్. కు ఏడాది పూర్తి

- తొలి ఏడాదిలోనే పెట్టుబడిదారులకు రెండంకెల రాబడి

ముంబై, జూలై 31 (ప్రజా కలం ప్రతినిధి)

బరోడా బీఎన్‌పీ పరిబాస్ మ్యూచువల్ ఫండ్ నేడు తన బరోడా బీఎన్‌పీ పరిబాస్ మల్టీ అసెట్ యాక్టివ్ ఫండ్ ఆఫ్ ఫండ్స్ (ఖీూఖీ) ప్రారంభమై ఏడాది పూర్తయినట్లు ప్రకటించింది. 2025 జూన్ 30న ప్రారంభమైన ఈ ఫండ్, ప్రారంభం నుంచి 10.31 శాతం రాబడిని అందించడంతో పాటు, తన బెంచ్‌మార్క్ పనితీరును అధిగమించి ఒక కీలక మైలురాయిని చేరుకుందని సంస్థ వెల్లడించింది.

ఈ పథకం ఒక సంవత్సర కాలంలో 10.67 శాతం రాబడిని అందించగా, దాని కాంపోజిట్ బెంచ్‌మార్క్ అదే కాలంలో 10.38 శాతం రాబడిని నమోదు చేసింది. దీంతో, ఈ ఫండ్ ప్రారంభమైన సమయంలో రూ. 1 లక్ష పెట్టుబడి పెట్టిన పెట్టుబడిదారుడి పెట్టుబడి విలువ, కేవలం ఏడాదికి కొద్దిగా మించిన వ్యవధిలోనే సుమారు రూ. 1.11 లక్షలకు పెరిగింది.

ఈక్విటీ, డెట్, బంగారంలో పన్ను ప్రయోజనాలతో కూడిన సమగ్ర, విభిన్నీకృత పెట్టుబడి పరిష్కారం

బరోడా బీఎన్‌పీ పరిబాస్ మల్టీ అసెట్ యాక్టివ్ ఫండ్ ఆఫ్ ఫండ్స్, ఒకే పెట్టుబడి ద్వారా పలు ఆస్తి వర్గాల్లో విభిన్నీకృత పెట్టుబడి అవకాశాలను కోరుకునే ఇన్వెస్టర్ల కోసం రూపొందించబడింది. ఈ పథకం ఈక్విటీ, డెట్, బంగారం వంటి వివిధ ఆస్తి వర్గాల్లో

పెట్టుబడులు పెడుతుంది. మారుతున్న మార్కెట్ పరిస్థితులు, అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలకు అనుగుణంగా ఈ ఆస్తుల కేటాయింపులను ఫండ్ మేనేజ్‌మెంట్ బృందం చురుకుగా నిర్వహిస్తుంది.

ఈ ఆస్తుల కేటాయింపు వ్యూహం, మూలధన విలువ పెరుగుదల మరియు పోర్ట్‌ఫోలియో స్థిరత్వం మధ్య సమతుల్యతను సాధించడంతో పాటు, వివిధ మార్కెట్ చక్రాల్లోనూ పెట్టుబడిదారులు అవకాశాలను నద్వినియోగం చేసుకునేలా రూపొందించబడింది. ఈ ఫండ్, లిలిఈక్విటీ ఆధారిత మల్టీ అసెట్ ఎఫ్.ఓ.ఎఫ్.లతో పోలిస్తే తక్కువ అస్థిరతతో, రిస్క్‌కు అనుగుణంగా స్థిరమైన రాబడులను అందించేలా రూపొందించబడింది.

24 నెలల కంటే ఎక్కువ కాలం పెట్టుబడి పెట్టిన పెట్టుబడిదారులు 12.50% చొప్పున దీర్ఘకాలిక మూలధన లాభాల పన్నుతో పాటు అదనపు ప్రభుత్వ ఛార్జీలను (ఈక్విటీ-ఆధారిత ఫండ్‌ల మాదిరిగా) పొందవచ్చు.

ఈ పథకం, మూడు ఆస్తి వర్గాలకు చెందిన మ్యూచువల్ ఫండ్ పథకాల పోర్ట్‌ఫోలియోలో పెట్టుబడులు పెట్టడం ద్వారా, దీర్ఘకాలిక మూలధన వృద్ధితో పాటు ఆదాయాన్ని సృష్టించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది.

వాస్తవిక మల్టీ అసెట్ పోర్ట్‌ఫోలియోను ప్రతిబింబించేలా రూపొందించిన బెంచ్‌మార్క్

ఈ పథకం పనితీరును కింది అంశాలతో కూడిన సమ్మిళిత బెంచ్‌మార్క్‌తో పోల్చి అంచనా వేస్తారు:

60% -- నిఫ్టీ కాంపోజిట్ డెట్ ఇండెక్స్

20% -- నిఫ్టీ 500 టోటల్ రిటర్న్ ఇండెక్స్

20% -- భారతీయ రూపాయల్లో బంగారం ధర

ఈ బెంచ్‌మార్క్, ఫండ్ అనుసరిస్తున్న విభిన్నీకృత, చురుకైన పెట్టుబడి నిర్వహణ విధానానికి ప్రతిరూపంగా ఉంటుంది.

తక్కువ కనీస పెట్టుబడితో అందరికీ అందుబాటులో పెట్టుబడి అవకాశం

బరోడా బీఎన్‌పీ పరిబాస్ మల్టీ అసెట్ యాక్టివ్ ఫండ్ ఆఫ్ ఫండ్స్, విభిన్నీకృత పెట్టుబడిని విస్తృత శ్రేణి ఇన్వెస్టర్లకు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో రూపొందించబడింది.

ఇన్వెస్టర్లు కింది కనీస మొత్తంతో పెట్టుబడిని ప్రారంభించవచ్చు:

కనీస ఒకేసారి పెట్టుబడి: రూ. 1,000

అదనపు పెట్టుబడులు: రూ. 1 నుంచి, ఆ తర్వాత రూ. 1 గుణిజాల్లో

నెలవారీ ఎస్ఐపీ: రూ. 500 నుంచి ప్రారంభం, ఆ తర్వాత రూ. 1 గుణిజాల్లో పెట్టుబడి పెట్టవచ్చు.

ఈ పథకంలో ప్రవేశ రుసుము లేదు. అయితే, మధ్యకాలిక పెట్టుబడులను ప్రోత్సహించే ఉద్దేశంతో, పెట్టుబడి చేసిన తేదీ నుంచి ఒక సంవత్సరం పూర్తికాకముందే యూనిట్లను రిడీమ్ చేసినా లేదా మరో పథకానికి మార్చుకున్నా, 1% ఎగ్జిట్ లోడ్ విధించబడుతుంది.

దీర్ఘకాలిక సంపద సృష్టికి నిపుణుల నిర్వహణలో సమగ్ర పెట్టుబడి పరిష్కారం

బరోడా బీఎన్‌పీ పరిబాస్ మల్టీ అసెట్ యాక్టివ్ ఫండ్ ఆఫ్ ఫండ్స్, ఈక్విటీ, డెట్, బంగారం వంటి ఆస్తి వర్గాల్లో ఒకే పెట్టుబడి పరిష్కారం ద్వారా చురుకుగా నిర్వహించే పెట్టుబడులను అందిస్తూ, పోర్ట్‌ఫోలియో విభిన్నీకరణను సులభతరం చేయడంతో పాటు, క్రమశిక్షణతో కూడిన ఆస్తుల కేటాయింపు ద్వారా ఇన్వెస్టర్లు దీర్ఘకాలిక సంపదను సృష్టించుకునేలా సహాయపడటాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకం ద్వారా ఇన్వెస్టర్లు తమ పోర్ట్‌ఫోలియోను తరచుగా స్వయంగా సమతుల్యం చేయాల్సిన అవసరం లేకుండానే, పలు ఆస్తి వర్గాల్లో నిపుణుల ఆధ్వర్యంలోని ఫండ్ నిర్వహణ ప్రయోజనాన్ని పొందవచ్చు. అందువల్ల, విభిన్నీకృత, దీర్ఘకాలిక పెట్టుబడి వ్యూహాన్ని అనుసరించాలనుకునే ఇన్వెస్టర్లకు ఇది అనువైన పెట్టుబడి పరిష్కారంగా నిలుస్తుంది.

ఫెర్నాండెజ్ ఫౌండేషన్, జీవీకే హెల్త్‌తో భాగస్వామ్య ఒప్పందం

- జూబ్లీ హిల్స్ వేదికగా జీవీకే హెల్త్‌లో కొత్త ఫెర్నాండెజ్ ఔట్‌పేషెంట్ క్లినిక్ ప్రారంభం..

- 77 ఏళ్ల విశ్వసనీయ మహిళా ఆరోగ్య సంరక్షణతో సేవలు..

- స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కాలపరిమిత మహిళా ఆరోగ్య ప్యాకేజీతో ఔట్‌పేషెంట్ క్లినిక్ సేవలు..

-మహిళలు నివారణ సంరక్షణకు ప్రాధాన్యతనిచ్చేలా ప్రోత్సహిస్తూ ప్రత్యేక ప్యాకేజీ..



హైదరాబాద్, జూలై 31 (ప్రజా కలం ప్రతినిధి)

మహిళలు, నవజాత శిశువుల ఆరోగ్య సంరక్షణలో భారతదేశంలో అత్యంత విశ్వసనీయమైన సంస్థలలో ఒకటైన ఫెర్నాండెజ్ ఫౌండేషన్ (FF), జూబ్లీ హిల్స్‌లోని జీవీకే హెల్త్‌లో ప్రత్యేక ఫెర్నాండెజ్ ఔట్‌పేషెంట్ క్లినిక్‌ను ప్రారంభించేందుకు జీవీకే హెల్త్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యం ప్రసూతి, గైనకాలజీలో ఫెర్నాండెజ్ ఫౌండేషన్ యొక్క 77 ఏళ్ల వైద్య నైపుణ్యాన్ని హైదరాబాద్‌లోని అత్యంత చైతన్యవంతమైన ఆరోగ్య సంరక్షణ కేంద్రాలలో ఒకటైన జూబ్లీ హిల్స్‌కు తీసుకువస్తుంది. తద్వారా నగరవ్యాప్తంగా మహిళలు వారి కుటుంబాలకు నిపుణులైన మహిళా ఆరోగ్య సంరక్షణ మరింత అందుబాటులోకి, సౌకర్యవంతంగా మారుతుంది. ఈ నేపథ్యంలో జీవీకే హెల్త్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుమన్ రాజు జె, ఫెర్నాండెజ్ ఫౌండేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సమీర్ వీరా ఈ కొత్త ఔట్‌పేషెంట్ క్లినిక్‌లో ఈ భాగస్వామ్యాన్ని ప్రకటించారు.

ఈ క్లినిక్ గర్భధారణ సంరక్షణ, సంతాన సాఫల్య మూల్యాంకనం, నివారణ గైనకాలజీ, కౌమార – రుతుక్రమ ఆరోగ్య సంరక్షణతో పాటు సంక్లిష్టమైన గైనకాలజీ సమస్యల నిర్వహణతో సహా సమగ్ర ప్రసూతి, గైనకాలజీ సేవలను అందిస్తుంది.

స్వాతంత్ర్య దినోత్సవ ప్రత్యేక ప్రారంభోత్సవ ఆఫర్..

జీవీకే హెల్త్‌లో ఫెర్నాండెజ్ ఔట్‌పేషెంట్ క్లినిక్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని, ఫెర్నాండెజ్ ఫౌండేషన్ 1 నుండి 15 ఆగస్టు 2026 వరకు పరిమిత కాల (తాత్కాలిక) స్వాతంత్ర్య దినోత్సవ మహిళా ఆరోగ్య ప్యాకేజీని అందిస్తోంది. ఇందులో భాగంగా రూ. 1,947 ధర గల ఈ ప్యాకేజీలో గైనకాలజీ కన్సల్టేషన్, ఖాన, పెల్విక్ అల్ట్రాసౌండ్, జడీజ, పాప్ స్మియర్, HbA1c ఉన్నాయి. ఇది మహిళల నివారణ ఆరోగ్య సంరక్షణకు తోడ్పడే ముఖ్యమైన స్క్రీనింగ్ పరీక్షలను ఒకచోట చేర్చుతుంది. ఈ ప్యాకేజీ కింద గైనకాలజీ కన్సల్టేషన్లు జీవీకే హెల్త్, జూబ్లీ హిల్స్‌లో ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 1:00 గంటల మధ్య అందుబాటులో ఉంటాయి. ముందుగా బుకింగ్ చేసుకోవడం తప్పనిసరి.. మరియు ఉచిత కన్సల్టేషన్ ప్యాకేజీలో భాగంగా మాత్రమే లభిస్తుంది.

టైమ్ సెన్స్ లో సౌత్‌కు మార్కులేసిన కాజల్

ఇండియన్ సినీ ఇండస్ట్రీలో భాషల మధ్య పోటీ ఎంత పెరుగుతుందో, వర్క్ కల్చర్ మరియు కథల ఎంపికలపై డిస్కషన్ కూడా అంతే వేగంగా ముందుకు సాగుతోంది. ముఖ్యంగా సౌత్ సినీ ఇండస్ట్రీలో సమయపాలన, ప్రొఫెషనల్ వాతావరణం, హీరోయిన్ల క్యారెక్టర్ రైటింగ్ లో కనిపిస్తున్న మార్పులు ఇప్పుడు జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారుతున్నాయి. ప్రముఖ నటి కాజల్ అగర్వాల్ తాజా కామెంట్స్ ఈ రెండు అంశాలను మరోసారి హైలైట్ చేశాయి. సినీ నిర్మాణంలో టైమ్ అనేది ఎంతో కీలకమైనది. ఒక షూటింగ్ షెడ్యూల్ ఆలస్యమైతే దాని ఎఫెక్ట్ నటీనటుల డేట్స్ నుంచి టెక్నికల్ టీమ్ వర్క్ అవర్స్ వరకు విస్తరిస్తుంది. ఈ నేపథ్యంలో సౌత్ ఇండస్ట్రీలో షెడ్యూల్‌కు కట్టుబడి పనిచేసే విధానం, బాలీవుడ్‌లో తరచుగా కనిపించే ఆలస్యాల సంస్కృతి మధ్య తేడాపై కాజల్ చేసిన కామెంట్స్ ప్రొడక్షన్ ఎఫిషియెన్సీపై కొత్త డిస్కషన్ కు దారితీశాయి. టైమ్ సెన్స్ అనేది కేవలం వ్యక్తిగత అలవాటుగా కాకుండా, మొత్తం సినిమా నిర్మాణ వ్యవస్థ సామర్థ్యాన్ని డిసైడ్ చేసే అంశంగా ఇండస్ట్రీ వర్గాలు భావిస్తాయి. అయితే ఆమె కామెంట్స్ కేవలం వర్క్ కల్చర్‌కే పరిమితం కాలేదు. కెరీర్ ఎంపికల విషయంలో కూడా ఎన్ని సినిమాలు చేశామనే నెంబర్ కంటే క్వాలిటీకే ప్రాధాన్యం ఇచ్చానని చెప్పడం గమనార్హం. సౌత్ లో తనకు వచ్చిన క్యారెక్టర్లు నటిగా సంతృప్తినిచ్చాయని, అందుకే సాధారణ పాత్రల కంటే స్ట్రాంగ్ స్టోరీలను సెలెక్ట్ చేసుకున్ననానే భావన ఆమె మాటల్లో కనిపించింది. పైగా గత కొన్నేళ్లుగా సౌత్ సినిమాల్లో మహిళా పాత్రల రచనలో గణనీయమైన మార్పు కనిపిస్తోంది. ఒకప్పుడు హీరో చుట్టూ తిరిగే పాత్రలకే పరిమితమైన కథనాల్లో ఇప్పుడు హీరోయిన్లకు స్వతంత్ర ప్రయాణం, ఎమోషనల్ స్ట్రెంగ్త్ వంటి అంశాలు చోటు చేసుకుంటున్నాయి. ఫ్యామిలీ స్టోరీస్, థ్రిల్లర్లు, పీరియాడిక్ డ్రామాలు, యాక్షన్ సినిమాలు అన్న తేడా లేకుండా హీరోయిన్ క్యారెక్టర్లు కథను ముందుకు నడిపించే స్థాయికి చేరుకుంటున్నాయి. ఈ పరిణామం ప్రేక్షకుల అభిరుచిలో వచ్చిన మార్పుకు కూడా ప్రతిబింబంగా కనిపిస్తోంది. కేవలం గ్లామర్ కోసం కాకుండా, కథలో బలమైన స్థానం ఉన్న పాత్రల కోసం హీరోయిన్లు ఎదురు చూస్తున్న దశకు ఇండస్ట్రీ చేరుకుంటోందనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. సమయపాలనతో కూడిన ప్రొఫెషనల్ వాతావరణం, కంటెంట్‌కు ప్రాధాన్యం ఇచ్చే కథలు, మహిళా పాత్రలకు పెరుగుతున్న ప్రాధాన్యం.. ఈ మూడు అంశాలే ఫ్యూచర్ ఇండియన్ సినిమా దిశను డిసైడ్ చేసే కీలక సూచికలుగా మారే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

యూరప్ పర్యటనలో పూజా హెగ్డే అల్లరే అల్లరి.. ప్రేమలో పడ్డ ఫ్యాన్స్!

నేటి జెన్ -జీలో వరుసగా పాన్ ఇండియన్ సినిమాల్లో నటిస్తున్న క్రేజీ బ్యూటీ పూజా హెగ్డే. దురదృష్టవశాత్తూ సోలో హీరోయిన్ గా చేసిన చాలా సినిమాలు ఫ్లాపులు అయినా.. ఈ అమ్మడికి అవకాశాల పరంగా కొదవేమీ లేదు. ఇండస్ట్రీ టాప్ బ్యూటీగా ఏల్తున్న పూజా హెగ్డే సోషల్ మీడియాలో నిరంతరం యాక్టివ్‌గా ఉంటూ తన లేటెస్ట్ అప్‌డేట్స్‌తో అభిమానులను అలరిస్తోంది. తాజాగా ఈ ముంబై బ్యూటీ హంగేరీ రాజధాని బుడాపెస్ట్ నగర పర్యటనకు సంబంధించిన విశేషాలను తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేయగా ఫ్యాన్స్ లో వైరల్ గా మారుతున్నాయి. దీనికంటే ఉత్తమమైన ట్రాక్‌ను ఎంచుకోలేకపోయేదాన్ని అనే క్యాప్షన్‌తో పూజా హెగ్డే షేర్ చేసిన ఫొటోలు వీడియోలు నెట్టింట విపరీతంగా వైరల్ అవుతున్నాయి. యూరప్‌లోని ఆహ్లాదకరమైన వాతావరణాన్ని.. అక్కడి వీధుల్లో తను గడిపిన సరదా మూవ్ మెంట్స్ ను ఈ పోస్ట్ ద్వారా అభిమానులతో పంచుకున్నారు. ఈ లేటెస్ట్ ఫోటోగ్రాఫ్స్ లో పూజా హెగ్డే సరికొత్త హెయిర్ స్టైల్.. స్టైలిష్ అవుట్‌ఫిట్‌లో మెరిసిపోతూ కనిపించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కొత్త షార్ట్ హెయిర్ కట్‌తో కనిపిస్తుండటంతో ఫ్యాషన్ ప్రియుల అభిమానులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. యూరప్‌లోని ఎండలో ఈ బ్యూటీ మెరిసిపోతున్న తీరును చూసి యూరోపియన్ సన్ నీకు బాగా సరిపోయింది అంటూ నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. పూజా షార్ట్ స్కర్ట్ - క్లాసిక్ స్టైల్‌లో కనిపించిన విధానం జెన్-జెడ్ ఫ్యాషన్ ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటోంది. సోషల్ మీడియాలో ఈ పోస్ట్‌కు కామెంట్ల సెక్షన్ అభిమానుల ప్రేమతో నిండిపోయింది. వేలాది మంది అభిమానులు హార్ట్ ఫైర్ ఎమోజీలతో తమ అభిమానాన్ని చాటుకున్నారు. బ్యూటీ, జార్జియస్, ఏంజెల్ అంటూ కొందరు పొగడ్తలతో ముంచెత్తగా.. మరికొందరు పూజా నటనకు, అందానికి జేజేలు పలుకుతూ సుదీర్ఘమైన కవితాత్మక కామెంట్లను కూడా జత చేశారు. బుట్టబొమ్మ సహజసిద్ధమైన అందం, క్యూట్ హావభావాలు ప్రతి ఒక్కరినీ అమితంగా ఆకట్టుకుంటున్నాయని ప్రశంసిస్తున్నారు. కామెంట్స్ సెక్షన్ లో కొన్ని ఆసక్తికరమైన వ్యక్తీకరణలు కూడా కనిపించాయి. ఫొటోల నేపథ్యం లేదా కొన్ని సన్నివేశాలను చూసి కొందరు నెటిజన్లు ప్రముఖ ఫుట్‌బాల్ క్రీడాకారుడు ఎర్లింగ్ హాలాండ్ ప్రస్తావనను తీసుకువచ్చి హాలాండ్‌ను అసలు ఊహించలేదు అంటూ కామెంట్లు చేశారు. అలాగే తన ఫొటోగ్రఫీని మెచ్చుకుంటూ కెమెరా వెనుక ఉన్న ఫొటోగ్రాఫర్‌ను కూడా అభినందించాలని కొందరు సూచించడం విశేషం. మరికొందరు తమ అభిమాన నటిని యూరప్‌లో కలవడంపై తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. మొత్తానికి బుడాపెస్ట్‌లో పూజా హెగ్డే చేస్తున్న ఈ రచ్చ సోషల్ మీడియాలో ఒక రేంజ్‌లో ట్రెండ్ అవుతోంది. వరుస సినిమాలతో బిజీగా ఉన్నా.. లొకేషన్ల నుంచి సమయాన్ని కేటాయించుకుని ఇలాంటి స్టైలిష్ - సరదా పోస్ట్‌లు పెడుతూ అభిమానులను ఎంటర్‌టైన్ చేయడంలో పూజా ఎప్పుడూ ముందే ఉంటారు. ఈ భామ గ్లామరస్ లుక్స్, కొంటె చేష్టలు, ఫ్యాషన్ సెన్స్ మరోసారి నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. పూజా నటించిన జననాయగన్ ఇటీవలే విడుదలైన సంగతి తెలిసిందే. తదుపరి హారర్ మూవీ కాంచన 4 లో నటిస్తోంది. అలాగే శ్రీశ్రీ అనే మరో చిత్రంలోను నటిస్తూ బిజీగా ఉంది.

అఖిల్ ని లైన్ లోకి తెస్తోన్న పరశురాం!

ఇండస్ట్రీలో సక్సెస్‌ఫుల్ డైరెక్టర్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న పరశురామ్ తదుపరి ప్రాజెక్ట్ కోసం సన్నాహాలు చేస్తున్నారు. గీత గోవిందం లాంటి అద్భుతమైన విజయం తర్వాత వరుస చిత్రాలతో బిజీగా ఉన్న ఈ డైరెక్టర్ తాజాగా అక్కినేని కాంపౌండ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టారు. కొద్దికాలం క్రితం అక్కినేని నాగ చైతన్యకు పరశురామ్ ఓ సరికొత్త కథను వినిపించిన సంగతి తెలిసిందే. అయితే ఆ సమయంలో కొన్ని కారణాల వల్ల ఆ కాన్సెప్ట్ నాగ చైతన్యకు సెట్ కాలేదని, ఆ ప్రాజెక్ట్ అక్కడితోనే ఆగిపోయిందని ప్రచారం జరిగింది. తాజా సమాచారం ప్రకారం నాగ చైతన్య వద్దకు వెళ్ళి సెట్ కాని ఆ క్రేజీ కథ ఇప్పుడు అఖిల్ అక్కినేని దగ్గరకు చేరినట్లు తెలుస్తోంది. పరశురామ్ ఇటీవల అఖిల్‌ను కలిసి ఈ స్టోరీ వినిపించారట. అఖిల్ కూడా కథ పట్ల సానుకూలంగా స్పందించినట్లు ఫిలిం నగర్ వర్గాలలో జోరుగా ప్రచారం జరుగుతోంది. అఖిల్ బాడీ లాంగ్వేజ్‌కు, మాస్ అండ్ ఎనర్జిటిక్ ఇమేజ్‌కు సరిగ్గా సరిపోయేలా పరశురామ్ స్క్రిప్ట్‌ను మరింతగా మార్పులు చేస్తున్నట్లు సమాచారం. అయితే ఇక్కడే విశ్లేషకులలో మరో చర్చ కూడా నడుస్తోంది. నాగ చైతన్యకు వినిపించిన అదే పాత కథను అఖిల్ కు కొద్దిగా మార్చి చెబుతున్నారా? లేక అఖిల్ కోసం పరశురామ్ పూర్తిగా కొత్త కథను సిద్ధం చేశారా? అనే దానిపై పూర్తి స్పష్టత రావాల్సి ఉంది. మంచి హిట్ కోసం ఎదురు చూస్తున్న అఖిల్‌కు పరశురామ్ లాంటి మాస్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ల దర్శకుడు కథ చెప్పడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ప్రాజెక్ట్ పాత కథా లేక సరికొత్త కాన్సెప్ట్ అనేది త్వరలోనే అధికారికంగా తేలనుంది. అఖిల్ అక్కినేని సినిమాల ఎంపిక విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఇటీవలే లెనిన్ తో హిట్ అందుకున్న అఖిల్ తదుపరి చిత్రం విషయంలో అంతకు మించి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయితే పరశురామ్ చెప్పిన కథ పట్ల ఆసక్తిగా ఉన్నారు? అన్నది సానుకూల అంశం. పరశురామ్ డైరెక్షన్‌లో వస్తే సినిమా ఏ స్థాయిలో ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. హీరోల క్యారెక్టరైజేషన్‌ను ఎలివేట్ చేయడంలో, లవ్ అండ్ ఫ్యామిలీ సెంటిమెంట్‌ను బ్యాలెన్స్ చేయడంలో పరశురామ్ స్టైలే వేరు. ఈ కాంబినేషన్ గనుక సెట్ అయితే అఖిల్‌కు అదిరిపోయే కమర్షియల్ హిట్ పడటం ఖాయమని ఫ్యాన్స్ నమ్ముతున్నారు.

పూరి కెరీర్ లో లాంగ్ గ్యాప్ ఇదేనేమో!

టాలీవుడ్ లో అత్యంత వేగంగా సినిమాలు తెరకెక్కించే దర్శకుడిగా పూరి జగన్నాథ్ ప్రత్యేకమైన పేరుంది. చాలా మంది దర్శకులు సినిమా పూర్తి చేయడానికి సంవత్సరాల తరబడి సమయం తీసుకుంటే పూరి మాత్రం ఆరు నెలల్లోనే స్క్రిప్ట్ పూర్తి చేసి థియేటర్లోకి తీసుకురాగల సత్తా ఉన్న మేకర్. ఆయన సినిమాల స్పీడ్ చూసి ట్రేడ్ వర్గాలు సైతం ఆశ్చర్యపోతుండేవి. అయితే స్పీడ్ విషయంలో కొన్ని హెచ్చరికలు రావడంతో డబుల్ ఇస్మార్ట్ శంకర్ నుంచి స్పీడ్ తగ్గించి పనిచేస్తానని ప్రామిస్ చేసారు. ఆ సినిమాకు అలాగే పనిచేసారు. ఎంతో గ్రౌండ్ వర్క్ చేసి సమయం తీసుకుని ఆ చిత్రాన్ని రిలీజ్ చేసారు. కానీ ఫలితం మాత్రం తీవ్ర నిరాశనే మిగిల్చింది. దీంతో పూరి ఇలా నెమ్మదిగా పని చేయడం కంటే పాత పద్దతిలోనే ముందుకెళ్లాలని భావించారు. కానీ తాజా పరిణామాలు చూస్తుంటే పూరి వేగం పూర్తిగా మందగించినట్లు కనిపిస్తుంది. పూరి జగన్నాథ్ కెరీర్‌లో ఇప్పటి వరకు ఏ సినిమా కూడా ఇంత భారీ గ్యాప్ తీసుకుని ఇన్ని వాయిదాల తర్వాత విడుదలవుతున్న దాఖలాలు లేవు. ఆయన కెరీర్‌లోనే ఇది అత్యంత సుదీర్ఘమైన గ్యాప్‌గా ట్రేడ్ పండితులు అభివర్ణిస్తున్నారు. ప్రస్తుతం పూరి తెరకెక్కిస్తున్న తాజా చిత్రం స్లమ్ డాగ్ షూటింగ్ , నిర్మాణ కార్యక్రమాలు అత్యంత మందకొడిగా సాగుతున్నాయి. ఈ ప్రాజెక్ట్ వివిధ కారణాల వల్ల నత్తనడకన సాగుతూ వస్తోంది. రిలీజ్ కు సంబంధించి అధికారిక అప్‌డేట్లు రాకపోవడంతో అభిమానులు కూడా తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఒకప్పుడు ఏడాదికి రెండు సినిమాలు ఇచ్చే దర్శకుడు ఇప్పుడు ఒక సినిమాను పూర్తి చేయడానికి సుదీర్ఘ సమయం తీసుకోవడం పూరి కెరీర్‌లోనే తొలిసారి అని చెప్పొచ్చు. అయితే ఈ లాంగ్ గ్యాప్ వెనుక పూరి ప్లానింగ్ గట్టిగానే ఉందనే వాదన కూడా వినిపిస్తోంది. వరుస ఫ్లాప్‌ల నుంచి బయటపడాలంటే వేగమే కాకుండా పక్కా కంటెంట్ ముఖ్యం అని గ్రహించినట్లు తెలుస్తోంది. స్లమ్ డాగ్ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏ చిన్న లోపం లేకుండా తెరకెక్కించాలనే సంకల్పంతో ఇంత సమయాన్ని తీసుకుంటున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాతో మళ్లీ బాక్సాఫీస్ వద్ద తన సత్తా ఏంటో నిరూపిం చుకోవాలని కసిగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే పూరి జగన్నాథ్ కెరీర్‌లో ఇంతటి లాంగ్ గ్యాప్ రావడమనేది అభిమానులను ఆందోళనకు గురి చేస్తున్నా ఈ విరామం సినిమా అవుట్‌పుట్‌ను మాత్రం అద్భుతంగా మారుస్తుందని ఆశిస్తున్నారు.

కంటెంట్ తో పని లేకుండా కలెక్షన్స్

ఏదైనా సినిమా బాక్సాఫీస్ దగ్గర మంచి కలెక్షన్స్ సాధిస్తే అందులో కథ లేదా మేకింగ్ బాగుందని అనుకుంటారు. కానీ కొన్నిసార్లు సినిమా రిజల్ట్ తో సంబంధం లేకుండా చుట్టూ ఉన్న పరిస్థితులు, రిలీజ్ టైమ్ కలిసిరావడం వల్ల కూడా వసూళ్లు భారీగా వస్తుంటాయి. ప్రస్తుతం దళపతి విజయ్ నటిస్తున్న జననాయగన్ సినిమా విషయంలో కూడా సరిగ్గా ఇదే జరుగుతోందని ట్రేడ్ వర్గాల్లో టాక్ నడుస్తోంది. సినిమాకు మిక్స్డ్ టాక్ వచ్చినా కూడా బాక్సాఫీస్ దగ్గర కలెక్షన్స్ తగ్గకపోవడం వెనుక కొన్ని ప్రత్యేకమైన కారణాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం తమిళనాడులో వేరే పెద్ద హీరోల సినిమాలు థియేటర్లలో ఏవీ లేకపోవడం ఈ చిత్రానికి పెద్ద ప్లస్ పాయింట్ గా మారింది. ఆడియన్స్ కు థియేటర్ కి వెళ్తే వేరే ఆప్షన్స్ లేవు. దాంతో సోలోగా వచ్చిన ఈ సినిమాకు స్క్రీన్స్ అన్నీ దక్కాయి. దీనికి తోడు విజయ్ కి ఇదే చివరి సినిమా కావడం, ఇకపై ఆయన సినిమాలకు గుడ్ బై చెప్పేస్తుండటం కూడా కలెక్షన్లకు బాగా కలిసొచ్చింది. ముఖ్యంగా విజయ్ ప్రస్తుతం తమిళనాడు ముఖ్యమంత్రిగా ఉండటంతో ఈ సినిమాకు ఒక రేంజ్ లో క్రేజ్ వచ్చింది. ఒక పక్క రాష్ట్రానికి సీఎంగా ఉంటూనే ఆయన నటించిన చివరి చిత్రం థియేటర్లలోకి రావడంతో ఫ్యాన్స్ తో పాటు నార్మల్ ఆడియన్స్ కూడా సినిమా చూడటానికి ఆసక్తి చూపిస్తున్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న స్టార్ హీరో స్క్రీన్ మీద ఎలా కనిపిస్తాడో చూడాలనే క్యూరియాసిటీ జనాలను థియేటర్ల వైపు నడిపిస్తోంది. ఇలాంటి కొన్ని అంశాలు అనుకూలంగా మారడం వల్లే ఫస్ట్ వీక్ లో కలెక్షన్స్ ఈ రేంజ్ లో వచ్చాయని చెప్పవచ్చు. సినిమా కంటెంట్ మాత్రమే కాకుండా, ఈ రిలీజ్ టైమింగ్స్, కాంపిటీషన్ లేకపోవడం కలగలిపి కలెక్షన్ల గ్రాఫ్ పడిపోకుండా కాపాడాయి. ఇలాంటి ప్లస్ పాయింట్స్ అన్నీ ఒకేసారి సెట్ అవ్వడం వల్ల టాక్ తో పనిలేకుండా బాక్సాఫీస్ దగ్గర సినిమా క్లిక్ అయిపోయింది. మరోవైపు విజయ్ రెమ్యునరేషన్ గురించి వస్తున్న వార్తలకు కూడా ఈ కలెక్షన్స్ ఒక క్లారిటీ ఇచ్చేలా ఉన్నాయి. ఈ సినిమా కోసం ఆయన దాదాపు రెండు వందల కోట్ల పారితోషికం తీసుకున్నారనే టాక్ చాలా రోజులుగా నడుస్తోంది. ఒక హీరోకి అంత పెద్ద అమౌంట్ ఇవ్వడం రిస్క్ అని చాలామంది అనుకున్నారు. కానీ సినిమా కథ మీద నెగిటివిటీ ఉన్నా కూడా, కేవలం ఆయన క్రేజ్ తోనే ఈ స్థాయిలో ఓపెనింగ్స్ రావడం చూస్తుంటే ఆ గాసిప్స్ లో నిజం ఉందేమో అనిపిస్తోంది. రాబోయే రోజుల్లో ఈ సినిమా ఫుల్ రన్ లో ఎంత వసూలు చేస్తుందనేది పక్కన పెడితే, ప్రస్తుతానికి మాత్రం తమిళ ఇండస్ట్రీలో విజయ్ స్టార్ డమ్ కి ఉన్న పవర్ ఏంటో ఈ వసూళ్లు క్లియర్ గా చూపిస్తున్నాయి.

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from 6-5-41/A, Arundelpet 5/1, Pasumalai Complex, 1st Floor, Guntur, Andhra Pradesh -522002 Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI. No. APTEL/26/A6182,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com